


2005 - 2006 లో...

# మేషరాశి ఫలితములు

ఆదాయం-14 వ్యయం-14 | గౌరవం-3 అగౌరవం-6

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాద ముల యందు జన్మించిన వారు “చూ, చే, చో, లా, లీ, లూ, లే, లో, ఆ” అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు మేషరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

వీళ్ళ జీవితంలో ఒడిదుడుకులు ఎక్కువ. చాలా శ్రమించి, ఎన్నో బాధ్యతలు నేరవేర్చి మంచి స్థితికి వస్తారు. బాల్యంలో కష్టాలు, యవ్వనంలో ఆత్మీయ స్నేహ వర్గాన్ని విడిచి పెట్టి, ఇతర ప్రాంతాలకు వెళ్ళడం, కుటుంబ పరిస్థితులు ఇబ్బందికరంగా మారుట, బాధ్యతలు మోయాల్సిన స్థితికి రావడం. ఆర్థిక పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందో చాలా చిన్న వయసులోనే తెలుస్తుంది. స్నేహితులను ఆదుకొనడంలో వెనుకా ముందు యొచన చేయరు. క్రీడల పట్ల అభిమానం, సాహస క్రీడల పట్ల మరింత అభిమానం ఉంటుంది. భార్య వైపు బంధువులు కొంతకాలం పెత్తనం చెలాయిస్తారు. ఆస్థి కొరకు, కనిపెట్టుకొని కూర్చునేవాళ్ళు, అధికారాన్ని ఉపయోగించి మేలు చేస్తారని ఆశించేవాళ్ళు బంధువర్గంలో అధికంగా ఉంటారు. చాలా సందర్భాలలో మంచి వాళ్ళను చేరదీయడానికి ఏవో కారణాలు ఏర్పడతాయి. జీవితంలో అది కొంత వెలితిగా అనిపిస్తుంది. పరాయి స్త్రీల వల్ల ఇబ్బందులు ఏర్పడతాయి. వృత్తి ఉద్యోగుల్లో మంచి పురోగతి కలిగి వుంటారు. సాంకేతిక, క్రీడ, న్యాయ సంబంధిత, భూమి సంబంధిత, యంత్ర సంబంధిత ఉద్యోగ వ్యాపారాల్లో బాగుగా రాణిస్తారు. సంతానం వల్ల, స్నేహితుల వల్ల ఇబ్బందులు మానసిక ఉద్వేగం కలుగుతాయి. బోగస్ సంస్థల వల్ల నష్టపోతారు. స్థిరాస్థుల వల్ల లాభం, మానసిక ధైర్యం, సాహస నిర్ణయాలు, విదేశీ విషయాలు కలిసి వస్తాయి. ధైర్యం చేసి సందర్భాను సారంగా తీసుకునే నిర్ణయాలు కలిసివస్తాయి. భాగస్వామ్య విభేదాలు జీవితంలో ఓ మలుపుగా చెప్పదగినది. లిఖిత పూర్వక విషయాల్లో ఇతరులకు చెప్పే జాగ్రత్తలు ఏవీ ఆచరణలో పెట్టరు. అనుభవం లేని వ్యాపారాలు నమ్మకమే పెట్టుబడిగా బెట్టి చేసి నష్టపోతారు. షేర్ల బిజినెస్ కలిసిరాదు. వర్గ సంబంధమైన వైషమ్యాలు ప్రారంభంలో ఇబ్బంది కలిగించినా ఎక్కువగా లాభిస్తాయి. గనుల వ్యాపారం, నూనెల వ్యాపారం లాభిస్తాయి. ప్రింటింగ్, చిట్‌ఫండ్స్ వ్యాపారాలు లాభించవు. పాడి పరిశ్రమలో నూతన ప్రయోగాలు లాభిస్తాయి. ఎందరికో ఉపాధి కల్పిస్తారు. సోమరితనం పట్ల చెప్పలేని కోపం, సాధారణంగా అబద్ధాలు ఆడని నైజం, వైద్య విషయాలలో అఖండ జ్ఞాపకశక్తి, పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి.

అనుచరగణం వృద్ధి పొందుతారు. ఓ స్థాయికి వచ్చిన తదుపరి పాత అనుచర గణమ్ ఇబ్బందికరంగా మారుతారు. రాజకీయంగా గురువులను అధిగమిస్తారు. శిష్యులవల్ల ఇబ్బంది, పోటీ ఎదుర్కొంటారు. భూమి తగాదాలు, సహకారుల విషయాలు జీవితంలో చెప్పకోదగిన మలుపులకు కారణం అవుతాయి. కోపం అదుపులో ఉంచుకుంటే చాలా సాధిస్తారు. కుటుంబంలో ఐక్యత ప్రశాంతత ఉన్నంతవరకూ బైట అన్ని విషయాలను విజయపథంలో నడిపించగలరు. సుబ్రహ్మణ్యస్వామి పూజ, లక్ష్మీదేవి పూజ చేయడం వల్ల కష్టకాలం అధిగమించగలరు. స్త్రీలకు సంబంధించిన విషయాలు వివాదాస్పదంకానంత వరకూ ప్రతిష్టకు ఇబ్బంది లేదు. పత్రికలు, సమాచార సాధనాల వల్ల ప్రయోజనం, నష్టం సరిసమానంగా ఉంటాయి. స్త్రీలకు జీవిత భాగస్వామి, సంతానం వల్ల కొంత ఒడిద్దుడుకులు ఏర్పడినా చివరకు సమస్యలు సమసిపోతాయి. జ్యేష్ట సంతానం విషయంలో ఈ రాశివారు అధిక జాగ్రత్తలు వహించాలి. చాలా విషయాల్లో మనోధైర్యమే రక్షిస్తుంది. ఆడంబరం లేని పూజా విధానం గుప్తంగా చేసే దానాలు మంచి ఫలితాలనిస్తాయి. మంచి మిత్రులకు ఇచ్చిన వాగ్ధానాలు మరువకండి. మేలు జరుగుతుంది. సహాయ సహకారాలు అర్థించేవారందరూ అవకాశవాదులు, దొంగలు కాదని గ్రహిస్తే మరింత మేలు కలుగుతుంది. తూర్పు,

ఉత్తరం సింహద్వారాలు శుభప్రదం. గురువారం విష్ణుపూజ విశేష ఫలితం. నెలలో ఒక్క గురువారమైనా గంధ పుష్పాక్షతలతో విష్ణువునకు పూజచేసి మహా నివేదన పెట్టండి మంచి జరుగుతుంది. రాశి లక్షణాలు, ఇతర సమస్యలు చెప్పి పరిష్కారం చెప్పకపోవడం శాస్త్ర ధర్మం కాదు. అందుకని ఈ రాశివారికి మంచి జరగడానికి అవకాశం ఉన్న విషయా లను కూడా ప్రస్తావించాను.

ఈ రాశి వారికి ఈ సంవత్సరం గతంలో కంటే అనుకూలంగా ఉంది. మాట మీద నిలబడే వ్యక్తులే కొండంత అండ అవుతారు. ఆరవ స్థానంలో గురువు, వ్యయంలో రాహువు, చతుర్థంలో శని ప్రధాన ఫలితాలు నిర్ధేశిస్తున్నారు. చికాకు పడకుండా అన్ని సవ్యంగా, సాలోచనగా, కాస్త ఆలస్యమైనా పరిశీలించుకొని పని చేయండి మేలు జరుగుతుంది. రాశ్యాధిపతి అస్థిరత్వం కారణంగా స్పష్టమైన నిర్ణయములు చేయలేరు. త్వరితగతిన నిర్ణయాలు చేయడం వల్లనే లాభం కలుగుతుంది. అప్పు చేసి స్థిరాస్థులు ఏర్పరచుకుంటారు. ఉద్యోగములో స్థానచలనం, వృత్తిలో మార్పులు కొంత కాలము మీ మానసిక అలసటకు కూడా కారణమవుతుంది. మీపై పిటీషన్లు, విచారణలు పెద్దగా ప్రభావం చూపించ లేకపోవచ్చు. స్థిరాస్తులను అమ్మేటప్పుడు జాగ్రత్త వ్యవహరించడం ఎంతైనా మేలు. వాహన సౌఖ్యం కోసం, శరీర సౌఖ్యం కోసం, ఇంకా గృహ విషయాలకు కావలసిన అత్యవసర సామాగ్రులు, విలాసవంతమైన వస్తువుల కొరకు అధికముగా ధనాన్ని వెచ్చిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లాలనుకునే మీ మనోరథం, విదేశగమన సంకల్పం ఉన్నత విద్యాభ్యాస యత్నం అనుకూలిస్తాయి. వ్యాపారపరంగా మీకు వచ్చిన అధికలాభము భాగస్వాముల కొరకు (లేదా) మరికొంత లాభం కోసం చేసే యత్నాలకు వెచ్చించే నిమిత్తము వృధా అవుతుంది. ఆర్థికపరమైన లావాదేవీలను మీకు మీరే స్వయముగా చూసుకోవడం వలన దుబారాను సమర్థంగా అరికట్టుకోగలుగుతారు. అధికారులు, పలుకుబడిగల వ్యక్తుల సహాయ, సహకారాలు లేకుండానే గొప్ప కార్యములను సాధించి చూపిస్తారు. ఇందువల్ల మీకు పేరు ప్రఖ్యాతులు లభించడంతోపాటు, విరోధులు పెరిగే అవకాశం ఉంది. వైద్య విధానంలో నూతన పద్ధతులను అవలంబించి శారీరక స్వస్థతను పొందగలుగుతారు. విద్యార్థినీ, విద్యార్థులకు యోగవంతమైన కాలం అయిననూ గురువులు ఉన్నత స్థానాలలోని వ్యక్తులు మీ పట్ల పక్షపాత వైఖరి అవలంబించే అవకాశం వుంది. ఆరోగ్యపరంగా వైద్యుల సలహాలను పాటించడం ఉత్తమం. మీ పట్ల వివక్ష చూపించే వారిపై ఆగ్రహం వెలిబుచ్చకుండా మీలోని భావాలను పైకి కనిపించకుండా వినయంగా నడుచుకోవడం మంచిది. దీనివలన మీకు అపకారం తలపెట్టాలనుకునే వారి ఎత్తుగడలు ఫలించకుండా పోతాయి. ఒకప్పటి మీ మిత్రులే మీకు శత్రువులుగా మారే అవకాశం వున్నది. మీ పిల్లలు, ప్రియతములు మీకు పనులలో తోడ్పడతారు. మత ప్రబోధకులుగాని, గురువులుగాని మీకు సన్నిహితులుగా మారే అవకాశాలున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ముఖ్య భూమికను పోషిస్తారు. అంతర్గత రాజకీయాలు మిమ్మల్ని ఇబ్బంది పాలుచేస్తాయి. షేర్ మార్కెట్లు, స్పెక్యులేషన్లకు దూరంగా వుండటం మంచిది. మీ మాట మంచితనం వలన చాలామందికి మీరు అంతరంగికులు అవుతారు. కొంతమంది వ్యక్తులు మీ ప్రాధాన్యత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. ప్రత్యర్థి వర్గము మీకు అవమానములు ఎదురయ్యేలా చేయచ్చు. ఇందుకు మీరు తీవ్రముగా బాధపడి ప్రతిస్పందించవద్దు. స్వల్ప కాలంలో అన్ని సద్దుమణుగుతాయి. ఆరింట ఉన్న గురుగ్రహ స్థితి విచిత్రమైన ఇబ్బందులకు గురిచేస్తుంది. అత్యున్నత స్థానాలలో ఉన్నవాళ్ళు మీ విషయంలో చిన్నపిల్లల లాగా ప్రవర్తించి మీ ప్రయోజనాలను సందిగ్ధంలో పెడతారు. పనికిమాలిన వాళ్లను నెత్తికెక్కించుకొని పెత్తనం వచ్చేలా చేసినందుకు మీకు మీరుగా బాధపడతారు. ఉద్యోగపరంగా సంవత్సర ప్రథమార్థం వరకూ కత్తిమీద సాములాగా ఉంటుంది. మీ పరోక్షంలో నిర్ణయాలు జరుగుతాయి. బాధ్యత మాత్రం మీది అవుతుంది. అనవసరమైన ఖర్చు కూడా వ్యయంలో ఉన్న రాహువు వల్ల తప్పకపోవచ్చు. సమాచారం సేకరించడానికి, చట్ట నిబద్ధత కోసం, ఖర్చులు చేస్తారు. సన్నిహితవర్గ పురోగతి సంతోషం కలిగిస్తుంది. అవసర సమయంలో ఆదుకుంటారు. అమ్మనటువంటి ఆస్థి ఏదైతే ఉందో అదే గొప్పదిగా మిగులుతుంది మారిన సామాజిక పరిస్థితులు మీకు అనుకూలంగానే పరిణమిస్తాయి. శక్తి వంచనలేని కృషికి దైవం అండగా నిలుస్తాడు. జూలై నుండి గ్రహస్థితి చాలా బాగుంది. స్వంతవాళ్లకు, రక్త సంబంధీకులకు ఏదైనా చేయాలనే

తాపత్రయం తాలుకు అనుకూల ఫలితాలు కనిపిస్తాయి. నిష్పక్షపాతిగా పేరు తెచ్చుకోవడానికి మీరు పడ్డ శ్రమ ఫలిస్తుంది. భూమి లోపల ఉండే ఖనిజ సంపద తాలుకు వ్యాపార వ్యవహారాలు లాభిస్తాయి. నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి, నాగసింధూరం ధరించండి శుభం జరుగుతుంది. వ్యాపార సంస్థలలో, ఇంట్లో అష్టమూలికా గుగ్గిలం పొగ వేయడం చాలా ఉత్తమం.

## స్త్రీలకు ప్రత్యేకం

ఈ సంవత్సరం కాలం త్వరగా గడిచిపోయినట్లు తోస్తుంది. విద్యా సంబంధమైన విషయాలు, విదేశాలకు వెళ్లే ప్రయత్నాలు ఆకస్మికంగా కలిసివస్తాయి. కలిసి వచ్చిన ప్రతి విషయానికీ ఏదో ఒక సాంకేతికపరమైన చిక్కులో, ఇబ్బందులో ఉంటాయి. దీర్ఘకాలిక సమస్యలను అధిగమిస్తారు. పదవీ ప్రాప్తికి అవకాశం ఉంది. నమ్మక ద్రోహానికి గురిఅయ్యే అవకాశం ఉంది జాగ్రత్త. చిన్న విషయానికి గొప్ప పోరాటం చేయవలసి రావడం విసుగు కలిగిస్తుంది. ఈ సమస్యలున్నవి నాకేనా ఇతరులకు కూడా ఉన్నాయా అనిపిస్తుంది. అసూయకు మందులేదని గ్రహిస్తారు. బహిరంగంగా అబద్ధాలు చెప్పి మీ ప్రయోజనాలు దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతాయి. అయితే అవి ఫలించవు. ఓర్పుతో మంచి మాటలతో మీ వాళ్లను ఉన్నతమైన మార్గాలలోకి మళ్లిస్తారు. చాలావరకు తగాదాలు, వివాదాలు, కష్టం కలిగించే మాటలు మీ ఆత్మీయుల వరకు చేరనీయరు. అన్నీ మీరే భరించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించడంలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం సహకరిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తారు. విలువైన, అపురూపమైన వస్తువులు చేకూరుతాయి. ఆధ్యాత్మిక సాధనలో పురోగతి సాధిస్తారు. వైవాహిక సంబంధిత, శుభకార్య సంబంధిత, విషయాల్లో మాట పట్టింపులు ముఖ్య ఆటంకాలకు కారణం అవుతాయి. ఆరావళి కుంకుమతో లక్ష్మీపూజ చేయండి. శుభప్రదం మంచి జరుగుతుంది.

ఴ

2005 - 2006 లో...

# వృషభరాశి ఫలితములు

ఆదాయం-8 వ్యయం-8 | గౌరవం-6 JQ0~¡=0Ð6

కృత్తిక 2,3,4 పాదములు, రోహిణి 4 పాదములు, మృగశిర 1,2 పాదములందు పుట్టినవారు మరియు "ఈ, ఊ, ఏ, ఓ, వా, వీ, వు, వె, వో" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు వృషభరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశిలో జన్మించిన వారికి మధ్య వయస్సు నుండి జీవితం అత్యంత యోగవంతముగా వుంటుంది. శ్రమించవలసిన సమయంలో బద్ధకించడం వల్ల ఇబ్బందులు కోరి తెచ్చుకుంటారు. ఇతరుల మాటలు వినని వ్యక్తులుగా ముద్రపడతారు. అందరి అభిప్రాయాలు తెలుసుకుని మీ మనసుకు తోచింది చేస్తారు. ప్రతిభావంతులు, మానసికంగా స్థిరమైన భావాలు కలిగిన వాళ్ళు అనుచరవర్గంలో, భాగస్వాములలో ఉండరు. వంశపారంపర్య ఆస్థులను వృద్ధి చేయడానికి ప్రారంభంలో ఇబ్బందులు ఎదురవుతాయి. వీలునామాలు లాభిస్తాయి. పెద్దలు ఇచ్చిన ఆస్థికన్నా అధికంగా ప్రచారం జరుగుతుంది. తండ్రి లేక తాత అత్యంత ప్రతిభావంతులై ఉంటారు. వంశ ప్రతిష్ట ప్రఖ్యాతి చెంది యుంటుంది. కుటుంబ, వంశ ప్రతిష్టను నిలబెట్టవలసిన బాధ్యత అధికంగా ఉంటుంది. వ్యాపార విస్తరణలో భార్య వైపు సహాయ సహకారాలు లభిస్తాయి. చాలా విషయాల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. లెక్కలు, పద్దులు క్రమశిక్షణలో ఎక్కడా రాజీ ధోరణి ఉండదు. కాని కూతురు విషయంలో విశేషమైన అభిమానం మినహాయింపులు ఉంటాయి. కళా సంబంధమైన వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

కష్టాలు భయపెడతాయి గాని పడదోయవు. చాలా విషయాల్లో అదృష్టానికి దగ్గరగా పిల్లల జాతకం నడుస్తుంది. సహచర వర్గం ఉన్నత స్థానాల్లో ఉంటారు. సహాయ సహకారాలు అందించడానికి వాళ్ళకు స్వాతంత్ర్యం ఉండదు. మీరు అభిమానించే ఆత్మీయ వర్గాన్ని అందులో అతి ముఖ్యమైన వారిని మీ వైరి వర్గం విమర్శిస్తుంటారు. మీ ప్రతి విజయానికి మరొకరిని కారణంగా చూపిస్తారు. విలాస వంతమైన జీవితం చాలా కాలం గడుపుతారు. సామాన్య ప్రజలకు అవగాహన లేని చాలా విషయాల్లో పరిజ్ఞానం నిపుణత ఉంటాయి. సలహాలు చెప్పే మేధావులుగా రాణిస్తారు. ముఖ్య స్థానాలలోని వారికి సర్వస్వం మీరే అవుతారు. ప్రారంభ జీవితాన్ని పోల్చుకుంటే సాధించిన స్థాయి అధికంగా ఉంటుంది. వివాహం చాలామందికి మంచి మలుపుగా మారుతుంది. (ఏవో కొన్ని తక్కువ సందర్భాలలో, చాలా తక్కువ మందికి మినహా) ఆత్మీయవర్గంతో, సహోద్యోగుల చెప్పచేతల్లో మీరు నడిచే అవకాశం లేదు. మానసికంగా ప్రభావం చూపగలిగేది ఒక్క స్త్రీ సంతానం మాత్రమే. అందులోను జ్యేష్ట కుమార్తె ప్రభావం మాత్రం ఎక్కువగా ఉంటుంది. జీవితంలో ఆధ్యాత్మిక విషయాలు, సేవా కార్యక్రమాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. మాట సహాయం చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. లేని విషయాలు, నిందలు ప్రచారంలోకి వస్తాయి. స్వంత విషయాలు, రహస్యాలు స్వంత మనుషులు బైట పెట్టనంత వరకు చెప్పకోదగిన ఇబ్బందులు రావు. శని మహర్దశ యోగిస్తుంది. అనేక విజయాలు, పురోగతి సాధిస్తారు. పెంపుడు జంతువుల పట్ల మమకారం ఉంటుంది. గార్డెనింగ్, ప్రకృతికి దగ్గరగా ఉండే వాతావరణాన్ని ఇష్టపడతారు. విదేశీ వ్యవహారాలు, షేర్ల బిజినెస్‌ల విషయంలో అధిక శ్రద్ధ అవసరము. ఎంతో శ్రమించి మీరు ఒక బాట ఏర్పరుస్తారు. ఆ దారిలో అందరూ లాభపడతారు. మీరు ఆశించిన కృతజ్ఞత చాలా మందిలో కనిపించక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతేకాదు మేధస్సు, ఆలోచనా విధానం తిరస్కరణకు గురి అయ్యే అవకాశం ఉంది. ఇలాంటివి మీ ప్రయోజనాలను దెబ్బ తీస్తాయి. ఉన్నతాధికారులవద్ద మంచి అభిప్రాయం, అభిమానం సంపాదించుకుంటారు. ఏదో విధంగా మిమ్ములను కూలదోయాలని కుట్రలు పన్నే వర్గం విజయం సాధిస్తారేమోనన్న దిగులు ఉంటుంది. కారణాలు ఎలాంటివైనా బాల్య మిత్రులు, బంధువర్గంలోని వాళ్ళతో ఏర్పడిన విభేదాలు వృత్తి ఉద్యోగులపై ప్రభావం చూపిస్తాయి. మీ ప్రతిష్టను గౌరవాన్ని రక్త సంబంధీకులు ముఖ్యంగా సంతానం ఉద్దీప్తం చేస్తారు. సరియైన సమయంలో చక్కని సలహాలు చెప్పే వాళ్ళు లభించడం దైవానుగ్రహం. చాలా సందర్భాలలో దైవం అనుగ్రహించినట్లు పరిస్థితులు స్పష్టంగా తెలియజేస్తాయి. స్త్రీ దేవతా మూర్తుల ఆరాధన వల్ల విశేషమైన మేలు జరుగుతుంది.

# 2005-2006 సంవత్సర ఫలితములు

వృషభరాశివారికి ఈ సంవత్సరం గతరెండు సంవత్సరాల కన్నా బాగుంది. చతుర్థ స్థానంలో గురువు, మూడవ స్థానంలో శని, ఏకాదశ స్థానంలో శక్తివంతమైన రాహువు. అనుకూల ఫలితాలకు కారణమవుతారు. అధికార వాహన సౌఖ్యం, విద్యాభివృద్ధి, విదేశీయానం, ఉద్యోగం అనుకూలిస్తాయి. కార్యక్రమాల ప్రారంభానికి ముందే శుభ సంకేతాలు కొన్ని అందుతాయి. గురు, శుక్రమౌఢ్యమి కాలముల యందు ముఖ్య కార్యాలు వద్దు. స్థాన్న చలనం మాత్రం కొంత వివాదస్పదం అవుతుంది. సొంత వ్యక్తులు, ఆత్మీయుల మధ్య సయోధ్య కుదర్చడానికి సర్ది చెప్పడానికి వ్యక్తిత్వాన్ని, పరపతిని ఫణంగా పెట్టాల్సి వస్తుంది. పదిమందికి మేలు చేసి వందమందికి విరోధం అవుతారు. అయితే వ్యక్తిగత ప్రయోజనాలను ఎవ్వరూ దెబ్బ తీయలేరు. కోర్టు వ్యవహారాలు ఇబ్బందిపెడతాయి. ముఖ్యమైన వ్యక్తుల అండదండలు లభిస్తాయి. కొంతకాలం వాళ్ళ అండదండలు దూరమై కొంత ఆందోళనకు లోనవు తారు. వ్యాపారం చురుగ్గానే ఉంటుంది, లాభాలు బాగుంటాయి. మానసిక ఒత్తిడి అధికం. ప్రశాంతంగా నిద్రపోవడానికి కొన్ని జాగ్రత్తలు అవసరమగుతాయి. నిర్ణీత కాల వ్యవధిలో నిర్వర్తించవలసిన కార్యక్రమాలు పూర్తికావు. నమ్మకస్తులైన పరివారం వల్ల చికాకులు తప్ప పనులు పూర్తికావు. సంతానం అభివృద్ధి కొరకు చేసే కృషి ఫలిస్తుంది. దైవ భక్తి అనుష్ఠానము, ఉపాసన పట్ల ఆసక్తి పెరుగుతుంది. విదేశీయాన విదేశీ సంబంధిత విషయాలు బాగా లాభిస్తాయి. రాజకీయ పదవులు లభిస్తాయి. సందర్భాన్ని బట్టి వాటిని త్యజించి పోటీ చేసి గెలుస్తారు. ఎదుటి వాళ్ళ దయాదాక్షిణ్యాలతో పనిలేదని నిరూపించు కుంటారు. సంతానం విషయంలో ఎదుటి వాళ్ళ అభిప్రాయాల్ని తోసి సొంత నిర్ణయాలు చేస్తారు. సాధారణ విద్య, సాంకేతిక విద్యలలో కన్నా ఐ.ఎ.యస్., ఐ.పి.యస్., సర్వీసులకు ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువ. వ్యవసాయ


సంబంధమైన అనుబంధ ఉత్పత్తుల వల్ల లాభం చేకూరుతుంది. సర్వీస్ మ్యాటర్స్ చికాకు కలిగించినా ఏప్రియల్ తదుపరి మీకు అనుకూలంగా మారతాయి. మీరు ఎంతగా చెప్పినా హుందాగా ప్రవర్తించలేని రాజకీయ మిత్రులవల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం వుంది. నూతన విధానాలు, ప్రాజక్టులు, సబ్సిడీలు లభించే విధానాలు సంపూర్ణంగా తెలుసుకొని చట్టపరంగా లాభపడతారు. న్యాయంగానే అర్జన ఉంటుంది. విజ్ఞానం పెంచుకునే అంశాల మీద దృష్టిని కేంద్రీకరిస్తారు. పుస్తక పఠనం పెరుగుతుంది. పోలీస్ అధికారుల వల్ల పరోక్షంగా లాభం పొందుతారు. మిమ్ములను ఏ మాత్రం లెక్క చేయకుండా వెంటాడుతూ, ఏడిపించే స్త్రీ వల్ల ఆలోచనలోపడతారు. చిన్న చిన్న విషయాలు మీకు మంచిగా లాభిస్తాయి. అన్ని ప్రధాన విషయాలు అనుకూలంగా ఉంటాయి.

ఆశయ సాధనకు, సున్నితమైన మనస్తత్వంవల్ల కొంతకాలం అధినాయకులు ఉన్నత స్థానాలలోని వారికి దూరంగా ఉంటారు. అంచనాలకు తగిన పెట్టుబడి లభించకపోవడం వల్ల పురోగతి మందగిస్తుంది. మీరు తలపెట్టిన కార్యం విజయవంతం అవుతుందని మీరు తప్ప మరెవ్వరూ నమ్మరు. ఈ విచిత్ర స్థితి మీకు ఎదురవుతుంది. ఆకస్మికంగా కలిసివచ్చే అవకాశాలను కొద్దికాలం వాయిదావేస్తారు. పాత వైరివర్గం మిత్రవర్గంగా మారి మీ కార్యక్రమాలను మౌనంగా వీక్షించడం జరు గుతుంది. మీరు నమ్ముకున్న గురువులు, ఆరాధించే స్వామీజీల విషయంలో మీ నిర్ణయాలను పునః పరిశీలన చేసుకుంటారు. ఇతరులను నిందించడంకన్నా మీకు మీరుగా ఆత్మ పరిశీలన చేసుకోవడం మంచిదని గ్రహిస్తారు. అవమానాల్ని మాత్రం సహించలేరు. ఈ సందర్భంగా స్వంత వాళ్లతోనే భేదాభిప్రాయాలు వస్తాయి. కలలో కూడా విరోధం ఏర్పడదనుకున్న వారితో బద్ధ వైరం ఏర్పడుతుంది. మహోన్నత ఆశయాలు కలిగిన వ్యక్తులు డబ్బులకు అమ్ముడుపోవడం, దమ్మిడీ విలువ చేయని వ్యక్తులను నెత్తినెక్కించుకోవడం మీకు అర్థం కాని పరిణామం అవుతుంది. ఏకాదశ స్థానంలోకి రాహువు ప్రవేశించిన తదుపరి మీకు అన్నీ శుభశకునాలే! తలపెట్టిన కార్యక్రమాలు విజయవంతం అవుతాయి. ఏదో తెలియని దైవశక్తి అండగా నిలబడిన భావం కలుగుతుంది. అధైర్యంపోతుంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు కలిసివస్తాయి. మీరు ఎవరి పురోగతి, భవిష్యత్తు లక్ష్యంగా పెట్టుకున్నారో వాళ్ళు అభివృద్ధి పథంలో నడుస్తారు. అవివాహితులైన వారికి వివాహయోగం కలుగుతుంది. అందరూ వైఫల్యం చెందుతారని భావించిన రంగంలోనే మీరు అనుకూల ఫలితాలు సాధిస్తారు. జూన్ 2005 తదుపరి జాతకం మరింత అనుకూలంగా ఉండి ఆర్థికంగా నిలద్రొక్కుకుంటారు. సహోదరవర్గం వల్ల చికాకులు తప్పవు. ఇన్సూరెన్స్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. మితిమీరిన ఆత్మవిశ్వాసంవల్ల నష్టపోయే అవకాశం ఉంది. పోటీ పరీక్షలే కాక సాధారణ పరీక్షలలో కూడా మీరు అనుకూల ఫలితాలు ఏదో విధంగా సాధిస్తారు. మీ పెద్దలపట్ల సమాజంలో ఉన్న గౌరవం చాలా సందర్భాలలో మిమ్ములను కాపాడుతుంది.

అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. నాగసింధూరం ధరించండి. ఇంద్రాణి రూపు సమంత్రకంగా మెడలో ధరించండి. మేలు జరుగుతుంది.

## స్త్రీలకు ప్రత్యేకం

ఏలినాటి శని ప్రభావం నుండి బయటపడిన దాఖలాలు కనిపిస్తాయి. ఇష్టంలేని వ్యక్తుల వద్ద కొలువు చాలిస్తారు. అయినవాళ్లకు అనుకున్నంత సాయం చేయలేకపోతున్నామన్న భావన కలుగుతుంది. ఆర్థిక పురోగతి బాగుంటుంది. దాచిపెట్టిన ధనాన్ని సద్వినియోగం చేస్తారు. సంతాన పురోగతి కోసం చేసే ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తాయి. సంతానం స్వతంత్ర నిర్ణయాలు ఇబ్బంది కలిగిస్తాయి. ఏకాదశ రాహువు యోగకారకుడు. పదవి రీత్యా, ఉద్యోగరీత్యా వ్యాపారరీత్యా అనుకూలమైన పట్టు సాధిస్తారు. వైరివర్గానికి భవిష్యత్‌లో కూడా ఎలాంటి అవకాశాలు లేకుండా చేస్తారు. విదేశీ అవకాశాలు కలిసి వస్తాయి. ఉన్నతమైన ఉద్యోగం లభిస్తుంది. పోటీ పరీక్షలలోను అంచనాలకు భిన్నంగా అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఒకనాడు మీరు అభిమానించిన వ్యక్తులు అధిరోహించిన స్థానాలకు మీకు అవకాశం వస్తుంది. మానసికంగా వింత అనుభూతికి లోనవుతారు. గ్రహస్థితి అనుకూలత వల్ల మంచి ఫలితాలు కొంత కలుగుతాయి. పురోగతి సాధించినా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించదు. కొందరు వ్యక్తులతో విభేదాలు అధికమయి విడిపోవాల్సిన స్థితి రావచ్చు. న్యాయస్థానాలలో నలుగుతున్న అంశాలు విసుగుపుట్టాక ఓ కొలిక్కి వస్తాయి. విదేశీ పౌరసత్వం, స్థానిక సంస్థలలో అధికారం ఒక దానికి మరొకటి ముడిపడి ఉంటాయి. అయితే మీరు ఏది ఎన్నుకుంటే అందులో రాణిస్తారు. జీవితంలో స్థిరత్వం సాధించడానికి ఇది అనుకూల సంవత్సరం. అవివాహితులైన వారికి వివాహకాలంగా చెప్పదగిన సంవత్సరము. ఆరావళి కుంకుమతో లక్ష్మీ పూజ చేయండి.



2005 - 2006 లో...

# మిధునరాశి ఫలితములు

ఆదాయం-11 వ్యయం-5 | గౌరవం-2 అగౌరవం-2

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 4 పాదములు, పునర్వసు 1,2,3 పాదములందు పుట్టినవారు "కా,కి,కూ,ఖం,ఙ్ఞ,ఛ్ఛా, కే,కో,హా" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు మిధునరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశివారు హాస్య ప్రియులు. వ్యవహార సంబంధమైన విషయాలను కూడా తమదైన పద్ధతిలో తెలియజేసి, ఇతరుల్లో మార్పు తేవాలని, తాము అనుకున్నది సామరస్యంగా సాధించుకోవాలని చూస్తారు. సందర్భాన్ని బట్టి మాట్లాడడంలో నేర్పు ఉంటుంది. భవిష్యత్ ప్రణాళిక చక్కగా నిర్మించుకుంటారు. ఉన్నత స్థానాలలోనివారు, బంధువర్గం, స్వకులస్థులు ముఖ్యమైన ప్రతి సందర్భంలోనూ ద్రోహం చేస్తారు. చిన్నతనం నుండే కష్ట సుఖాలు, ఎత్తు పల్లాలు చూస్తారు. జీవితంలో ఎంతో అనుభవం ఎన్నో రంగాల పట్ల స్పష్టమైన అవగాహన చిన్న వయసులోనే ఏర్పడుతుంది. వివాహం, సంతాన ప్రాప్తి ఊహించిన ఇబ్బందులు ఎదురు కాకుండా నడిచిపోతాయి. మాట తప్పే మనుషులు, ఉపయోగించుకొని ప్రత్యుపకారం చేయని వాళ్ళు జీవితంలో అధికంగా కష్టం కలిగిస్తారు. అనువంశికంగా సంప్రాప్తించాల్సిన ఆస్థి అనుకున్నంత చేతికి రాదు. ఇతరుల ధనం మీద, స్వజనుల ఆస్థి మీద పెద్దగా ఆశ, ఆసక్తి ఉండదు. స్వార్జితంపైనే ఎక్కువ దృష్టి ఉంటుంది. పథకం రచించడంలో, అమలు చేయడంలో మంచి నేర్పరితనం ఉంటుంది. ఎవ్వరైనా తోడు లేకపోతే కార్యక్రమాలు చేపట్టడానికి వెనుకాడతారు. ఇది చెప్పకోదగిన నష్టం కలిగిస్తుంది. సామాజిక భావాలు ఆదర్శంగా ఉంటాయి. ఎక్కువ మందికి నచ్చవు. అవకాశాల్ని సద్విని యోగం చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటారు. రాజకీయరంగం పట్ల అమితమైన ఆసక్తి ఉంటుంది. శుక్రదశ, శనిదశ యోగవంతమైన కాలము. మంచి ఫలితాలు సాధిస్తారు. జీవితంలో జరిగిన అవమానాలు, నిరాదరణ భవిష్యత్తుకు పునాది అవుతాయి. తాను పడిన కష్టాలు ఇతరులు పడకూడదని భావిస్తారు. శత్రువుల్ని దెబ్బతీయడానికి ఎంతగానో యోచిస్తారు. సమయం చిక్కినప్పడు ప్రతీకారం తీర్చుకోరు. సంతాన సంబంధిత విషయంలో అనుబంధం ఎక్కువగా ఉంటుంది. కాని ఆలోచనలను సంతానం మీద బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయరు. సూచనలు చేస్తారు, అంతవరకే అవి అమలు పరిస్తే సంతోషిస్తారు. లేకపోతే పెద్దగా ప్రతిఘటించరు. వీరి ఆలోచనలను, సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని ఇతరులు తిరస్కరించే అవకాశం ఉంది. సమస్యలు సృష్టించి పరిష్కరించే వ్యక్తులు ఆంతరంగికులు కావడం జరుగుతుంది. ప్రభుత్వపరంగా, చట్టపరంగా ఉన్న లోటుపాట్లను, లోపాలను అందరికంటే సులువుగా గ్రహిస్తారు. కొంత ధనం చేతికి అందితే దాని ద్వారా మంచి అభివృద్ధి, అందుకు సంబంధించిన మార్గాలను చక్కగా అన్వేషించి వినియోగం చేసుకోగలరు. లెక్కలు అన్నీ కాగితం మీద లేకపోయినా అన్నీ గుర్తుంటాయి. వివాదాస్పద విషయాలకు దూరంగా ఉంటారు. సమస్య వస్తే పారిపోయే తత్వం ఉండదు. ప్రతిఘటన అధికంగా ఉంటుంది. వృత్తి వ్యాపార రహస్యాలు కాపాడుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ ఉంటుంది. స్త్రీలవల్ల అపకారం జరుగుతుంది. (స్త్రీలకు - పురుషులకు) అందరినీ ఐకమత్యంగా ఉంచడానికి గ్రూపు రాజకీయాలు రూపుమాపడానికి అధికంగా కృషి చేస్తారు. వ్యక్తిగత కుటుంబ విషయాల్లో ఇతరుల మితిమీరిన జోక్యం

కాలక్రమేణా ఇబ్బంది కలిగిస్తుంది. జీవితంలో రెండు రకాల వృత్తి ఉద్యోగాల్లో ప్రవీణ్యత ఉంటుంది. ప్రధానంగా ఆశ పెట్టుకున్న విద్య కన్నా మధ్యలో నేర్చుకున్నదే జీవితానికి ఉపయోగ పడతాయి. అయినవాళ్లు, సన్నిహితుల వలననే ఇబ్బందులు కలుగుతాయి. మనసుకు పట్టనట్లుగా వ్యవహరించి గతాన్ని మర్చిపోతే జీవితంలో ఉన్నత స్థానాలు అందుకుంటారు. శివార్చన, శివభక్తి. రుద్రకవచ పారాయణం వల్ల మేలు జరుగుతుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ సంవత్సరం మిథునరాశివారికి ఆర్థికంగా బాగుంది, వాహన సౌఖ్యం కలుగుతుంది. విదేశాలకు వెళ్లే అవకాశాలు కలిసివస్తాయి. ప్రతిష్ఠ, పేరు పెంచుకోగలుగుతారు. అనేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి సోమరితనం, అలవాట్లులో మార్పులు రావడం కారణం అవుతుంది. ఏలిననాటి శని ప్రభావం ఎక్కువగా ఉండదు. సంతాన పురోగతి బాగుంటుంది. స్త్రీ సంతానం అయితే మరిన్ని విజయాలు సాధిస్తారు. వ్యాపారానికి - పరపతికి పలుకుబడికి అవినాభావ సంబంధం ఏర్పడుతుంది. గొప్ప అవార్డును అందు కుంటారు. వైవాహిక సంబంధిత విషయాల్లో అనిశ్చిత స్థితి తొలగిపోతుంది. విశేషించి స్త్రీలకు సంబంధించిన అంశాలు పరిష్కారమవుతాయి. స్థాయి లేని వ్యక్తులను చేరదీసి ఆదరిస్తారు. అందులోని మర్మం మీకు తప్ప మరెవరికీ తెలియదు. స్థిరాస్థులు కొనుగోలు చేస్తారు. ఉన్న ఆస్థుల విలువ రెట్టింపును దాటిపోతుంది. తాత్కాలిక వ్యాపారాలు లాభిస్తాయి. కళాసాహిత్య రంగాలలోని వ్యక్తులతో విరోధం ఏర్పడుతుంది. సంస్థ లాభాలలో నడుస్తున్న ప్పటికీ న్యాయపరంగాను సౌఖర్యాలు పెంచబడవు. దీనికొరకు కూడా పోరాటం చేస్తారు. చతుర్థస్థానంలోనున్న గురుకేతువుల వల్ల ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. గృహంలో మార్పులపట్ల శ్రద్ధ ఎప్పుడూ లేని విధంగా చూపిస్తారు. దొంగస్వామీజీల వల్ల నష్టపోతారు. జీవితానికి సంబంధించిన ముఖ్య విషయంలో ఎదుటి వాళ్ల అభిప్రాయం తెలుసుకోలేరు. ఎక్కువ కాలం వేచి యుండడం మీ వల్ల కాదని గ్రహిస్తారు. కొత్త విధులు నేర్చుకునే అవకాశం ఉంది. ఏ ఉన్నత స్థితి కొరకు మీరు అనేక రోజులుగా శ్రమించారో అదే ఉన్నత స్థానాన్ని ఏ మాత్రం శ్రమించని వ్యక్తులు ప్రయత్నించడం ఆశ్చర్యానికి, ఆందోళనకు కారణం అవుతుంది. మీ వ్యూహ ప్రతి వ్యూహాలను మార్చుకుంటారు. ఋణాలు తీరుస్తారు. కొన్ని ఋణాలు ఉద్దేశ్య పూర్వకంగా తీర్చరు. గతంలో మీరు కొనుగోలు చేసిన వస్తువుల విలువ పెరుగుతుంది అయితే ఇది స్వల్ప వివాదాస్పదం అవుతుంది. క్రమశిక్షణ పాటించి, శ్రమించి ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయత పెరుగుతుంది. బంధాలు అనుబంధాలు మరింత బలపడతాయి. మహత్తరమైన కార్యాలకు శ్రీకారం చుడతారు. ప్రారంభించిన కార్యక్రమాల్లో కొన్ని విజయవంతం అవుతాయి. ఫలితాలు చేతికి వస్తాయి. మిగిలినవి విఫలం కావు. వాటిపై కొన్ని నిర్ణయాలు న్యాయపరంగా వ్యవహారపరంగా ఆలోచనచేయవలసి ఉంటుంది. ఇష్టదైవాన్ని అధికంగా పూజిస్తారు. కష్టాల్లో దేవుడిని ఎక్కువగా పూజించడం సహజం సుమ. సౌఖ్యంగా ఉండి పూజించడం విశేషం. అనుష్టాన పరులైన వారితో వాగ్వివాదాలు వద్దు. దొంగ స్వామిజీల లీలలు ఆశ్చర్యం కలిగిస్తాయి. నాగసింధూరం, సిద్ధ గంధము నిత్యం ధరించండి. సంతానం కొరకు కొన్ని క్రొత్త ఋణాలు చేయవలసి రావచ్చు. కూడబెట్టిన ధనం అక్కరకు వస్తుంది. అభివృద్ధికి ఉపయోగపడుతుంది. సన్నిహిత వర్గానికి, సహోదర వర్గానికి అండగా నిలుస్తారు. కొన్ని విచారణలలో మీ సాక్ష్యం అవసరం కావడం ఇబ్బంది కలిగించవచ్చు. ఉన్నత స్థానాలలోని వారి వద్ద మీ గౌరవం పదిలముగా ఉంటుంది. మీరే ముఖ్యమైన వ్యక్తిగా గుర్తించబడతారు. వ్యవయసాయ దారులకు చాలా వరకు అనుకూలం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు దివాలా తీశామని భావించనక్కరలేదు. రేట్లు అకస్మాత్తుగా పెరుగుతాయి. మీ కొచ్చిన ఇబ్బందిలేదు. డాక్టర్లకు, యాక్టర్లకు, డాక్యుమెంట్ రైటర్‌కు రక్షణ ఉద్యోగులకు అపఖ్యాతి రెండు

నెలలు తప్పకపోవచ్చు. మీరు అభిమానించే వాళ్ళ కన్నా మిమ్ములను అభిమానించే వాళ్ళు అధికం అవుతారు.

చతుర్థ స్థానంలో ఉన్న గురుగ్రహం వల్ల పరపతి, సౌఖ్యం పెరుగుతుంది. వ్యాపారం పట్ల అధిక శ్రద్ధ అవసరం అని గ్రహిస్తారు. మీ వైపు నుండి తప్పలు దొర్లకుండా జాగ్రత్త వహిస్తారు. అనవసరమైన భయాందోళనలకు గురి అవుతారు. మీ ఆలోచనా విధానం కొన్ని సందర్భాలలో వ్యాపార దృక్పథం నశిస్తుంది. కొన్ని అగ్రిమెంట్స్ రద్దు చేసుకొనడానికి చాలా పరపతి ఉపయోగించాల్సి వస్తుంది. దైవ సంబంధమైన విషయాల వివాదాల్లో ఇరుక్కుంటారు. కోర్టుతీర్పులు అనుకూలంగా వస్తాయి. ప్రభుత్వ సంబంధమైన లైసెన్స్‌లు, ట్రేడ్ మార్క్ పత్రాలు వస్తాయి. మంచి ఆశయాలతో జీవిస్తారు. దైవభక్తి పెరుగుతుంది. ఆధ్యాత్మిక క్రమశిక్షణను పాటిస్తారు. చెప్పదలుచుకున్న విషయాల్ని సౌమ్యంగా చెప్పండి. మేలు జరుగుతుంది. వివిధ రకాల అంశాలను పరిశీలించి ధైర్యం చేసి అప్పు చేసి పెట్టుబడి పెడతారు. లాభపడతారు. ఏప్రియల్ నెల 2005 జాగ్రత్త వహించాల్సిన కాలము. ఉన్నతాధికారుల సహాయముతో కొన్ని పొరపాట్లను సరిదిద్దుకోగలుగుతారు. ఇలాంటి వాటికి ప్రచారం రాకుండా జాగ్రత్త వహించాలి. మీ పరపతి ఇతరులకు తెలియకుండా ఉండడమే మేలు. చాలాకాలంగా మిమ్ములను ఇబ్బందులకు గురిచేసిన వాళ్ళకు వ్యతిరేకంగా ఓ బలమైన వర్గాన్ని రూపొందిస్తారు. ప్రారంభంలో మీ కార్యక్రమాలు కక్ష సాధింపు వైఖరి అనిపించినా పరిస్థితుల ప్రాబల్యం వల్ల అందరూ మిమ్ములనే సమర్థిస్తారు. ఆశించిన రాజకీయ మద్దతు లేకపోవడం ఆగ్రహానికి కారణం అవుతుంది. చిత్రవిచిత్రమైన వ్యాపారాల్లో మీరు పాలుపంచుకుంటారు. దైవానుగ్రహం లేదని భావిస్తారు గాని దైవానుగ్రహం సంపూర్ణంగా ఉంది. వనమూలికలు, వైద్య సంబంధిత, వ్యాపారాలు అనుకూలిస్తాయి. మీ మేధస్సు, ఆలోచనలు, తస్కరణకు గురి అవుతాయి. ఇది మీకు నిరుత్సాహం కలిగిస్తుంది. వైరాగ్యానికి దూరంగా ఉండండి. పరిస్థితులు మీకు అనుకూలిస్తాయి. స్త్రీల పరంగా కొన్ని వివాదాలలో చిక్కుకుంటారు. మారిన పరిస్థితులననుసరించి మసలుకొనడం వల్ల మేలు జరుగుతుంది. నూతన గ్రంథ రచనలు మంచి ప్రజాదరణ పొందుతాయి. మంచి ఖ్యాతి లభిస్తుంది.

నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి శుభప్రదం. కాల భైరవ రూపును సమంత్రకంగా ధరించండి మంచిది.

## స్త్రీలకు ప్రత్యేకం

సౌందర్య సాధనకు, వృద్ధికి, ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వాహన యోగ్యత కలుగుతుంది. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. స్వల్ప సాంకేతిక ఇబ్బందులు రావచ్చు. సంకటహర గణేశ స్తోత్రం పఠించండి. దంత సౌందర్యం గురించి జాగ్రత్త తీసుకోవలసి రావచ్చు. దూర ప్రాంత ప్రయాణాలు, వ్యవహారాలు, విద్య, ఉద్యోగం మొదలైనవి కలిసి వస్తాయి. తాత్కాలిక ప్రాతిపదికన కొన్ని అవకాశాలు వస్తాయి. అవి నిలబడతాయో లేదోనని మీరు సంశయించి వెనుకంజ వేయడం జరుగుతుంది. స్థిరాస్థులు కొంత కలిసి వస్తాయి. సాహిత్య రంగంలో, సినీ రంగంలో అవకాశాలు కలిసి వస్తాయి. దూరపు బంధువుల ఆశ్రయం కోరవలసి రావచ్చు. ఓ గొప్ప ప్రయోజనం కొరకు విలువైన ఆస్థిని తక్కువ ధరకు అమ్మే అవకాశం ఉంది. ధనం ప్రవాహంలా వస్తుంటుంది. ఖర్చవుతుంది. సంతాన విషయంలో మీ నిర్ణయాలు, వేడుకోళ్ళు మంచి ఫలితాలనిస్తాయి. సంతాన పురోభివృద్ధికి మరింత శ్రమించవలసిన అవసరాన్ని గుర్తిస్తారు. పోటీ ప్రపంచంలో మీ సాటివాళ్ళు మిమ్ములను అధిగమించి వెళుతున్నారన్న భావన తగ్గుతుంది. మిమ్ములను ఎవ్వరూ అధిగమించలేదన్న విషయాన్ని గ్రహిస్తారు. ఎదుటి వాళ్ళ ఆంతర్యం గ్రహించడం కష్టమవు తుంది. దీనిపైనే ముఖ్య నిర్ణయాలు ఆధారపడి ఉండడంతో సంకటానికి లోనవుతారు. అన్ని బంధాలు డబ్బులతోనే ముడిపడి ఉంటాయన్న వాస్తవం మీ అనుభవంలోకి వస్తుంది. జీవితంలో విలువైన పాఠాలను కాలమే బోధిస్తుంది. ఆరావళి కుంకుమతో లక్ష్మీదేవి పూజ చేయండి.

2005-2006 లో...

# కర్కాటకరాశి ఫలితములు

| ఆదాయం-5 | వ్యయం-5 | గౌరవం-5 | అగౌరవం-2 |
|---|---|---|---|

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదముల యందు పుట్టినవారు "హీ,హూ,హే,హో,డా,డీ,డూ,డే,డో" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు కర్కాటకరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశిలో జన్మించిన వారికి మనోధైర్యం అధికంగా ఉంటుంది. జల సంబంధమైన విషయాలు ఇబ్బంది కలిగిస్తాయి. అవే జీవితంలో పురోభివృద్ధికి కూడా కారణం అవుతాయి. ప్రతి విషయంలో పోరాటం ఎక్కువగా ఉంటుంది. ప్రతి చిన్న పనికీ ఒకటికి నాలుగు సార్లు కష్టపడాల్సి వస్తుంది. సన్నిహిత వర్గంలో నిజాయితీపరులు ఉన్నంత కాలం వృత్తి ఉద్యోగ, వ్యాపారులకు ఇబ్బంది ఉండదు. రాజకీయ రంగంలో రాణిస్తారు. మహాలక్ష్మీదేవి పూజవల్ల చాలా ఆటంకాలను అధిగమించగలరు. లలిత కళలపై మంచి అవగాహన, ప్రవేశం ఉంటుంది. కళా సంబంధిత వ్యాపారాలలో కూడా రాణిస్తారు. సంతాన పురోగతి బాగుంటుంది. ప్రారంభంలో కొన్ని సమస్యలు అధిగమిస్తారు. రాణించలేమని భావించిన రంగాల్లో రాణిస్తారు. హాస్యంపట్ల ప్రత్యేకమైన అవగాహన ఉంటుంది. కార్య నిర్వహణకు చక్కని ఉపాయాలు పథకాలు ఏర్పరుచుకుంటారు. తొందపాటు వల్ల నష్టపోయే అవకాశం ఉంది. నిష్కారణ శత్రువర్గం ఎప్పుడూ పొంచి యుంటుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. బినామీ పేర్ల మీద చేసే వ్యాపారాల్లో ద్రోహం ఎదురవుతుంది. టెండర్లు ప్రింటెడ్ పనులు, చేతి వృత్తులకు సంబంధించిన కాంట్రాక్టులు అధికంగా లాభిస్తాయి. ధనం స్థిరం చేసుకోవడం సమస్య అవుతుంది. ఆస్థుల సంరక్షణకు సంపాదించడానికి పడినంత శ్రమపడాల్సి వస్తుంది. ప్రజాకర్షణ బాగుంటుంది. నిందలు, పుకార్లు ప్రజల్లో వుంటాయి. కానీ ప్రభావం చూపలేవు.

క్రీడా సంఘముల విషయ వ్యవహారాలు లాభిస్తాయి. పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తారు. చిన్న చిన్న సంఘటనలు, సరదాగా మాట్లాడిన మాటల వల్ల అధికంగా నష్టపోతారు. సన్నిహిత వర్గాన్ని మితిమీరి ప్రోత్సహించడం వల్ల చివరకు వాళ్ల వల్లనే అధికపోటీ ఏర్పడుతుంది. వివాదాలు ముదరకుండా ఆదిలోనే పరిష్కరించుకోవడం శ్రేయస్కరం. పంతాలు, పట్టింపులు దీర్ఘ కాలంలో లాభించవు. పట్టువిడుపు లౌకిక ప్రవర్తన వల్ల చెప్పకో దగిన ప్రయోజనం కలుగుతుంది. బంధువులతో విభేదాలు చాలా కాలం కొనసాగుతాయి. అనుకున్న వివాహం ఒకటి చేసుకునేది మరొకటి అవుతుంది. శని గ్రహ అనకూల స్థితి ఉన్న వార్కి అనుకున్న వివాహం అవుతుంది. వివాహ జీవితంలో ఒడిదుడుకులు తప్పక పోవచ్చు. సంబంధ బాంధవ్యాలు లేని వారు చేరదీసి ఆశ్రయం ఇస్తారు. ప్రోత్సాహాన్నిస్తారు. జీవితంలో ఇది మలుపుగా మారుతుంది. విదేశీయానం, విదేశీ విద్య, ఉద్యోగం, సాంకేతిక విద్య మొదలైనవి లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపార వ్యవహారాలు వ్యక్తిగతంగా అసంతృప్తికి దారితీస్తాయి. అనువంశిక ఆస్థి మిగలడం అనుమానం. స్వార్జితం నిలబడుతుంది. ఎన్ని ఆటంకాలు ఎదురయినా బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు. చట్టపరమైన సమస్యలు ఏ మాత్రం సంబంధంలేని విషయాల్లో ఇబ్బంది కలుగజేస్తాయి. దైవానుగ్రహం, మేదస్సు అప్రతిష్ట రాకుండా కాపాడుతుంది. ఉన్నత స్థానాన్ని నిలబెట్టుకోవడానికి చాలా కష్టపడతారు. భోగభాగ్యాలు ఉన్నప్పటికీ ఉనికిని గత జీవితాన్ని మరచిపోరు. అహంభావం లేని వ్యక్తులుగా పేరు తెచ్చుకుంటారు. రవి చంద్ర గ్రహణాల ప్రభావం ఈ రాశివారిపై ఉంటుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారికి ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలు సూచిస్తున్నాయి. ప్రముఖుల అండదండలు, చదివిన విద్య ఉపయోగపడవు. ఆర్థికపరమైన బలము,

స్థానచలనము సూచించుచున్నది. తృతీయ స్థానంలో వున్న గురువు, లగ్నంలో శని, పన్నెండవ స్థానంలోని శని గ్రహ సంచారం తొమ్మిదవ స్థానంలోని రాహువు ప్రధాన ఫలితాలను నిర్దేశిస్తున్నారు. ముఖ్యమైన స్థానాలలోని వారి అండదండలు ఉన్నప్పటికీ, వాళ్ళు మీ విషయాల వల్ల మీకు మేలు జేయడం పట్ల ఇష్టం కలిగి ఉన్నప్పటికీ వారి వ్యక్తిగత సిబ్బంది మిమ్ములను ఇబ్బందులకు గురి చేస్తారు. దేవుడు వరం ఇచ్చినా పూజారి అడ్డుకున్న సామెతగా ఫలితాలు ఉంటాయి. సంతాన విషయంలో అసంతృప్తి ఏర్పడవచ్చు. చాలా విషయాల్లో నిర్ణయాలు మీ ప్రమేయం లేకుండా జరిగిపోతున్నట్లు అనిపిస్తుంది. మనోవేదన కలిగి పదవికి రాజీనామా - లేక పదవి తిరస్కరణ చేసే అవకాశం ఉంది. స్థిరాస్థులు కొనుగోలు చేసి లాభపడతారు. విద్యావకాశాలు కలసివస్తాయి. సబ్ కాంట్రాక్టులు లాభిస్తాయి. శుభకార్యాలు - చర్చలు పూర్తి చేస్తారు. ఋణ సదుపాయం లభిస్తుంది. అభివృద్ధి పథంలో కుటుంబాన్ని, సంస్థను నడిపించే యత్నాలు శక్తివంచన లేకుండా చేస్తారు. అనుకూల ఫలితాలు సాహిత్య, సినీ, వ్యవసాయ, విద్యా, రియల్ ఎస్టేట్స్ రంగాలలో సాధిస్తారు. ఇంద్రాణి రూపు ధరించండి శుభప్రదం. క్రయవిక్రయాల్లో జాగరూకత వహించండి. అయిన వాళ్ళతో మాట పడాల్సిన స్థితి రావచ్చు. మనోబలం కోల్పోతున్నట్లుగా చాలా సందర్భాలలో అనిపిస్తుంది. పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొనడమే మంచిది. మీరు ఇష్టపడకపోయినా పదవీ ప్రాప్తి తప్పదు. వాలంటరీ రిటైర్‌మెంట్ వంటి ఆలోచనలు విరమించండి. సందేహాస్పదంగా ఉన్న చిట్స్, ప్రయివేట్ బ్యాంకింగ్ వ్యవహారాలను ఉపసంహరించండి. నష్టపోయిన ధనాన్ని తిరిగి రాబట్టుకుంటారు. పెద్దలు, కన్నవాళ్ళతో స్వల్ప అభిప్రాయ భేదాలు వచ్చే అవకాశం ఉంది. కాంట్రాక్టులు, రావలసిన పెండింగ్ బిల్లులు మీ చేతికి అందుతాయి. 'కాదు' అని మీరనుకున్న పని చివరికి సానుకూలపడటం మీకు ఆశ్చర్యాన్ని కలగజేస్తుంది. రాబోయే కోర్టు తీర్పులు మీకు అనుకూలంగా వుంటాయి. కుటుంబంలో కొద్దిపాటి కలహాలు ఏర్పడినప్పటికి కుటుంబ వ్యక్తులలో పర్యటనగాని, గృహ గమనంగాని ఆనందం కలిగిస్తుంది. కొన్ని విషయాలలో మొండిగా ప్రవర్తించి, సమయోచితమైన నిర్ణయాలు తీసుకుంటారు. గృహ విషయాలకు కావలసిన అత్యవసర సామాగ్రులను సమకూర్చుకుంటారు. విదేశాలకు వెళ్ళాలనే మీ కోరిక నెరవేరుతుంది. విద్యార్థిని, విద్యార్థులకు సానుకూల కాలంగా చెప్పవచ్చు. మంచి అవకాశాలు లభిస్తాయి. మానసిక ఉద్రిక్తత, ఉద్యోగాలను అదుపులో వుంచుట మంచిది. సుదూర ప్రాంతాలలో విద్యనభ్యసించాలను మీ కోరిక నెరవేరుతుంది. అధికారులతో, ముఖ్యమైన వాళ్ళతో ఆచితూచి మాట్లాడటం, సంబంధ బాంధవ్యాలు అతి జాగ్రత్తగా కొనసాగించాలి. ఆరోగ్యపరంగా కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. నాగసింధూరం ధరించండి మంచి జరుగుతుంది.

ఇతరుల బరువు బాధ్యతలు నెత్తిన పడటం వల్ల ఆర్థికంగా దాచుకోలేకపోతారు. పూర్వీకుల ఆస్థులు కొంతకాలం అలంకార ప్రాయంగా ఉంటాయి. మీరు ఆశిస్తున్న వ్యక్తి ఆంతర్యం తెలుసుకొనడం కష్టమవుతుంది. ఉద్వేగభరితమైన క్షణాలు, రోజులు అనుభవంలోకి వస్తాయి. ఎక్స్‌పోర్ట్ వ్యాపారంలో లాభం సాధించగలనన్న ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇందుకు సంబంధించి మీ పరపతిని ఉపయోగించడంలో విఫలం చెందుతారు. స్వల్పకాలిక, సీజనల్ వ్యాపారాలు కలిసివస్తాయి. భూమి, వ్యాపార ప్రదేశం, అద్దెకు తీసుకున్న గొడౌన్స్ వంటివాటి రెన్యువల్స్‌లో ఇబ్బందులు కలిగినా చివరికి అనుకూల ఫలితాలు సాధిస్తారు. స్త్రీలతో వివాదాలు ఏర్పడే పరిస్థితులను అధిగమించండి. కొంతమందిని మార్చడం ఎవరివల్లా సాధ్యం కాదని గ్రహించండి జూలై తదుపరి మీ ఆలోచనా విధానంలో చెప్పకోదగిన మార్పులు సంభవిస్తాయి. పొరపాటు నిర్ణయాల్ని వెనుకకు తీసుకొని అధికార గణం మెప్పు కోసం దూసుకుపోతారు. అడగందే అమ్మయినా పెట్టదు అని గ్రహిస్తారు. మీకున్న గొప్పదనాన్ని మీరే ప్రచారం చేసుకొని లాభం పొందుతారు. ఉద్యోగంలో ప్రమోషన్ వల్ల పెద్దగా ఉపయోగం లేదని భావిస్తారు. ఏదో మీకు మాటిచ్చినందుకు కంటి తుడుపుచర్యగా చిన్న ప్రయోజనం మీరు నమ్ముకున్న వాళ్ళు చేశారని గ్రహిస్తారు. సమయం మించిపోయినా అవకాశాలు దాటిపోలేదు.

ప్రయోజనాల కోసం వినూత్న రీతిలో పోరాడాలని నిశ్చయించు కుంటారు. మీకు కావల్సిన రహస్య సమాచారం అందుతుంది. ఇతరులకు మీతో ఏర్పడనున్న అవకాశాల్ని పరోక్షంగా తెలియజేస్తారు. ఉన్నత స్థానాలలో ఉన్న స్థాయిలేని వ్యక్తుల్ని లెక్క చేయరు. పూర్తిగా మీరు వాళ్ళను విస్మరించడం - చాలామందికి విస్మయం కలుగజేస్తుంది.

సంతాన క్షేమము కొరకు, సంతాన ప్రాప్తికి అరటినార వత్తులతో దీపారాధన చేయండి శుభం కల్గుతుంది.

### స్త్రీలకు ప్రత్యేకం

శారీరకంగా, మానసికంగా కష్టపడాల్సిన సంఘటనలు ఎదురవుతాయి. ఆర్థికంగా కొంత వెసులు బాటు ఉంటుంది. ఖర్చు పెట్టిన సొమ్ముకు సరియైన ఫలితాలు కొంత కాలం లభించక ఆందోళనపడతారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తారు. ఆచరణలో ప్రజాప్రాతినిధ్యం లభిస్తుంది. స్వంతవాళ్ళు చేసే పనులు అపఖ్యాతికి దారితీస్తాయి. మీరే వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. సంతానంవల్ల అఖండ ఖ్యాతి లభిస్తుంది. అత్యంత ఆత్మీయులతో విభేదాలు బయటకు చెప్పకోకపోయినా వాళ్ళే వెల్లడించి మిమ్ములను లొంగదీసుకోవడానికి, అపఖ్యాతి పాలు చేయడానికి ప్రయత్నిస్తారు. మీ మీద ఉన్న ద్వేషం నామమాత్రం. మిమ్ములను కన్నవారిమీద ఉన్న ద్వేషం అపారం. ఇందువల్లే ఎక్కువ సమస్యలు ఉత్పన్నమవుతాయి. కొన్ని సందర్భాలలో అనైతిక ఆకర్షణకు లోనవుతారు. దాని నుండి చాలా త్వరగా బైటపడతారు. విదేశీయానం, ఉద్యోగం, విద్య, ఓ కొలిక్కిరావు. చాలా శ్రమించాల్సి వస్తుంది. వర్గ, కుల సామాజిక విచక్షణల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. పెద్దలు - అన్యాయపు తీర్పులు చెప్పి మిమ్ములను తెర వెనుకకు నెట్టే యత్నాలు చేస్తారు. ధనం ప్రవాహంలా ప్రవహించి మీకు అన్యాయం చేయడానికి రహదారులుగా మారుతుంది. మీకు మీరుగా ధైర్యం తెచ్చుకొని అనేక సమస్యలు పరిష్కరించుకుంటారు. న్యాయవాదుల సహకారం వల్ల మేలు పొందుతారు. న్యాయస్థానాల తీర్పులు అనుకూలం. మంచి ఉద్యోగం లభిస్తుంది. మంచి ఉన్నతాధికారి మాత్రం లభించడు. అవివాహితులకు వివాహ ప్రాప్తి సంభవం.

లీ



2005-2006 లో...

# సింహరాశి ఫలితములు

ఆదాయం-8 వ్యయం-14 | గౌరవం-1 అగౌరవం-5

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదముల యందు పుట్టినవారు "మా, మీ, మూ, మే, మో, టా,టీ, టూ, టే" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు సింహరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశివారు క్రమశిక్షణకు, ఆరోగ్యానికి, టైమ్ పంక్చువాలిటికి ఎక్కువగా ప్రాధాన్యత నిస్తారు. ఉన్నతస్థితి సాధించినా మరింత పురోగతి సాధించాలని సుఖం లేకుండా శ్రమ జీవితాన్ని గడుపుతారు. వ్యక్తిగత ప్రతిష్టకు ప్రాధాన్యతనిస్తారు. కులగౌరవం, వంశగౌరవం పట్ల ఎక్కువ శ్రద్ధ కలిగి యుంటారు. ఇతర కుల, మత, వర్గాలను ద్వేషించే స్వభావం ఉండదు. ఆర్థిక విషయాల్లో గట్టి మనుషులుగా ప్రఖ్యాతి వహిస్తారు. చేసిన సహధర్మాలకు మంచి పనులకు పెద్దగా ప్రచారంరాదు. చాలా కఠినంగా వ్యవహరించే వ్యక్తులుగా పేరు వస్తుంది. సన్నిహిత వర్గం కూడా వారి అభిప్రాయాలను మార్చలేరు. కేవలం సూచనలు మాత్రమే చేయగలుగుతారు. వీరిది భయపెట్టే విధానమే కాని నోటి ముందు కూడు లాగే స్వభావం కాదు. మిత్రవర్గం సన్నిహిత, సేవకావర్గం ఏ పని అయినా కొంత ఆలస్యంగా నయినా చేయించుకో గలుగుతారు. వీళ్లను భయపెట్టి లొంగ దీసుకునే యత్నాలు దాదాపుగా ఫలించవు. తాను నమ్మిన విషయాన్ని ఇతరులు నమ్మకపోయినా లెక్కచేయరు. నూటికి తొంభై సార్లు వీరి అంచనా చాలా

# 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారలకు ఈ సంవత్సరం ఆర్థికంగా బాగుంది, సంతకానికి, మాటకు విలువ పెరుగుతుంది. సంతానం లేని వారికి సంతానప్రాప్తి. అనవసరమైన వ్యక్తులకు అధికంగా విరాళాలు ఇస్తారు. లేక వాళ్ళ ఉన్నతి కొరకు ఖర్చు పెడతారు. కుటుంబ ప్రతిష్ఠ నిలబెట్టిన మీ పట్ల అందరికీ గౌరవం ఆదరం ఉంటుంది. దూర ప్రాంత ప్రయాణాలు అధికం అవుతాయి. దూరప్రాంత వ్యాపార వ్యవహారాలు లాభిస్తాయి. ఎకౌంట్స్‌లో తేడాలు రావడం గ్రహించి మౌనంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటారు. మీ ప్రమేయం లేకుండా కొన్ని ముఖ్య నిర్ణయాలు జరిగిపోతాయి. వాటికి మీరు ఆమోద ముద్ర వేయక తప్పదు. మీకు సంప్రాప్తించిన నూతన బాధ్యతలు, అధికారాలు ముఖ్యమైన ఆత్మీయులను దూరం చేస్తాయి. సంతాన పురోగతి బాగుంది. మంచి లక్ష్యాలను సాధిస్తారు. కుటుంబానికి కీర్తి తెస్తారు. ఈ విషయంలో అన్ని విధాలుగా మనశ్శాంతి లభిస్తుంది. మీ కోసం శ్రమించే వాళ్ళ గురించి కొద్దిగా అయినా ఆలోచన చేసి చేయవలసిన న్యాయం చేయండి. లిఖిత పూర్వక అంశాలు, పత్రాలు, డాక్యుమెంట్స్ మొదలైనవి పాతవి కొత్తవి సాంకేతికపరమైన చిక్కులకు కారణం అవుతాయి. అతి నమ్మకం, నిర్లక్ష్యం వల్ల కీడు జరుగుతుంది. వాస్తవాలకు ఆత్మీయుల వద్ద పంచుకోండి. పరిష్కార మార్గాలు లభిస్తాయి. మీస్థితి భద్రతగా ఉండి. మంచి స్థానంలో ఉన్నప్పటికీ నిత్య పోరాటం తప్పదు. పాతాళంలో ఉన్న శత్రువర్గం వేసే రాళ్ళు మీకు తగలడం విశేషం. మీ వైరివర్గానికి ఉన్న మద్దతు వెనుక అదృశ్య హస్తం ఏమిటో గమనించాల్సిన స్థితి సంభవం. ఎవరు ఎన్ని వ్యాఖ్యానాలు చేసినా కార్యరూపం దాల్చడానికి ప్రతి పనికీ మీ సహాయ సహకారాలు కోరుకుంటారు. మీతో చెప్పకుండా మాత్రం చేయరు. మీతో రెండు చెప్పి నాలుగు చేయడం మాత్రం జరుగుతుంది. ద్వితీయంలో ఉన్న గురు, కేతువుల కారణంగా చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఏకాదశ, వ్యయస్థానంలోను ఉన్న శని విషయాల్లో నిజం అవుతుంది. పదిశాతం వైఫల్యం చెప్పకోదగిన నష్టం కలిగిస్తుంది. బంధువుల వల్ల, సన్నిహిత రక్త సంబంధీకుల వల్ల, పర స్త్రీల వల్ల నష్టం జరుగుతుంది. వృత్తి ఉద్యోగుల పరంగా కొంతకాలం అజ్ఞాత వాసం, అల్లులను ఆశ్రయించుట తప్పకపోవచ్చు. వైద్య, సాంకేతిక వ్యాపార రంగాల్లో రాణిస్తారు. రాజకీయ రంగంలో ప్రారంభం నుండే అధిక స్థితి ఉంటుంది. ఉన్నత స్థానాలలో ఉండి సామాన్యులను దూరం చేసుకుంటారు. సామాన్య స్థితిలో ఉన్నప్పడు ఉన్నత స్థానాలలోని వారికి దూరం అవుతారు. శిరోవేదన, పార్శ్వపు నొప్పి, కీళ్ళనొప్పలు ఇబ్బంది కలిగిస్తాయి. సంస్థల స్థాపన, విస్తరణ ధ్యేయంగా కృషి చేస్తారు. లేక అనేక ఉద్యోగుల పట్ల, వారి వారి విధుల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉంటారు. ఇది నిత్య జీవితంలో ఉపయోగపడే అంశము. స్థాయి లేని వ్యక్తుల్ని మీకు పోటీగా నిలిపి వాళ్ళను బలవంతులను చేసి మీకు పోటిగా నిలపాలనే యత్నాలు అత్యున్నత స్థానాలలోని వ్యక్తులు చేస్తారు. ఇందుకు మీ సొంత ధనం ప్రోత్సాహం కూడా తోడు అవుతుంది. కొనుగోలు చేసిన ఆస్తులు వివాదాస్పదం కావచ్చు. వ్యవహారజ్ఞలేని రోజుల నుండీ, పెద్ద పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఢీ కొనాల్సి వస్తుంది. స్వజనులు బాధ్యతలు వదిలేసి వెళ్ళిన తరుణంలో అన్నీ మీరొక్కరే అయి సరిదిద్దాల్సిన కాలం వస్తుంది. కఠినమైన కాలాన్ని అధిగమించిన తదుపరి స్వంతవాళ్ళే సమస్య అవుతారు. తృప్తి లేని మనుషులు అధికంగా విసిగిస్తారు. రవి, కుజ, రాహు, గురు మహర్దశలు బాగా రాణిస్తాయి. శనిదశ కూడా మంచిగానే ఉంటుంది. స్నేహితులు చేసే సహాయ సహకారాలు జీవితంలో మరిచిపోలేనివిగా ఉంటాయి. వ్యతిరేక ధోరణిలో ఆలోచన చేయనంతకాలం మేలు గుర్తుంటుంది. మహోన్నతమైన ఆశయ సాధన ఉంటుంది. దానికి తగిన కృషి కూడా ఉంటుంది. విదేశీ వ్యవహారాలు లాభించడం జీవితంలో చెప్పకోదగిన అంశం. సిద్ధ గంధముతో శివార్చన, ఆంజనేయ స్వామి ఆరాధన వల్ల మరింత వృద్ధి సాధించ గలుగుతారు. మే నెల సాధారణంగా బాగుంటుంది. మీ ఉద్దేశ్యాలు మంచివే అయినా ఆచరణలో కొన్ని కష్టం అని గ్రహించండి. ప్రయోజనం లేని శ్రమకు దూరంగా ఉంటే జీవితంలో మరింత అభివృద్ధి సాధిస్తారు. సంతానం వల్ల మంచి ప్రఖ్యాతి వస్తుంది.

అష్టమూలికాతైలం పవిత్రమైనది. నకిలీలు కొని మోసపోకండి.

ఇంట్లో, స్త్రీ ఆధిపత్యానికి శుక్రుడు కారకుడు.

కారణంగా పాదాలు మోకాళ్ల నొప్పులు సంభవము. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని కొనుగోలు చేసే భూముల వ్యవహారాలు గోప్యంగా నడిపించండి. జీవిత భాగస్వామి అన్ని విషయాల్లో అండదండలుగా ఉండడం విశేష శుభ ఫలితాలకు కారణమవుతుంది. వ్యాపారంలో రోటేషన్ బాగానే ఉన్నా, లాభాలు చేతికి రాక ఇతర విషయ, వ్యవహారాల్లో పెట్టుబడిగా మారుతుంది. చాలా సందర్భాలలో ఏం సుఖపడుతున్నామన్న కోపం కలుగుతుంది. ప్రస్తుతం వచ్చిన అవకాశాలను భవిష్యత్‌కు పయోగించుకోవడంలో అధిక శ్రద్ధ చూపించడమే దీనికి కారణం. శ్రమ వర్తమానం గురించి కాదు భవిష్యత్ గురించి. రాజకీయంగా, ఉద్యోగపరంగా మీరు ఆత్మీయ వర్గం కొరకు చేసిన త్యాగాలు వికటిస్తాయి. మీ ఆశలు, ఊహలు తలకిందులు కావచ్చు. వాళ్ళు మాట మీద నిలబడరు. తాత్కాలిక ఆకర్షణలో చిక్కుకొంటారు. వాళ్ల కర్మకు వాళ్లకు వదిలి వేయడమే మంచిది. స్థిరాస్థులకు సంబంధించిన వ్యవహారాలు గతంలో పరిష్కారమైనవి తిరిగి కొంత ఇబ్బంది కలిగిస్తాయి. పత్రికలు, ప్రచార సాధనాల ద్వారా కొంతవరకు ఇబ్బందిపడతారు. లేని వాటికి ఉన్న వాటికి సమాధానాలు వివరాలు ఇవ్వాల్సిన స్థితి సంభవం. వినయోగదారుల కోర్టులను ఆశ్రయించి ఉపశమనం పొందుతారు. సూర్యగ్రహణం సంభవించినప్పడు మాత్రం జాగ్రత్తలు తప్పవు. గ్రహణం కనపడలేదని నిర్లక్ష్యం చేస్తే ఆ తప్పలు నాది కాదు. ఏప్రియల్ 19 (గత సం॥) ఏర్పడిన సూర్యగ్రహణం ప్రభుత్వాలనే మార్చింది. ఈ గ్రహణం కనపడలేదు.

సూర్యగ్రహణాలు ఏర్పడినప్పడు జాగ్రత్తలు వహిస్తే జరిగే నష్టం చాలా కొద్దిగా ఉంటుంది. ఎవరి కోసమైతే మీరు అందరినీ దూరం చేసుకున్నారో, ఏ నోటితో మీరు పొగిడారో - అదే నోటితో విమర్శలు చేయాల్సిన స్థితి ఏర్పడుతుంది. మీ ప్రాధాన్యతను తగ్గించి అవమానం పాలుచేయాలన్న ఉద్దేశ్యం మీ ద్వారా లాభం పొందిన వారికి కలుగుతుంది. జూలై నుండి ఇలాంటి పరిస్థితి ఏర్పడి సంకటంగా మారుతుంది. పెద్ద ప్రయోజనాలు గలిగిన పనులు సగంలో నిలిచిపోతాయి. నష్టం కాదు లాభం కాదు. ఏదీ నిర్ణయించలేని విషయం. చిన్న చిన్న కార్యక్రమాలు మీ కను సైగలతోనే పూర్తి అవుతాయి. జీవితంలో ప్రశాంతత లేని సుదీర్ఘమైన పోరాటాలు, విరోధాలు విసుగు కలిగించవచ్చు. మీరు సిద్ధాంతాలు మార్చుకోని మంచివాళ్లకు అండగా ఉండి, వాళ్లతో సహ జీవనం చేసినా చివరికి వాళ్ళు కూడా చెడ్డవాళ్లే అవుతారు. చాలా సందర్భాలలో గ్రహగతుల ఫలితాల ముందర మానవ యత్నాలు నామమాత్రమేనా - ఎన్నాళ్లీ అన్యాయపు కాలం అని బాధపడతారు - వ్యవస్థకు సేవచేసి వ్యక్తి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడవలసిన స్థితి. అంతరంగాన్ని సంక్షోభంలో పడేస్తుంది. దైవానుగ్రహం, తెలివితేటలు, ద్వితీయ, తృతీయ స్థాన సంచార గురుగ్రహ శుభత్వము చేత, మధ్యవర్తిత్వాలు జరుగుతాయి. మీకు కొంత ఊరట లభిస్తుంది. కొన్ని అధికారాలు బాధ్యతలు మీకు దాఖలు పరచబడతాయి. శుభకార్యాలకు సంబంధించిన విషయాలు అనుకూలిస్తాయి. గ్రంథ రచన - మీడియాతో సత్‌సంబంధాలు మానసిక ఊరట కలిగిస్తాయి. పరిస్థితులు ఏ విధంగా మారినా ధైర్యం కోల్పోకుండా. వర్గాన్ని చెదిరిపోనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మీకు ఇష్టంలేకపోయినా స్థిరాస్థిలో కొంతభాగం అమ్ముతారు. అది కూడా పురోగతి కొరకే, సహచరవర్గం, సేవకా జనం పని తీరు నిర్ణయాత్మక అవుతుంది.

నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. నాగసింధూరం ధరించండి. విద్యార్థినీ, విద్యార్థులకు సరస్వతీ తిలకం ధరించుట చెప్పదగిన సూచన.

## స్త్రీలకు ప్రత్యేకం

గ్రహణాల ప్రభావం వల్ల ముఖ్యమైన అవసరాలకు ఆటంకాలు వస్తాయి. గురుగ్రహ అనుగ్రహం వల్ల ఆర్థిక విషయాల్లో పురోగతి సాధిస్తారు. ఇతరుల

మాటలకు మోసపోయే అవకాశం ఉంది. కొన్నాళ్ళు జమా ఖర్చులు సమానంగా ఉంటాయి. ఇది నమ్మదగని విషయంగా ఉంటుంది. ఆదాయానికి ప్రచారం ఖర్చుకు రహస్యం కారణం అవుతుంది. శుభకార్యాల విషయంలో మనోభీష్టం నెరవేరుతుంది. కుటుంబ సభ్యులు, సంతానం, ఇతరుల సున్నితమైన సమస్యలపైన మీరు దృష్టి సారించాల్సిన పరిస్థితి కలుగుతుంది. స్వతంత్రించి కఠినమైన నిర్ణయాలు చేస్తారు. ప్రతిష్టకు, విద్యకు ప్రాధాన్యతనిస్తారు. కరుణలేని మనిషిగా ముద్రపడవచ్చు. మీ వ్యక్తిగత సౌఖ్యాలను ఇతరుల కొరకు త్యాగం చేస్తారు. సామాజిక సేవ చేయడానికి ఆకస్మిక అవకాశం కలిసి వస్తుంది. కొనుగోలు చేసిన వాటిని అమ్మడానికి ఇది సరియైన సమయం కాదన్న మీ సలహా ఆచరణకు నోచుకోదు. ఆత్మీయ వర్గం, సొంతవాళ్ళు హోదాపూర్తిగా నిర్ణయాలు తీసుకోవడం వెనుక వున్న ఆంతర్యం మీకు ఆలస్యంగా అర్థమవుతుంది. మోసము - నమ్మకము ఒకే నాణానికి ఇరువైపుల వంటివని గ్రహిస్తారు. వ్యక్తులు మోసం చేసినా దైవం మీ వైపే ఉన్నారు. పతనం కోరుకున్నవారి పంతం నెరవేరదు. పదింతలు ఉన్నతి స్థితి సాధిస్తారు. మీరు అనుకున్న అన్ని విషయాల్లో దాదాపుగా పట్టు సాధిస్తారు. అవివాహితులకు వివాహ కాలం. విదేశీ విద్య, ఉద్యోగం, సంభవం - సంతాన సంబంధిత విషయాల్లో వ్యక్తిగత శ్రద్ధ చాలా అవసరం. అదృష్టానికి - నిందలకు దగ్గరగా జాతకం ఈ సంవత్సరం నడుస్తుంది. ఆరావళి కుంకుమతో లక్ష్మీ పూజ చేయండి.

ళీ



2005-2006లో...

# కన్యరాశి ఫలితములు

| ఆదాయం-14 | వ్యయం-2 | గౌరవం-6 | అగౌరవం-6 |
|---|---|---|---|

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదముల యందు పుట్టినవారు "టో, పా, పి, పూ, షం, ణా, ఠా, పే, పో" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు కన్యరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు -ఫలితాలు

ఈ రాశిలో జన్మించిన వారు స్వయం ప్రతిభ కలిగి ఉంటారు. ఇతరుల ప్రతిభా సామర్థ్యాలను చక్కగా గుర్తించగలరు. ఏ పనికి ఎవరు సరియైన వారో తెలివిగా నిర్ణయం చేయగలరు. గణితంలో మంచి పరిజ్ఞానం, జ్ఞాపకశక్తి, బంధు ప్రీతి అధికంగా ఉంటాయి. సమస్యలు సృష్టించి పరిష్కరించినట్లుగా నటించే స్నేహిత వర్గం వీరికి ఉంటుంది. ఇతరుల నేర ప్రవృత్తిని గుర్తించగలరు. కాని ఋజువు చేయలేరు. పత్రికా రంగంలో రాణిస్తారు. రైటింగ్ వర్క్‌లో నేర్పరులు, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలకు సంబంధించిన స్కీములను సద్వినియోగం చేసుకోగల నేర్పు ఉంటుంది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్న లోపాలు ఇబ్బంది కలిగిస్తాయి. మనీ రొటేషన్ చేయడంలో మంచి నేర్పరితనం ఉంటుంది. త్వరితగతిన ఇతరులపై నమ్మకం ఏర్పరుచుకోరు. అయినా నమ్మి మోసపోతారు. మధ్యవర్తిత్వ సంతకాలు, ఇతరుల విషయంలో హామీ ఉండుట మొదలైనవి కలిసిరావు. వీలునామాలు లిటిగేషన్ వ్యవహారాలు లాభిస్తాయి. మేధావులతో, ఆధ్యాత్మిక గురువులతో సన్నిహిత సంబంధాలు లాభిస్తాయి. అంతర్గత రాజకీయాలు ప్రతి చోటా ఇబ్బంది కలుగచేస్తాయి. కొంత పురోగతి సాధించిన తరువాత మిమ్ములను బైటకు పంపే ప్రయత్నాలు జరుగుతాయి. వివాహ

జీవితంలో చెప్పకోదగిన ఒడిదుడుకులు ఉండవు. స్వయంకృతాపరాధాలు ఉంటాయి. శుక్ర దశ యోగవంతమైనది. మధ్యస్త జీవితం నుండి విలాసవంతమైన జీవితం గడుపుతారు. ఇబ్బందుల్లో ఉన్న స్త్రీలను ఆదుకొని కష్టాలు కొని తెచ్చుకుంటారు. సంతాన పురోగతి ప్రారంభంలో ఇబ్బందులకు గురి చేస్తుంది. ప్రింటింగ్, టెండర్లు, కాంట్రాక్టులు, న్యాయ సంబంధమైన వృత్తి వ్యాపకాలు రాణింపులో ఉంటాయి. బుధ గ్రహం అనుకూలత వల్ల అధికార ప్రాప్తి, ప్రజల్లో మంచి ప్రఖ్యాతి లభిస్తుంది. అదే విధంగా సినీ, టీవి, కళారంగాల్లో కూడా అద్భుతంగా రాణిస్తారు. చెస్, క్రికెట్ మొదలైన క్రీడా రంగాల్లో కూడా మంచిగా రాణిస్తారు. బలమైన వర్గాన్ని ఏర్పరుచుకుంటారు. మీరు అనుకున్న కార్యక్రమాలకు, ఆశయాలకు లోబడి పని చేసే అభిమాన వర్గం ఉంటుంది. హాస్య సంబంధమైన, అంచనాలకు సంబంధించిన రచనలు వెలుగులోకి వస్తాయి. వ్యాపార దక్షత కలిగి ఉంటారు. వ్యాపార విస్తరణ సంతృప్తికరంగా ఉంటుంది. బాగాలేని సంస్థ రూపు రేఖల్ని మార్చి మంచి దారిలో పెట్టగలరు. ప్రతి విషయంలోనూ చివరి వరకూ అధికంగా కొనసాగేలా చూసుకోండి. కొద్దిపాటి నిర్లక్ష్యం కూడా పనికిరాదు. భూములు, పెద్దలిచ్చిన ఆస్తుల వంటివి అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉంది. కొన్ని వివాదాలు స్థిరాస్థుల పరంగా తప్పకపోవచ్చు. మీ మనసుకు నచ్చిన విధంగా గృహం ఏర్పరుచుకుంటారు. వ్యక్తులు నడిపే చిట్‌ఫండ్స్ వ్యవహారాల పట్ల జాగ్రత్త వహించాలి. రవాణా వ్యాపారం కుజ దశలో యోగిస్తుంది. అందులో సంపాదించింది చాలా మందికి చేతికి రాదు. విష్ణు సహస్రనామ పారాయణ, సుదర్శన కవచ పారాయణ వల్ల మేలు కలుగుతుంది. గణపతి దేవుని అర్చన విశేష రక్షణ కవచం. ఉత్తరం, దక్షిణం రెండు దిక్కులూ లాభిస్తాయి. వంశోత్తరి దశలననుసరించి నిర్ణయాలు తీసుకుంటే చాలా మేలు కలుగుతుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ సంవత్సరం జీవితాశయం నెరవేర్చుకుంటారు. శుభకార్యాలు పెళ్ళి, మనోవాంఛ, అధికారము, వృత్తి స్థిరత్వము, స్థిర చరాస్థుల కొనుగోళ్ళు, ఋణాలు తీర్చడం వంటి ముఖ్యమైన విషయాలు మీకు లాభిస్తాయి అనుకూలిస్తాయి. దశమ స్థానంలోనున్న శని శ్రమకు తగిన ఫలితాన్ని ప్రజాభిమానాన్ని ఇస్తారు. లగ్నంలో ఉన్న గురు, కేతువుల కారణంగా స్వల్ప ఆరోగ్యపరమైన జాగ్రత్తలు. కళా సాంస్కృతిక ఉద్యోగ, రంగంలో పోటీ ఎదురవుతుంది. అనవసరమైన పరిశీలకులు ఉండుట చేత ప్రశాంతత తగ్గుతుంది. మీ పేరు గోప్యంగా ఉంచి మీ వాళ్ళకు పదవీ ప్రాప్తి కల్పిస్తారు. రాజకీయ, ఉద్యోగ, వ్యాపారపరంగా భగవంతుని అనుగ్రహానికి ఇబ్బంది లేదు. న్యాయం చేయవలసిన వాళ్ళే న్యాయం సంపూర్ణంగా చేయరు. మీరు అందరినీ దాటి పోతారన్న భావనకాదు. మీ ఆలోచనా విధానంలో స్పష్టత లేకపోవడమే కారణం. ఆలస్యంగా తీసుకునే నిర్ణయాల వల్ల నష్టము. సంతాన పురోగతి చాలా సంబరం కలిగిస్తుంది. సంతానానికి లేక మీకు విదేశీ అవకాశాలు కలిసి వస్తాయి. అన్య భాషలు నేర్చుకుంటారు. నేర్చుకున్న అన్య భాషల వల్ల ప్రయోజనం పొందుతారు. టెండర్లు అనుకూలం అవుతాయి. కాని సాంకేతిక సమస్యలు వస్తాయి. బంధువుల్లోని వారికి భాగస్వాములుగా చేర్చుకుంటారు. బంధువుల్లో మంచి అభిప్రాయం సాధించడానికి మీ వంతు కృషి చేస్తారు. ఐకమత్యంగా ఉంటే ప్రయోజనం పొందవచ్చన్నది మీ భావన. ఇందుకు ముఖ్యమైన వ్యక్తుల నుండి వ్యతిరేకత ఎదురవుతుంది. అంతర్గతంగా మీ ఆలోచన ప్రకారం ఏది అనుకుంటారో అదే చేస్తారు. సత్ ఫలితాలు పొందుతారు. ఇతరులతో సంబంధం లేకుండా మీ ముఖం చూసి మీ వాళ్ళకు మేలు చేశామని ఉన్నత స్థాయి వ్యక్తుల్లేకుండ బద్దలు కొట్టినట్లు చెబుతారు. జాతకం ఎప్పుడూ ఒకేలా నడువదు. ఒడిదుడుకులు ఉంటాయి ఇది సహజం. శుక్రమౌఢ్యమి, రవి గ్రహ గ్రహనం ఈ రెండు సమయాలు మీకు జాగ్రత్త కాలము. ఇంద్రాణి రూపు సమంత్రకంగా ధరించండి. శుభప్రదం. చేతిలో ఉన్న ధనంపై సగం ఆశ పెట్టుకోండి. ఇతరుల ధన సంబంధిత వాగ్దానాలపై అధికంగా ఆశ పెట్టుకొని కార్యాచరణకు దిగవద్దు. సప్తమ స్థానంలో రాహువు వల్ల ఆత్మీయ వర్గానికి, చట్టపరమైన చిక్కులు, అనారోగ్య సమస్యలు సంతానం. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి స్వంత నిర్ణయాలు చేయవద్దు. ఈ రంగంలో నిందలకు దూరంగా ఉండండి. లాభాలకు దగ్గరగా జాతకం నడుస్తుంది. పది మంది చెప్పిన అధర్మం తాత్కాలిక ధర్మం అయ్యే పరిస్థితి వస్తే మీరు నిర్ణయాన్ని

ప్రకటించండి. జూద క్రీడలు, స్పెక్యులేషన్స్ మధ్యస్తంగా ఉంటాయి. ఏమైనా జూదానికి దూరంగా ఉండటమే మేలు కలిగిస్తుంది. కళాత్మక వస్తువుల్ని అధిక ధనం వ్యయం చేసి కొనుగోలు చేస్తారు. అవివాహితులకు వివాహ కాలము. సంతానంలేని వారికి పుత్ర సంతాన ప్రాప్తి. సంభవం. ఈ రాశిలో జన్మించిన స్త్రీలు గర్భధారణ అనంతరం ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భ రక్షణ ముఖ్యం. మహత్తర జ్ఞాన సంపన్నులు, ధర్మనిష్టా గరిష్టులని మీరు భావించి పూజించిన వారి వల్ల ఆశ్చర్యకరమైన రీతిలో ఫలితాలు కనిపిస్తాయి. వ్యాయామం (ఫిజియోథెరపీ) అవసరపడుతుంది. టాక్సులు, ప్రభుత్వ పన్నులు చెల్లించవలసిన దానికంటే అధికంగా చెల్లిస్తారు.

మీరు నమ్మిన వ్యక్తులు పైకి చూపిస్తున్న ఆదరణలో లోపం ఉండదు. ప్రయోజనాలు దక్కుతాయని మీరు భావించే సమయానికి 'బ్లడ్ ఈజ్ థిక్కర్ దాన్ వాటర్' అనే సామెత గుర్తు చేసుకోవాల్సి వస్తుంది. మీ శ్రమ కన్నా సామర్థ్యం కన్నా బంధుత్వం ముఖ్యం కావడం బాధ కలిగిస్తుంది. కుల మత వర్గప్రాతిపదికలు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్కటి ఇబ్బందిపెడుతుంది. వీటన్నింటినీ మొండి ధైర్యంతో తెగింపుతో ఎదుర్కొంటారు. వ్యూహం ఫలిస్తుంది. మిత్రవర్గంతో పోటీ అనివార్యమవుతుంది. గణాంకాలకు సంబంధించిన వ్యవహారాల్లో మీ నిర్లక్ష్య వైఖరివల్ల నష్టం వాటిల్లే అవకాశం వుంది. సామాజిక న్యాయం కొరకు న్యాయస్థానాలను ఆశ్రయించవలసి వస్తుంది. ఆశయాల సాధనకు కృషి చేసే మీ వాళ్ళకు తగిన సహాయ సహకారాలు అందించగలుగుతారు. పరివర్తన రాని వ్యక్తులలో మార్పు కోసం మరింత కష్టపడడం తగదని మీ మీద ఒత్తిడి వస్తుంది. ఎంత మీరు కాదనుకున్నా ఇష్టంలేని వ్యక్తులతో, సంఘ వ్యతిరేక శక్తులతో కలసి పనిచేయాల్సి రావచ్చును. సంస్థలోను, కుటుంబంలోను, బంధువులలోను చాలా విషయాలకు మీరే కేంద్ర బిందువుగా మారుతారు. అయితే మంచి విషయాలకు సంబంధించి మీకు గౌరవం లభించకుండా ఓ వర్గం అడ్డుకుంటుంది. పేరు ఎవరికి వచ్చినా ఏముందిలే అయిన వాళ్ళకు మేలు జరిగితే చాలు అనే మీ మనస్తత్వం వల్ల నష్టపోతారు. వ్యాపారంలో, వృత్తిలో కొంత పోటీ ఏర్పడుతుంది. మీకు సంబంధం లేకపోయినా ఆ పోటీవల్ల మీ లాభాలకు ఇబ్బంది కలుగుతుంది. మీరు ఉన్నత పురస్కారాలు, పదవులు ఇతరులకు ఇప్పించడంలో విశేష కృషి చేసి అనుకూల ఫలితాలు సాధిస్తారు.

నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన, నాగసింధూరం ధరించుట ఉత్తమం ఆదివారంనాడు సిద్ధ గంధముతో పూజించండి విశేష శుభప్రదం. ఈ రాశిలో జన్మించిన పురుషులు సమంత్రకంగా కాలభైరవ రూపు ధరించండి.

## స్త్రీలకు ప్రత్యేకం

చెప్పదగిన స్థాయిలో ఇబ్బందులు బహిర్గతంగా లేకపోయినా మానసిక ప్రశాంతి ఉండదు. ఎప్పుడూ ఏదో విషయమై నసపెట్టే మనుషుల వల్ల ఇబ్బంది కలుగుతుంది. బాధ్యతల్ని వదిలించుకొని వెళ్ళాలన్న ప్రయత్నాలు ఆలోచనలుగానే మిగిలిపోతాయి. ఆర్థిక స్థితి, ఉద్యోగం, సమాజంలో ప్రతిష్ట, విద్య బాగానే ఉంటాయి. మీ మీద ఇతరుల నియంత్రణ మితిమీరినట్లుగా అనిపిస్తుంది. స్వేచ్ఛాయుత జీవనానికి ఇబ్బంది కలగడం అన్ని వివాదాలకు కేంద్ర బిందువు అవుతుంది. ఇతరులు చెప్పే విషయాలు ఉద్దేశ్యపూర్వకంగానే మీరు పాటించరు, లెక్కచేయరు. మీ వ్యక్తిత్వాన్ని చాటుకొనడానికి శ్రమిస్తారు. బంధువుల సహకారం వల్ల మీ విదేశీయానం ఖరారు అవుతుంది. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూచుకోండి. లేకపోతే ముఖ్యమైన సమయంలో అది ఒక అవరోధం అవుతుంది. ఇతరులవద్ద మీ సన్నిహితుల వద్ద మీ వ్యక్తిగతమైన వస్తు సామాగ్రి ఉంచవద్దు. మీ ఇష్టదైవం ఎక్కువసార్లు స్వప్నంలో కనిపిస్తాడు. రిజిస్ట్రేషన్స్ వంటివి పూర్తి కాకపోవడం. డాక్యుమెంట్స్‌లో లోపాలు కొన్నాళ్ళు ఇబ్బందిపెడతాయి. శుక్రమౌఢ్యమి కాలంలో జాగ్రత్త వహించాలి. మీ మనోభావాలకు తగిన విధంగా మీ వాళ్ళను మార్చగలుగుతారు. ఇది గొప్ప విజయము. గృహనిర్మాణం, వాహనం కొనుగోలు వంటివి కలిసివస్తాయి. ఉన్నత స్థానాలలోని వ్యక్తుల వల్ల జరిగే పొరపాట్లకు మీరు నష్టపోవాల్సి రావచ్చు. మాట మీద నిలబడే వ్యక్తులు చాలా తక్కువని గ్రహిస్తారు. కళా, సాహిత్య రంగాల్లో కీర్తి ప్రోత్సాహకర వాతావరణం వస్తుంది. అవివాహితులకు వివాహ కాలం. సంతానంలేనివారికి సంతాన ప్రాప్తి. విడాకులు కోరుకునే వార్కి స్వేచ్ఛ - ఇష్టంలేని వ్యక్తుల నుండి విమోచన లభిస్తుంది. సంవత్సరం మొత్తం మీద లాటరీలు, బహుమతులు వంటివి కలిసి వచ్చే స్థితి సంభవం.

2005-2006 లో...

# తులారాశి ఫలితములు

| ఆదాయం-8 | వ్యయం-8 | గౌరవం-7 | అగౌరవం-5 |
|---|---|---|---|

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదముల యందు పుట్టినవారు "రా, రి, రూ, రే, రో, త, తీ, తూ, తే" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు తులారాశికి చెందినవారు.**

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు -ఫలితాలు

ఈ రాశివారు జీవితాన్ని పోటీగా తీసుకుంటారు. జీవిత ప్రారంభంలో ఎదురయిన ఘట్టాలకు కుంగిపోకుండా ఉపాయంతో మంచి లక్ష్యాలను సాధించాలన్న పట్టుదలతో ముందుకు సాగుతారు. తమ ఆలోచనా విధానాన్ని చెప్పరు. ఇతరుల కుయుక్తులు వీరిపై ప్రభావం చూపవు. ఎత్తులకు పై ఎత్తులు వేయడంలో అందెవేసిన చేయి, మేథావులుగా గుర్తింపు పొందుతారు. అత్యున్నత స్థానాలను అధిరోహిస్తారు. ప్రజాకర్షణ ఎక్కువగా ఉంటుంది. ప్రజల అభిమానంతో ముడిపడిన వృత్తి ఉద్యోగ వ్యాపార, వ్యవహారాల్లో బాగా రాణిస్తారు. ఆర్థిక క్రమశిక్షణ బాగా పాటిస్తారు. స్థిరాస్తుల వృద్ధి జరుగుతుంది. అనువంశికంగా వచ్చిన వ్యాపారాలను మార్పుచేసి అభివృద్ధి చేస్తారు. అలంకార ప్రియులు, ఎక్కువ మంది అభిరుచి ఎలా ఉంటుందో తేలిగ్గా తెలుసుకోగలరు. కళా సాహిత్య, రాజకీయ రంగాల్లో రాణిస్తారు. యౌవ్వన ప్రాయంలో అదృష్టం కలిసి వస్తుంది. జీవితంలో అనేక సుఖాలు అనుభవిస్తారు. తర తరాలకు ఆదర్శంగా నిలుస్తారు. బంధువర్గంతో విభేదాలు ఉంటాయి. ఈ విభేదాలు దీర్ఘకాలం కొనసాగుతాయి. ఏ విషయంలోనూ రాజీ లేకుండా శ్రమించే మనస్తత్వం ఉంటుంది. అన్ని విషయాల్లో కూతురికి మాత్రం మినహా యింపు ఉంటుంది.

వ్యక్తిగత సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకునే ప్రయత్నాలు చేస్తారు. ఓ స్థాయికి వచ్చినా పాత అలవాట్లు, క్రమశిక్షణ పోవు. ఆత్మీయులతో విభేదాలు వస్తాయి. గతం మరచిపోయి ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటారు. డిశంబరు మాసంలో నిర్ణయాలు కాస్త జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. విదేశీయాన ప్రయత్నాలు లాభిస్తాయి. సాంకేతిక విద్యా రంగంలో రాణిస్తారు. మంచి మార్గదర్శక, దర్శకత్వ ప్రతిభ కలిగి ఉంటారు. నూనె, అపరాలు, విత్తనాలు, యంత్ర, వాహన సంబంధమైన వ్యాపారాల్లో రాణిస్తారు. ముఖ్యంగా శని మహర్దశ రాజయోగాన్నిస్తుంది. ఈ రాజయోగం వాళ్లకే పరిమితం కాదు ఆ దశలో కలిగిన సంతానానికి కూడా వర్తిస్తుంది. జీవితంలో ప్రధానంగా నిందారోపణలు బాధకలిగిస్తాయి. వైరివర్గం సిద్ధాంతాలను, భేదాభిప్రాయాలను పక్కనుంచి వీరి విషయం వచ్చేటప్పటికి ఏకం అవుతారు. వైరివర్గంలో ఐకమత్యత లేనంత కాలం ఇబ్బంది లేదు. స్వంత వర్గం బెదిరిపోకుండా జాగ్రత్త వహిస్తారు. అంతర్యాన్ని గ్రహించే ప్రయత్నాలు చేయరు. స్వజనుల అసమ్మతికి తగిన కారణం కనుగొనడంలో విఫలం చెందుతారు. ఉన్నత స్థానంలోని వారివల్ల అన్యాయపు తీర్పులు అమలులోకి వస్తాయి. ముఖ్యంగా బాల్యంలో ఉన్నత స్థానాలలోని వారి వల్ల కుటుంబానికి అపకారం జరుగుతుంది. న్యాయపరమైన అంశాలు జీవితంలో ప్రాధాన్యత సంతరించుకోకుండా జాగ్రత్త వహించాలి. సాహసోపేతమైన నిర్ణయాలు కలిసివస్తాయి. ఆత్మీయ వర్గంతో సన్నిహిత వర్గంతో విభేదాలు ఇబ్బంది కలిగిస్తాయి. విలాసవంతమైన జీవితానికి లేక వస్తు సామాగ్రికి ఎక్కువగా ఖర్చు చేసే మనస్తత్వం కలిగి ఉంటారు. పడమటి, దక్షిణ దిక్కులు లాభిస్తాయి. శుక్ర మౌఢ్యమి కాలం జాగ్రత్త వహించాలి. దీపావళి అమావాస్య నాడు లక్ష్మీదేవి పూజ కలిసి వస్తుంది. ప్రజాబలం, సంఘంలో మంచిపేరు, సన్నిహిత సహచర వర్గం అండదండలు అనుసరించి నడిచే వర్గము ఉంటారు. అత్యున్నత స్థానంలోని వారితో పోరాటం చాలా సందర్భాలలో తప్పకపోవచ్చు. మేథస్సు, స్వీయవిద్య, సాంకేతిక పరిజ్ఞానం,

అక్కరకు వస్తాయి. బాల్యంలో మిశ్రమ ఫలితాలు ఉన్నా స్వయం శక్తితో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానం చేరుకుంటారు. శని, శుక్ర గురు గ్రహముల సంచారాన్ని అనుకరించి నిర్ణయాలు తీసుకుంటే మేలు జరుగుతుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశి వారికి ఈ ప్రథమార్థంకంటే, ద్వితీయార్థం బాగుంది. వ్యక్తిగత పలుకుబడి పెరుగుతుంది. కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తారు. సన్నిహిత సహచర వర్గం మన్ననలు పూర్తిగా పొందలేరు వ్యయంలో గురువు ఆరింట రాహువు దశమ, అష్టమ స్థానాల్లో శని ప్రధానమైన ఫలితాలను నిర్దేశిస్తున్నాయి. శత్రువర్గ, వైరివర్గం బలహీనతలే మీ బలం అవుతాయి. ముఖ్యమైన నిర్ణయాలు త్వరితంగా అమలు చేసి అలవాట్లలో మార్పు తెచ్చుకోని శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇంత వరకూ మీరు సాధించిన స్థాయిని నిలబెట్టు కొనడానికి మరింత శ్రమిస్తారు. విదేశీ వ్యాపార వ్యవహారాలు లాభిస్తాయి. శ్రమించని వ్యక్తులకు లాభాలు పంచవలసి వస్తుంది. చాలా విషయాల్లో మీ నిర్ణయాలు వివాదాస్పదం అవుతాయి. పోటీ వర్గం ఏ మాత్రం ప్రతిఘటన ఇవ్వదు. చడీ చప్పడు లేకుండా వాళ్ళు నష్టపోయి మిమ్ములను కష్టపెట్టే ప్రయత్నం చేస్తారు. రాజకీయంలోను, క్రీడల్లోను, ముఖ్యంగా వ్యాపారంలో అనారోగ్యకరమైన పోటీని సృష్టిస్తారు. అపనిందలు కొండకంటే బరువైనవని గ్రహిస్తారు. స్థిరాస్థుల కొనుగోలు విషయంలో లాభపడతారు. తల్లివైపు బంధువుల స్థితిని చక్క దిద్దవలసి వస్తుంది. కోరి కష్టాలు తెచ్చుకునే వారికి ఇష్టంలేకపోయినా అండగా నిలవక తప్పదు. ఆర్థికంగా వచ్చేది వస్తూనే ఉంటుంది. ప్రజల్లో ఘనంగా చెప్పకోబడతారు. సామాజిక కార్యక్రమాలకు ఆర్థిక సాయం చేస్తారు. అయితే సొంత వాళ్ళకు ముఖ్యంగా పిల్లలకు ఆర్థిక అవసరాలు ఎదురైతే మీరు ఇబ్బందిపడతారు. మరొకళ్ళని తాత్కాలికంగా అప్ప అడగాల్సిందే. ఈ సంవత్సరం ఋణాలు రావల్సినవి చాలా కాలం స్తంభిస్తాయి. ఆరోగ్య వృద్ధి కొరకు ఖర్చు చేయాల్సిన స్థితి కూడా తప్పదు. స్పెక్యులేషన్, కోర్టు వ్యవహారాలు, లిటిగేషన్‌లో ఉన్న ఆస్థి వ్యవహారాలు లాభిస్తాయి. మహోన్నతమైన పనులు సాధారణ వ్యక్తులతోనే చేయవచ్చని మీరు అభిమానించి ఆదరించి ఖర్చుబెట్టి అందలం ఎక్కించిన వారికి వ్యతిరేకంగా మీరే ఓ కూటమిని తయారు చేస్తారు. అతి ముఖ్య స్థానాలలోని వారైనా వాళ్ళు వచ్చి మిమ్ములను కలవాలిగాని మీరు వెళ్ళే సాంప్రదాయానికి స్వస్తి చెబుతారు. వేయి జన్మల స్నేహంకన్నా అప్పడిచ్చిన ధనమే పని చేస్తుందని గ్రహించి బాధపడతారు, నైతిక విలువలు మీ విషయంలో పాటించకపోవడం ఏదో ఒక ముద్ర వేయడం మీ ఆగ్రహానికి కారణం అవుతుంది. పునాదులు గట్టిగా ఉన్నాయి ఇతరులు ఏమీ చేయలేరు. ఆ విషయం ఎదుటి వర్గానికి (వ్యక్తికి) సంపూర్ణంగా తెలుసు. వ్యాపార, వృత్తి అభివృద్ధికి నూతన మార్గాలు అన్వేషిస్తారు. సమంత్రకంగా కాలభైరవరూపు ధరించండి శుభం జరుగుతుంది. మంచితనంతో కాని పని ఒక్కొక్క సందర్భంలో భయాన సాధించడం జరుగుతుంది. సంతానం గురించి మీరు చింతించవలసిన అవసరం లేదు. వాళ్ళ వల్ల ప్రతిష్ఠ పెరుగుతుంది. వ్యవసాయ రంగంలో నూతన విధానాలు సాధారణ ఫలతాలనిస్తాయి. టి.వి. చలన చిత్రరంగంలోని వారికి అనుకూలం ప్రఖ్యాతి లభిస్తుంది. అవార్డుల విషయంలో మాత్రం సంపూర్ణంగా న్యాయం జరుగదు. ఎన్నికలల్లో అనుకూల ఫలితాలు సాధిస్తారు. గట్టి పోటీని చిన్న వాళ్ళతో ఎదుర్కొంటారు.

2005 జూలై నుండి వ్యక్తిగత ప్రాధాన్యత మరింత పెరుగుతుంది. గమనించవలసిన విషయాలు నిర్లక్ష్యం చేసిన సంగతులు మీ దృష్టికి వస్తాయి. వాటిని సరిదిద్ది ఓ మార్గంలో పెట్టడం ఇబ్బందికరంగా మారుతుంది. స్థిర చరాస్థులకు సంబంధించిన విషయాలు పలుమార్లు చర్చకు వచ్చే అవకాశం ఉంది. స్త్రీలతో విరోధాలు, శుభకార్యాలకు సంబంధించిన ఒత్తిడి అధికం అవుతుంది. మీకు మీరుగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకొనడానికి - ఆలోచన చేయడానికి సమయం దొరక్కుండా ఒత్తిడి వస్తుంది. ఆగస్టు నెలలో స్త్రీలతో విరోధాలు సర్దుకుంటాయి. శుక్రమౌఢ్యమి గురుమౌఢ్యమి సంబంధించిన కాలంలో జాగ్రత్త వహించాలి. మర్మాయవాలకు సంబంధించిన చిన్న అనారోగ్య లక్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేయవద్దు. ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన అనారోగ్యం అసౌకర్యానికి దారితీస్తుంది. స్వజనులతో, ఆత్మీయులతో అవసరాలు అధికమవుతాయి. చాలా విషయాల్లో వాళ్ళ మీద ఆధారపడాల్సిన స్థితి సంభవం. నమ్మకం లేకపోయినా నమ్మినట్లుగానే నటిస్తారు. ఈ పరిస్థితి నుండి బైటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలు త్వరగా దొరకవు. మీ దరిచేరడానికి

ప్రయత్నించే ఉపయుక్తమైన మనుషులను కూడా మీ ఆత్మీయవర్గం తరిమి కొడతారు. విషయం తెలిసి కూడా ఏమీ చేయలేని స్థితి ఏర్పడుతుంది. దొంగ పిటీషన్స్ విచారణకు వస్తాయి. పత్రికలకు - మీడియాకు తప్పడు సమాచారం అందించే వాళ్ళు - మీ వర్గంలోనే ఉంటారు. మీ నిర్దోషిత్వం పదే పదే ఋజువగుతుంది. చాలా సందర్భాలలో ఏదో తెలియని అతీంద్రియశక్తి మిమ్మలను రక్షిస్తున్నట్లుగా సంఘటనలు ఋజువు పరుస్తాయి.

నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి, నాగసింధూరం ధరించండి. అవివాహితులైన వారికి వివాహకాలం సంతానంలేని వారికి సంతానప్రాప్తి సంభవం.

### స్త్రీలకు ప్రత్యేకం

రాజయోగకారకుడైన శని మంచి స్థానంలో ఉన్నాడు. మిమ్మల్ని అధిగమించిపోవడం ఇతరుల వల్ల కాదు. మీరు అనుకున్న విషయాలను సాధించుకోగలుగుతారు. ఆర్థిక స్థితి బాగుంటుంది. మంచి వాటి కొరకు ధనాన్ని వెచ్చిస్తారు. ఇష్టంలేని వ్యక్తులకు ధన సహాయం చేయకతప్పదు. మీ ఊహలు నిజం అవుతాయి. మీ సలహాలను ఉద్దేశ్యపూర్వకంగా కొందరు పట్టించుకోరు. పెరిగిన మీ స్థాయిని గుర్తించనట్లుగా నటిస్తారు. విద్యారంగంలో మంచి అభివృద్ధి కనిపిస్తుంది. ఎక్కువ మంది దృష్టి మీ సంపాదన పైనే ఉంటుంది. చర్చ కూడా సంపాదనపైనే. వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించే ఆత్మీయుల మాటలు మీకు కొండంత బలాన్నిస్తాయి. ఈ ఆత్మీయవర్గం బయటివాళ్ళేగాని ఇంట్లోవారు కారు. మీ వాళ్ళ ప్రతిష్ట కోసం ఇష్టంలేని పదవులకు పోటీచేయాల్సి రావచ్చు. కుటుంబ ప్రతిష్ట, అభివృద్ధి గురించి ఎనలేని శ్రమ చేస్తారు. మంచి ఫలితాలు సాధిస్తారు. సంతానానికి విద్యాపరంగా ఉన్నత స్థితి, విదేశీ అవకాశాలు రావడం వంటివి సంభవిస్తాయి. ప్రతి విషయాన్ని మంచి కోణంలో ఆలోచన చేసి ఫలితాలు రాబట్టాలనే మీ కొత్త ఆలోచన ఫలిస్తుంది. మనసులో ఇష్టమైన వ్యక్తులు జీవితంలో ముఖ్యులుగా మారతారు. స్థిరాస్థులు ఏర్పడతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఎప్పడూ మిమ్మలను అభిమానించే వ్యక్తి కీలక సమయంలో మీ పేరు విస్మరించడం జరుగుతుంది. కలియుగ ధర్మంలో అధర్మం సాధారణమని మీరు సరిపెట్టుకోరు. ఎత్తుకు పై ఎత్తు వేసి మీరు అనుకున్నది సాధిస్తారు. సాహిత్య సేవా రంగాల్లో కీర్తి లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు, అధికారుల వల్ల చిక్కులు రావచ్చు. వివాదాలకు, తగాదాలకు దూరంగా ప్రశాంతంగా ఉండాలని ప్రయత్నించినా అది కూడ కుదరకపోవచ్చు. సంతానంలేని వారికి సంతాన ప్రాప్తి కలుగుతుంది. విమర్శలకు భయపడకుండా స్థిరంగా ఉండండి. ఆరావళి కుంకుమతో లక్ష్మీపూజ చేయండి శుభప్రదం.

2005-2006 లో...

# వృశ్చికరాశి ఫలితములు

| ఆదాయం-14 | వ్యయం-14 | గౌరవం-3 | అగౌరవం-1 |
|---|---|---|---|

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ట 1,2,3,4 పాదముల యందు పుట్టినవారు "తో, నా, నీ, నూ, నే, నో, య, యా, యీ" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు వృశ్చికరాశికి చెందినవారు.**

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశివారు రహస్య స్వభావులు. మనసులోని విషయాలు బైటికి చెప్పరు. ఇతరుల రహస్యాలు కూడా గోప్యంగానే ఉంచుతారు. గూఢచర్యానికి, సమాచారం సేకరించడానికి విలక్షణమైన పద్ధతులు అవలంభిస్తారు. వీరి వద్ద అబద్ధాలు చెప్పడం చాలా కష్టం. ఇతరులు చెప్పే విషయాల్లో నిజానిజాలు తేలికగా గ్రహిస్తారు. భూమి, వాహన సంబంధిత, యంత్ర సామాగ్రి సంబంధిత విషయాలు కలిసి వస్తాయి. వృత్తి ఉద్యోగాలపరంగా నిజాయితీగా నడుచుకునే తత్వమే అధికంగా ఉంటుంది. చాడీలు చెప్పేవాళ్ల వలన జీవితంలో ఎక్కువగా నష్టపోతారు. సిద్ధాంతాలు రోజుకోసారి మార్చుకునే మనస్తత్వం ఉండదు. జీవితంలో ఓ మంచిస్థితికి రావడానికి ఇదే కారణం. అంతకుమించి ఎదగలేక పోవడానికీ ఇదే కారణం. మంచితనం, పట్టుదల అధికంగా ఉన్న వ్యక్తులుగా ముద్రపడతారు. వైవాహిక జీవితానికి ముందు జరిగిన కొన్ని సంఘటనలు జీవితంలో మంచికి దారి తీస్తాయి. సహోదర, సహోదరీ వర్గం ఎదుగుదలలో ముఖ్య పాత్ర వహిస్తారు. కొందరిపట్ల బాధ్యతాయుతంగా మీరు చూపించే అభిమానం ఇతరులకు ఆటంకంగా మారుతుంది. చాలామందికి మీరే ప్రథమ శత్రువు అవుతారు. బాల్యంలో జీవితశైలికి, యుక్తవయస్సులో జీవితశైలికి చాలా తేడా ఉంటుంది. ధైర్యం, సాహసంతో కూడిన నిర్ణయాలు లాభిస్తాయి. జీవితంలో మంచి

మలుపుకు కారణమవుతాయి. జరిగిన సంఘటనలను మరిచిపోరు. సమయం సందర్భం వచ్చినప్పుడు తగిన విధంగా ప్రతిస్పందిస్తారు. చాలా కాలం స్నేహం చేసిన మిత్రులతో భేదాభిప్రాయాలు వస్తాయి. దూర ప్రాంత వ్యవహారాలపై వ్యాపారంపై ఆసక్తి ఉంటుంది. కష్టపడి అనుకున్నది సాధిస్తారు. భూముల విలువ పెరగడం జీవితంలో మంచి మలుపుకు దారి తీస్తుంది. సంఘంలో మంచి పేరులేని వాళ్ళతో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. ఇది ఇబ్బందులకు దారి తీస్తుంది. ఎవరినో ఒకరిని రక్షించడానికి, కాపాడటానికి అధిక శ్రమ చేస్తారు. జీవితంలో చాలాకాలం ఈ స్థితి తప్పకపోవచ్చు. స్వజనులతో విరోధం మీ సిద్ధాంతాల కారణంగా ఏర్పడుతుంది. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి, జీవితాశయ సాధనకు ఎవ్వరి అండ లేకుండా కృషి చేస్తారు. అనుకూల ఫలితాలు సాధిస్తారు. ముఖ్యమైన సమయా లలో బంధువర్గం వల్ల లేక నమ్ముకున్న స్నేహితుల వలన ఆశించిన సహాయం అందదు. ఇందువల్ల జీవితంలో కొంత వెనుకబడటం జరుగుతుంది. సామాజిక సేవా కార్యక్రమాలలో మంచిపేరు సంతృప్తి సంభవం. ప్రజా సంబంధాలు వృత్తి ఉద్యోగాల పరంగా ఉపయోగపడ తాయి. పోలీస్ అధికారులుగా, న్యాయమూర్తులుగా, భూమి సంబంధమైన వ్యాపారాల్లోను, కట్టడాలకు సంబంధించిన విషయ వ్యాపారాల్లోనూ బాగా రాణిస్తారు. స్త్రీలతో వైరం, బంధువులతో వైరం, పరోక్ష శత్రుత్వం ఇబ్బంది కలిగిస్తుంది. గురు మౌఢ్యమి, శుక్రమౌఢ్యమి, గ్రహణాల సమయంలో జాగ్రత్తలు అవసరం. దౌర్జన్యం, లెక్క జేయకుండా మీ అభిప్రాయాలు అమలు చేయడం ఏక పక్ష నిర్ణయాలు లాభించవు. సంఘ వ్యతిరేక శక్తులతో మైత్రివల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ విషయం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచి జరుగుతుంది. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ సభ్యులతోనే అన్ని సుఖాలు పంచుకుంటే జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారికి ఈ సంవత్సరం గురుబలం బాగుంది. ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కృషికి తగిన ఫలితం లభిస్తుంది. దీర్ఘకాలిక శత్రువులు, మిత్రులు ఉన్నత స్థానాలు సాధిస్తారు. దీనిపై మీరు ఏ విధంగా స్పందించక మౌనం పాటించుట మేలు. న్యాయబద్ధంగా మీకు రావలసిన వాటికై పోరాటం లంచాలు తప్పవు. స్వల్ప ప్రయోజనాల కోసం సాహస విన్యాసాలు చేస్తారు. ధనం, పేరు సంపాదించడం కష్ట తరమని మీ వాళ్ళకు బోధిస్తారు. భవిష్యత్‌లో వాళ్ళకు రక్షా కవచంగా నిలిచే సలహాలు, క్రమశిక్షణ అమలు చేస్తారు. పోటీ ప్రపంచంలో ధనంతో పాటు తెలివి తేటలు అవసరమని బోధించి సన్నిహిత వర్గానికి దూరం అవుతారు. మీరు ఊహించిన రాజకీయ పదవులు లభిస్తాయి. మీకు సంతోషం కలుగదు. లెటర్ హెడ్ పోస్ట్‌గానే భావిస్తారు. వస్త్ర వ్యాపారంలో, ఎగుమతి దిగుమతి వ్యాపారంలో లాభాలు సాధారణంగానే ఉంటాయి. రియల్ ఎస్టేట్స్ వ్యాపారంలో సంపాదిస్తారు. సంపాదించినది నిలబెట్టుకోవడానికి అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. దినచర్య అంతా డబ్బు చుట్టూ తిరగకుండా జాగ్రత్త వహిస్తారు. ఆధ్యాత్మిక, సాంఘిక కార్యక్రమాలకు, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తారు. చాలామంది మీద మనసు విరిగిపోతుంది. వైరాగ్యం, కోసం జీవితంలో భాగం కావచ్చు. అపరిచిత వ్యక్తులకు సాయం చేస్తారు. విధిలేని వారి పరిస్థితిలో రాజకీయ వాదానికి సంబంధించిన పోటీలో దిగి స్వల్ప మెజారిటీ సాధిస్తారు. సంతాన సంబంధమైన విషయాలు ఆందోళనకరం కలిగిస్తాయి. ఉన్నదాని కన్నా మీరు ఊహించుకొనడమే అధికం. భగవతుని మీద భారం వేయండి. అన్నీ శుభాలే జరుగుతాయి. బృహస్పతి గ్రహం అనుకూలంగా బలంగా, యోగ కారణంగా ఉంది. ఈ విషయం గుర్తుంచుకోండి. ఉన్నత స్థానాలలోని వ్యక్తులు సన్నిహితులుగాని ఉపయుక్తులు కారని గ్రహించండి. సువర్ణ అవకాశాల విషయంలో భద్రత విషయంలో జాగ్రత్తలు అవసరం. విదేశీయాన ప్రయత్నాలకు సాంకేతిక పరమైన చిక్కులు సంభవించవచ్చు. ఇంటర్వ్యూలలో విజయం మీదే. కీళ్ళనొప్పులు అధికంగా బాధిస్తాయి. చెక్కులు, లేక ఇతర డాక్యుమెంట్స్ పత్రంపై తెల్ల కాగితాల మీద సంతకం చేసినట్లు చేయవలసి వస్తుంది. అందుకు సంబంధించిన ప్రతికూల కాలమును ధైర్యముగా ఎదుర్కోగలరు. కాంట్రాక్టులు లాభిస్తాయి. సమయానికి ధనం అందుతుంది. సలహాలకు తగిన విధంగా కార్యక్రమాలు జరగడం లేదని చింతించవద్దు. చట్టబద్ధంగా వచ్చే వాటి కోసం యత్నం చేయండి. మంచి జరుగుతుంది. బలవత్తరమైన శక్తుల్ని ఎదుర్కోవడానికి సామాన్య జనాన్ని, మేధావులను కూడగట్టుకునే యత్నం చేస్తారు. ఇది విజయవంతం అవుతుంది. గతంలో తీసుకున్న పొరపాటు నిర్ణయాల ఫలితాలు అమలులోకి వస్తాయి. హిత సన్నిహిత వర్గం మాటలు పెడ చెవినబెట్టి సిద్ధాంతాలు ప్రాదిపతికన పరాయి

వాళ్ళకు సేవచేసిన ఫలితాలు వ్యతిరేకంగా మారతాయి. పల్లకిలో ఊరేగించి ఆదరించాల్సిన వారు అవమానించడం జరుగుతుంది. సర్వీస్ మ్యాటర్స్, ప్రమోషన్ లిటిగేషన్స్ చాలా సమయాన్ని వృథా చేస్తాయి. శుభకార్యచర్చలు ఫలప్రదం అవుతాయి. ఆరోగ్య సూత్రాలకు సంబంధించిన వ్యాపారాలు లాభిస్తాయి. పేరు తెచ్చి పెడతారు.

ఆర్థికంగా స్థితిని అభివృద్ధి చేసే యత్నాలు ప్రారంభిస్తారు. బ్యాంక్‌లో రుణాలు సంపాదించే యత్నాలు ముమ్మరం చేస్తారు. సాహిత్య కళారంగాలకు సంబంధించిన అనేకమంది పరిచయం అవుతారు. వారు మీకు సన్నిహితం అయ్యారని పొరపాటుపడతారు. జీవితంలో భయపడే సంఘటనలు ఎదురైనా మీ భావాలు మారవు. చలనచిత్ర రంగంలో అవకాశాలు వస్తాయి. అనుకున్న వాటిని ఏదోరకంగా సాధిస్తారు. పట్టుదల, అంతర్గత ప్రతికార వాంఛ, పోటీతత్వం ఎక్కువగా ఉంటుంది. మీరు అభిమానించి ఆదరించిన వ్యక్తి మీ నుండి దూరం కావడం దుష్ప్రచారం చేయడం సంభవం. దుబారా ఖర్చును అరికట్టి పొదుపుపై ఎక్కువ దృష్టి సారిస్తారు. కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉండి కుటుంబంలోని వారికి ఉన్నత విద్యా వ్యవహారాలు కలిసివస్తాయి. గృహంలో క్రమశిక్షణ కొరకు కఠినమైన నిర్ణయాలు చేస్తారు. ఎలక్ట్రానిక్ సామాగ్రి, విలువైన వస్తువులు బహుమతిగా పొందే అవకాశం ఉంది. ప్రభుత్వపరంగా, సామాజికపరంగా, సంస్థలపరంగా అవార్డులు - రివార్డులు వస్తాయి. స్థిరాస్తుల విషయంలో మీ మనోవాంఛ నెరవేరుతుంది. సౌకర్యవంతమైన, అధునాతన వస్తు సామాగ్రి సొంతం అవుతుంది. వీలునామాలు, నూతన అగ్రిమెంట్స్, పూర్తిగా మీకు అనుకూలంగా కాకపోయినా, న్యాయబద్ధంగా చట్ట నిబద్దతగా ఉంటాయి. ప్రింటింగ్, కంప్యూటర్ వర్క్‌లు, ఇతర కాంట్రాక్టర్‌లు, జాబ్ కాంట్రాక్టర్‌లు కొంతమేరకు లాభించే అవకాశం ఉంది. మీ కృషి, శ్రమ ఫలితాల రూపంలో కనిపిస్తుంది. ఆరోగ్యం మందగించవచ్చు. నిర్మాణ సంబంధమైన పనులు దగ్గరుండి పూర్తిచేస్తారు. నిర్మాణ పనులలో ఎటువంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ చేస్తారు. విద్యా సంబంధమైన విషయాలు, క్రీడలకు సంబంధించిన విషయాలు మీకు అనుకూలంగా ఉంటాయి.

అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి, నాగసింధూరం ధరించండి. కాలభైరవ రూపు ధరించండి శుభప్రదం.

## స్త్రీలకు ప్రత్యేకం

ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. విలువైన వస్తు సామాగ్రి, ఆభరణాలు కలిసి వస్తాయి. అధికారం మత్తులో ఉన్న వాళ్ళ ఉచ్చు నుండి బైటపడతారు. స్వంత ప్రతిభతో రాణిస్తారు. శ్రమించిన దానికి తగిన ప్రతిఫలం పోరాడి రాబట్టుకుంటారు. వ్యతిరేకమైన ఆలోచనా విధానాన్ని అదుపుచేసుకొనడానికి శ్రమించాలి. ఇతరుల బలహీనతలను గూర్చి విమర్శల దాడిచేసే ముందు మీ వాళ్ళ విషయం పరిశీలించండి. స్వదేశంలోనే దూరప్రాంత విద్యాభ్యాసానికి అవకాశం వస్తుంది. పోటీ పరీక్షలలో నెగ్గుతారు. ఇతరుల సహాయం కన్నా స్వశక్తి దైవానుగ్రహమే మిన్నయని గౌరవంగా మసులుకుంటారు. ఇతరుల సహాయాన్ని అర్థించరు. ఆత్మగౌరవం నిలబెట్టుకోవడానికి రక్తబంధువులను సైతం చిన్న సహాయం అడగడానికి వెనుకాడతారు. మీలో వచ్చిన ఈ మార్పు స్పష్టంగానే అందరికీ అర్థమవుతుంది. భూముల విషయంలో లాభపడతారు. మీకు తెలియకుండానే కొన్ని అమ్మకాలు జరిగిపోతాయి. వాటికి చట్ట నిబద్ధత ఉండదు. సాంకేతిక విద్యలో చక్కగా రాణిస్తారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది. స్వయంగా తీసుకునే నిర్ణయాలే పెను దుమారాన్ని సృష్టిస్తాయి. మీ నిర్ణయాలను మార్చుకోవాలని వత్తిడి పెరుగుతుంది. సహోదర సహోదరీ వర్గంతో స్వల్ప ఘర్షణలు మనసును బాధిస్తాయి. సెంటిమెంట్స్ వైపే మనసు మొగ్గుతుంది. పెద్దల ఆరోగ్య విషయంలో ముందు జాగ్రత్తలు మంచికి దారితీస్తాయి. పెద్దవాళ్ళ ఆరోగ్య స్థితికి మీ భవిష్యత్‌కు అవినాభావ సంబంధం స్పష్టంగా తెలుస్తుంది. నూతన అవకాశాలు వస్తాయి. అయితే కొంతకాలం వాయిదా వేయాల్సిన స్థితి సంభవం. ఉద్యోగంలో ప్రమోషన్స్, స్థానచలనం సంభవిస్తాయి. వ్యాపారంలో, ఉద్యోగ పరంగా, వృత్తిపరంగా రొటేషన్ పెరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలవల్ల స్వల్పంగా నష్టపోతారు. అవివాహితులకు వివాహకాలంగా చెప్పదగిన సంవత్సరము. గురుమౌఢ్యమి కాలములో జాగ్రత్తలు వహించాలి. ఆరావళి కుంకుమతో లక్ష్మీపూజ చేయండి శుభప్రదం.

2005-2006 లో...

# ధనుస్సురాశి ఫలితములు

| ఆదాయం-2 | వ్యయం-8 | గౌరవం-6 | అగౌరవం-1 |
| --- | --- | --- | --- |

మూల 1,2,3,4 పా॥లు, పూర్వాషాఢ 1,2,3,4 పా॥లు, ఉత్తరాషాఢ 1వ పాదముల యందు పుట్టినవారు "యే, యో, బా, బి, భూ, ధా, భా, డ, భే" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు ధనుస్సురాశికి చెందినవారు .

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశి వారికి స్వయం ప్రతిపత్తి, ఆత్మ గౌరవం. ఎక్కువ స్వంత విషయాలు ఇతరులకు అవసరమైన మేరకే తెలియజేస్తారు. ఇతరుల జోక్యం స్వంత విషయాల్లో అంతగా అనుమతించరు. క్రమశిక్షణ, విద్యారంగం పట్ల ఆసక్తి, ఆధునిక విద్య, వినూత్న వ్యాపారాల్లో శ్రద్ధ, రాణింపు ఉంటాయి. సంఘంలో మంచి పేరు ప్రతిష్టలు కలిగియుంటారు. ఉన్నత స్థానాలను మేధస్సుతో సాధిస్తారు. దైవ భక్తి, మంత్ర సంబంధమైన అనుష్టానాది క్రతువుల యందు శ్రద్ధ కలిగి యుంటారు. పెద్దల యందు వినయవిధేయతలు కలిగి ఉండడం బాధ్యతగా భావిస్తారు. అంతరాత్మ సాక్షికి విరుద్ధంగా ఏ పనీ చేయలేరు. న్యాయం, ధర్మం, సహధర్మం ఇవన్నీ పరిగణన లోకి తీసుకుంటారు. అవకాశం ఉండి కూడా స్వంత వాళ్ళకు సహాయం చేయలేదనే నిందలు మోయాల్సి వస్తుంది. ఆత్మీయుల ప్రతిభాపాటవాలు సాధించాలని కోరుకుంటారు. వాళ్ళు ఆశించిన స్థాయిలో పరిజ్ఞానం సాధించరు. వాళ్ళను ఏ విధంగా అందలం ఎక్కించాలో తెలియక ఇబ్బందిపడతారు. ఉన్నత స్థానంలో ఉండి కూడా అయిన వాళ్ళకు ఏమి చేయలేకపోయామన్న భావన కలుగుతుంది. సమాజానికి, ధర్మానికి భయపడి అడ్డగోలుగా సహాయం చేయలేరు. స్వంత వర్గానికి చెందిన వ్యక్తులతోనే బద్ధవైరం ఏర్పడుతుంది. ఆర్థికంగా మిమ్ములను అధిగమించి ప్రత్యర్థి వర్గం కాలు దువ్వుతారు. ధనం ఒక్కటే గాదు జీవితం అంటే సాధించాల్సినవి చాలా ఉంటాయి అనే భావనతో మీరు ఉంటారు. డబ్బు సంపాదించడం చేతగాక ఇలా మాట్లాడుతున్నారని వైరివర్గం నిందలువేస్తారు. ఎవరికైనా, ఏ రంగంలోని వారికైనా మీరే ఆదర్శంగా ఉండాలని వాళ్ళే మిమ్ములను అనుసరించాలని మీరు కోరుకుంటారు. మీతో మంచిగా ఉండి కావల్సినవి సాధించుకున్నవారు. మీ వ్యక్తిత్వం గురించి వ్యతిరేకంగా మాట్లాడడం జరుగుతుంది. ఇది మీరు సహించలేని విషయం. దాన ధర్మాలు అధికంగానే జేస్తారు. మీకు అందే సహాయ సహకారాలు కూడా గొప్పగానే ఉంటాయి. పేరు ప్రతిష్టలకు వృత్తిలో రాణింపుకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. డబ్బు కోసం తాపత్రయపడరు. ధనమే మీ చుట్టూ తిరగాలని కోరుకుంటారు. స్త్రీ, పురుష విచక్షణ లేకుండా సంతానం ఆనందించబడేలా చూస్తారు. జ్యేష్ట సంతానం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరపడవచ్చు. కష్టాలలో ఉన్న సొంతవాళ్ళను రక్షించే ప్రయత్నం చేయరు. ఇతరులకు మంచి సలహాలు నిజాయితీగా చెబుతారు. ఆ సలహాలు పాటించమని ఒత్తిడి చేయరు. వాళ్ళ విచాక్షణకే వదిలేస్తారు. ఏ విషయంలోనూ అతి జోక్యం ఉండదు. మీ మాటను ధిక్కరించిన వారిని జీవితాంతం శత్రువులుగానే చూస్తారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయ బంధువర్గం వలన పరువు ప్రతిష్టలకు ఇబ్బంది ఏర్పడుతుంది. స్వంత వాళ్ళు స్థాయి మరచి ప్రవర్తించడం ఇతరుల ముందు తగాదాలు, నోరుపారేసుకోవడం వంటి పనులు చేసి ఇబ్బంది కలిగించవచ్చు. స్వజనులు కొందరు చాలా కాలం సిద్ధాంతాల కారణంగా దూరంగా ఉండిపోతారు. మీ నైతిక బాధ్యతల్ని సక్రమంగా నెరవేరుస్తారు. సహోదర సహోదరీ వర్గానికి చేసే సహాయం విపరీతార్థాలకు దారితీస్తుంది. ఎవరు ఏమనుకున్నా ధనస్సురాశి వారి పద్ధతుల్లో మార్పురాదు. అనుకున్న సిద్ధాంతాల కోసమే బతుకుతారు. సమాజంలో ఎందరికో జీవనం కల్పిస్తారు. అధికార పదవులకు ఎంపికవుతారు. వీరి మేధస్సు, చేస్తున్న పనులు, ఉపన్యాసాలు పుస్తకాలు ఎందరికో ఆదర్శం అవుతాయి. తను ఆశించిన స్థాయిలో వారసుడిని తయారు చేయాలన్న కోరిక నెరవేరదు. దాదాపు అందరికీ మంచి అవుతారు. మంచి చేస్తారు. స్వంత వాళ్ళకే మంచి కారు. మంచి చేసే అవకాశం లభించదు. కుజ, రవి, రాహు, గురు దశలు యోగిస్తాయి. శుక్రదశ కాలంలో జీవిత భాగస్వామితో విభేదాలు కొందరికి సంప్రాప్తిస్తాయి. విష్ణ

గ్రహణ దోష శాంతి చేయునపుడు సాధారణ సంకల్పానికి దోష పరిహార సంకల్పం అనుసంధానం చేయవలెను.

సహస్రనామపారాయణ మేలు చేస్తుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారికి ఈ సంవత్సరము చాలాబాగుంది. ప్రతిష్ఠ పెరుగుతుంది. ఆస్థులు కొనుగోలుచేస్తారు. ఉన్నత అధికార స్థానాలకు ప్రయత్నిస్తే ఎంపికయ్యే అవకాశం ఉంది. విద్యా, వ్యాపార రంగాల్లో రాణిస్తారు. వృత్తి ఉద్యోగాల స్థానం చాలా బాగుంది. బాగా ప్రఖ్యాతి గడిస్తారు. దశమ స్థానంలో గురువు, అష్టమ సప్తమ స్థానాలలో శని, చతుర్థ స్థానంలో రాహువు ప్రధాన ఫలితాలను నిర్దేశిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. ఆర్థిక పరమైన సమస్యలు కొంతవరకు తీరుతాయి. తలపెట్టిన పనులు పూర్తి చేయడానికి నిర్వి రామంగా కృషి చేస్తారు. విధుల నిర్వహణల్లో, వ్యాపారంలోగాని కొంత మేరకు మార్పులు రావచ్చు. ఉద్యోగం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటి పనులలో, గృహ స్థిరాస్తి, విషయాలలో, కుటుంబ వ్యవహారాలలో ఒక నిర్ణయానికి వస్తారు. కుటుంబంలో మరొకరి సంపాదన అభివృద్ధికి కొండంత అండగా నిలుస్తుంది. సమాజంలో మీ పేరు, ప్రతిష్ఠలు నిలకడగా వుంటాయి. ఆర్థికంగా అభివృద్ధి సాధించి స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. విద్యపరంగా, ఉద్యోగపరంగా మీరు విదేశాలకు వెళ్లాలనే ప్రయత్నాలు ఫలిస్తాయి. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పేరు, ప్రఖ్యాతులు సంపాదిస్తారు. కొన్ని కారణాలవల్ల ఆప్తులు, మిత్రులు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. కుటుంబంలో ఒకరి ఆరోగ్య విషయ ములో ఆందోళన వుంటుంది. సంతాన విషయములలో కొద్దిపాటి క్రమశిక్షణ అవసరం. విద్యారంగములో మీ సంతానము చేసే కృషి ఫలిస్తుంది. ఉద్యోగములో ప్రమోషన్‌లు రావచ్చు.

ఈ రాశి విద్యార్థినీ, విద్యార్థులు సాంకేతిక విద్యలలో కొద్దిపాటి జాగ్రత్త అవసరం. పడే కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. కొన్ని కొన్ని విషయాలలో నిదానమే ప్రధానము అన్న సూక్తి ఫలిస్తుంది. ఎవరిపట్ల మీకు ఆప్యాయత, అనురాగం ఉన్నాయో వారివల్ల మీకు సంతోషం కలుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలలో ఎక్కువగా ఆసక్తి పెరుగుతుంది. మీరెంతగా శ్రమించనప్పటికి ఓ వర్గము వారు మీ శ్రమకు తగిన గుర్తింపునివ్వరు. వారితో వాదనకన్నా మౌనంగా ఉండటం ఉత్తమము. అవివాహితుల స్త్రీలకు వివాహ కాలంగా చెప్పవచ్చును. సాంస్కృతిక, క్రీడ, సామాజిక రంగాల్లో మంచి గుర్తింపు సాధిస్తారు. సమాజంలో మంచి గుర్తింపు ఉన్నతాధికారంలో వున్నవారు మీకు తప్పక సహాయం చేయగలరు. రాజకీయాల్లో కొంతమేరకు పలుకుబడిని సాధించి చిన్న అధికార స్థానాలకు ప్రయత్నించిన ఫలించే అవకాశం వున్నది. అన్ని బాధలు మౌనంగా భరిస్తూ సంఘంలో మీకు ఉన్న స్థానాన్ని నిలబెట్టుకుంటారు. స్పెక్యులేషన్ ద్వారా మీరు పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి పొందగల్గుతారు. ముఖ్య డాక్యుమెంట్లు, కాగితములు అజాగ్రత్త వలన కనిపించకపోవచ్చు. (దొంగతనానికి గురికావచ్చు).

వృత్తి, ఉద్యోగం, సంస్థ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా, ఆర్థికంగా నిలద్రొక్కుకోవ డానికి, గుడ్‌విల్ పెంచుకోడానికి, వివాదాస్పద వ్యక్తులను దూరంగా వుంచి కార్యనిర్వహణకు సామర్థ్యము కలిగిన వారిని చేర్చుకుంటారు. విదేశాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వ్యాపారంలో రొటేషన్ సంతృప్తికరంగా ఉంటుంది. ఆర్థికంగా పెట్టుబడి మదుపు చేసిన వ్యవహారాలు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితిలో కొంతమేరకు మార్పు వస్తుంది. మధ్యవర్తిగా ఉండి ఇప్పించిన ఋణాలు ఇబ్బందిగా మారతాయి. ఇతరులకు జవాబు చెప్పవలసిన స్థితి సంభవం. రాజకీయ, విద్యా, వైద్య, అపార్ట్‌మెంట్స్, కాంట్రాక్టులు, ప్రింటింగ్ మొదలైన వ్యాపార రంగాలలో కొంత అనుకూల స్థితి గోచరిస్తుంది. సాంస్కృతిక, క్రీడా రంగాలలో పాల్గొని బహుమతులు పొందగల్గుతారు. జీవన గమనంలో వినూత్నమైన మంచి మార్పులు వస్తాయి. గృహప్రవేశం, వివాహం మొదలైన శుభకార్యాలు పూర్తి చేస్తారు. స్థిరాస్తులను ఏర్పరుచుకుంటారు. వివాహం కాని వారికి వివాహ కాలంగా చెప్పవచ్చు. విద్యారంగములలో, ఉద్యోగంలో ప్రమోషన్‌ల కొరకు మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రణాళిక రూపకల్పనలో ఇతరుల సలహాలు నచ్చితే అమలు చేయండి. సలహాలు ఇతరులు చెప్పలేని పరిస్థితి మాత్రం కల్పించవద్దు. అది మీకే నష్టం కోర్టు. బయట వివాదాస్పదమైన అంశాలు సుఖాంతం అవుతాయి.

భవిష్యత్తులో ఉపయోగపడే స్థలం వ్యాపారం నిమిత్తం కొనుగోలు చేస్తారు. ఆరోగ్య విషయంలో కొద్దిపాటి జాగ్రత్తలు అవసరం. మీరు అనుకున్నది, ఆశించినది, ఆశపడి కృషి చేసినది నిజంగా "మీదే" అవుతుంది. మీ సంతాన విషయంలో జాగ్రత్త అవసరం. సంతానం అభివృద్ధి చెందడం వల్ల సంతోషం, అదనపు బరువు బాధ్యతలు ఖర్చులు తప్పవు. సంతాన పురోభివృద్ధి వల్ల కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి.

ని   త్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి ఎల్లప్పడు మంచి జరుగుతుంది. లక్ష్మీ తామర వత్తులతో, సిద్ధ గంధంలో లక్ష్మీదేవీని పూజించడం సర్వదా విశేషం. వ్యాపార సంస్థల్లో, గృహంలో అష్టమూలికా గుగ్గిలం పొగవేయడం శ్రేయస్కరం!

### స్త్రీలకు ప్రత్యేకం

వ్యాపార, రాజకీయ, ఉద్యోగ సంబంధమైన విషయాలు అభివృద్ధి చెందుతాయి. పెద్దగా ప్రాధాన్యతలేని విషయాలు, ప్రముఖులు కాని ప్రముఖులు చికాకులకు గురిచేస్తారు. ఎవరి నుండి అయితే అభయహస్తం ఆశించారో, ఎవరు కష్టకాలంలో వెన్నుదన్నుగా ఉంటారనుకుని మీరు భావించారో వాళ్లవల్ల కాస్త మేలు కూడా జరుగదు. ప్రతి విషయంలోనూ మీ శ్రమ మీకు తప్పదు. ప్రతి విషయాన్ని వివాదం చేయాలని, శతృత్వం వహించేవాళ్లే మీ చుట్టూ ఉంటారు. చాలా సందర్భాలలో మొండి ధైర్యమే మిమ్మల్ని కాపాడుతుంది. అందరినీ కలుపుకునిపోవాలని మీరు భావించినా ఆచరణలో అది సాధ్యపడదు. నిప్పను చూసిన క్రూర జంతువు నిలబడినట్లుగా శత్రువర్గం మీ నైపుణ్యాన్ని, అధికారాన్ని చూసి నిస్సహాయులుగా నిలబడతారు. అష్టమ స్థానంలో నున్న శనికి శాంతి జరిపించడం మంచిది. విద్యా, వైజ్ఞానిక, రంగాల్లోను పోటీ పరీక్షలలోను సాంకేతిక ఇబ్బందులు ఎదురుకావచ్చు. అయితే విజయప్రాప్తి-అనుకూల ఫలితాలు వస్తాయి. నమ్మించి మోసం చేయాలనుకునే వారిని మీరు నమ్మరు. అధికార సాధనలో, ఉద్యోగపరంగా ఉన్నతి సాధించడంలో గ్రహస్థితి అనుకూలంగా ఉంది. వీసా, విదేశీ విద్య లాభిస్తాయి. మీకు అందవలసిన సమాచారాన్ని సకాలంలో అందించక ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బందుల పాలు చేస్తారు. మీ సర్టిఫికేట్స్, డాక్యుమెంట్స్ వంటివి ఉద్దేశ్యపూర్వకంగా సొంతవాళ్లే దొంగతనం చేస్తారు. ఇది ఇతరులకు చెప్పి సహాయం అర్థించే విషయంకాదు. మీకు మీరుగా జాగ్రత్తలు వహించండి. సంవత్సరం రెండవ భాగం చాలా బాగుంటుంది. అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. మీడియాపరంగా ప్రశంసలు, ప్రభుత్వపరంగా అవార్డులు లభిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నిజమైన స్వామిజీలు, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థానాలలోనున్న వాళ్ళు సన్నిహితం అవుతారు. సుందరమైన పలు ప్రదేశాలు ఆర్థిక భారం లేకుండా సందర్శించే అవకాశం కలుగుతుంది. ఆరావళి కుంకుమతో లక్ష్మీపూజ చేయండి శుభప్రదం.

2005-2006 లో...

# మకరరాశి ఫలితములు

| ఆదాయం-5 | వ్యయం-2 | గౌరవం-2 | అగౌరవం-4 |
|---|---|---|---|

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదముల యందు పుట్టినవారు "బో, జా, జీ, జూ, జే, ఖా, గా, గీ" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు మకరరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశి కాల పురుషుడి కర్మ స్థానం చాలా ముఖ్యమైనది. రాశిలో సూర్య భగవానుడు ప్రవేశించినప్పడు ఉత్తరాయణ పుణ్యకాలం వస్తుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణం మకరరాశిలోనిదే.

ఈ రాశివారు జీవితంలో ఎదురయ్యే సంఘటనల ఆధారంగా అపార అనుభవాన్ని మేథస్సును సొంతం చేసుకుంటారు. ఎక్కువగా వింటారు. అదే విధంగా మాట్లాడతారు. మంచి మాటకారితనం ఉంటుంది. ఎదుటి వాళ్ళు మోసం చేయనంత వరకూ ఇతరులను మోసం చేద్దామన్న ఆలోచనే రాదు. బంధుప్రీతి, స్నేహితుల ఎడల అవ్యాజమైన అనుబంధం వీరి లక్షణం, బలహీనత కూడా. పక్కవాళ్ల మాటలు విని వాస్తవాలు తెలుసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటారు. ఇది విమర్శలకు దారితీస్తుంది. తన లోపం ఏమిటో తెలుసుకున్నాక చేసిన పొరపాటును తిరిగిచేయరు. తన తప్పను అంగీకరించడానికి వెనుకాడరు. అందరిని సమభావంతో ప్రేమగానే చూస్తారు. తాను ద్వేషించే వ్యక్తులను అభిమానించే వారిని కూడా శత్రువులుగానే చూస్తారు.

ఇందువల్ల వ్యక్తిగత ప్రయోజనాలు, సంబంధాలు దెబ్బ తింటాయి. అయినా పద్ధతి మార్చుకోరు. సాత్విక స్వభావం, మాట మీద నిలబడే తత్వం ఉంటుంది. స్త్రీ సంతానం పట్ల ప్రత్యేకమైన అభిమానం ఉంటుంది. సంతానం వాళ్ల అభిష్టం మేరకు నడుచుకొనక కొన్ని సందర్భాలలో ఇబ్బందులకు గురి చేస్తారు. నైతిక బాధ్యతలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. నమ్మినవాళ్ల కోసం పరిశ్రమిస్తారు. చిన్నతనం నుండి ఎక్కువగా శ్రమపడి ఉన్నతమైన ఆశయాలు చిన్నతనంలోనే ఏర్పరుచుకొని అవి సాధించడానికి కృషి చేస్తారు.

అనుకున్న వాటిని ఏదో రకంగా సాధిస్తారు. పట్టుదల అంతర్గత ప్రతికార వాంఛ. పోటీతత్వం ఎక్కువగా ఉంటుంది. సాధారణమైన శరీర సౌష్టవం. అమితమైన జ్ఞాపక శక్తి ఉంటుంది. రచనా, వ్యాసములు, పుస్తక రచన, పరిశోధన, నటన, కళా సంబంధమైన వృత్తి, ఉద్యోగాలలో విశేషమైన నిపుణత ఉంటుంది. అంటే వీళ్ళు చేసే ఏ పనికీ ఇతరులు ప్రత్యామ్నాయం అని చెప్పలేని విధంగా ఉంటుంది. అయితే వీళ్ల మేధస్సు, ఆలోచనలు శ్రమ ఎక్కువ కాలం దోచుకోబడతాయి. లేక వెలుగులోకి రాకపోవడం జరుగుతుంది. ధనం సాధనే ధ్యేయంగా జీవించరు. ధనం ఏదో రూపంలో సర్దుబాటు అయి అవసరాలు గడుస్తాయి. అభిమానించే ప్రజానీకం నమ్మిన అనుచర వర్గం ఉంటారు. కుల, మత, వర్గాలకు అతీతంగా వారి ప్రవర్తన ఉంటుంది. స్త్రీల వలన అదృష్టం కలిసి వస్తుంది. దాంపత్య జీవితంలో టీ కప్పులో తుఫాను వంటి సంఘటనలు ఏర్పడుతాయి. అంతకు మించి వీరికి ఇబ్బంది కలగదు. చాలా మందికి తండ్రి వల్ల మేలు జరుగదు. జీవితంలో ఉన్నత స్థితికి ప్రజాభిమానమే కారణం అవుతుంది. దైవానుగ్రహం కలిగిన వ్యక్తులుగా చెప్పవచ్చు. బంధువర్గం కన్నా బయటివారి సహాయ సహకారాలు బాగా అందివస్తాయి. ఊహలు నిజం అవుతాయి. అంచనాలు వేయడంలో పొరపాట్లు దాదాపుగా జరగవు. శని దశ, శుక్ర దశ, బుధ దశ యోగవంతమైనది ఆధ్యాత్మిక విషయాల్లో అంకిత భావం ఉంటుంది. సమాజ సేవ, సామాజిక న్యాయాన్ని దైవంతో సమానంగా భావిస్తారు. జీవిత మధ్య కాలంలో మోకాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు వంటివి ఇబ్బంది పెడతాయి. ప్రధాన సంబంధాల ఆధారంగా వృద్ధి చెందే వృత్తి, వ్యాపార విషయాలు కలిసి వస్తాయి. ఆధ్యాత్మి కంగా, రాజకీయంగా ఉన్నత స్థితి సాధించినవారు ఎందరో మకరరాశిలో జన్మించారు.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారికి ఈ సంవత్సరం అనుకూలంగా ఉంది. అందరి ఆదరణ పొందుతారు. అందరితో మన మనిషి అనిపించుకుంటారు. మీ వల్ల చాలామంది లబ్ధిపొందుతారు. సంతానం స్థిరత్వం సాధిస్తారు. నూతన వస్తువాహనాలు కొనుగోలు చేస్తారు. ప్రతిష్ఠ పెరుగు తుంది. ఋణాలు తీర్చడం ఒక్కసారిగా సాధ్యం కాదు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. నూతన వ్యాపార ప్రారంభం లాభాలు సూచిస్తున్నాయి. అబద్ధాలు చెప్పి లబ్ధి పొందాలనుకునే వర్గాన్ని దూరంగా ఉంచండి. గతంలో చేసిన తప్పలు, ఒప్పలు పరిశీలించి సక్రమమైన నిర్ణయాలు తీసుకుంటారు. మూడవ స్థానంలోకి రాహువు రావడం వల్ల ధైర్యంతో నిర్ణయాలు చేస్తారు. లెక్కచేయని మనిషిగా ఉంటారు. గతంలో ఉపేక్షించిన వారిని గట్టిగా మందలించ లేని వారిని ఈసారి అదుపులో పెట్టగలరు. చాలా సందర్భములలో మీ నిర్ణయాలు సరియైన వని కాలం నిరూపిస్తుంది. విద్యా, సాంస్కృతిక, సాంకేతిక విద్య సంబంధిత విషయాలు అనుకూలిస్తాయి. కుటుంబంలో ఆత్మీయుల మధ్య విభేదాలు, అపార్థాలు చోటు చేసుకోవచ్చు. కొన్ని వ్యాపారాల్లో పెట్టుబడికి ముప్ప రావచ్చు జాగ్రత్త వహించండి. ఉద్యోగపరంగా మీకు అనుకూలమైన ప్రదేశానికి బదలీ లేక ప్రయోజనాలకు గండికొడుతున్న వ్యక్తులకు బదలీ సంభవం. నూతన భాగస్వాములు, స్నేహితులు అన్ని విషయాల్లో అండగా ఉండి మీకు మరింత బలం చేకూరుస్తారు. కష్టకాలం పోయి మంచి రోజులు వచ్చినట్లుగా అనిపి స్తుంది. అధికారులతో పరోక్ష అభిప్రాయ భేదాలు మనసుకు బాధ కలిగిస్తాయి. నిర్మాణపు ఖర్చులు రెట్టింపు అవుతాయి. విద్యావకాశాలకు

ప్రారంభంలో ఆటంకాలు ఏర్పడినా చివరకు అనుకూల ఫలితాలు సాధిస్తారు. దశమ స్థానంలో రవి గ్రహ సంచార కాలం (నవంబరు) జాగ్రత్తలు వహించాలి. ముఖ్య నిర్ణయాలు వద్దు. స్త్రీలకు సంబంధించి వివాదాస్పద అంశాలు పరిష్కరించి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటారు. మాటతప్పే మనుషుల వల్ల ఇబ్బంది పడతారు. మీరు కూడా ఇచ్చిన వాగ్దానం నెరవేర్చుకొనడానికి చాలా శ్రమించాల్సి వస్తుంది.

యోగ్యతకు, స్నేహానికి, కులానికి వీటిల్లో దేనికి ప్రాధాన్యత నివ్వాలో నిర్ణయించు కొనడం కష్టమవుతుంది. మంచి చేసి విరోధం అయ్యే పరిస్థితులు సంభవం. బంధువులతో సంబంధ బాంధవ్యాలు విధి విధానంగా ఉండేలా చూసుకోండి. భవిష్యత్ మిమ్ములను తప్ప బట్టే విధంగా ఏ రకమైన అవకాశం ఇవ్వద్దు. విశేషించి బంధువర్గం వియ్యాలవారు ఇచ్చిన చనువును ఉపయోగించుకోవద్దు. భవిష్యత్తుకు వాళ్ళు వేస్తున్న ఎరగానే భావించండి. గనులు భూములు లీజు వ్యవహారాలన్నీ స్వంత వ్యక్తులు లేక స్వయంగా మీరు వీక్షించడం మేలు. ఇల్లు, షాపులు బాడుగల వ్యవహారం వివాదాస్పదమవుతుంది. అందుచేత ప్రతి విషయంలోను వ్యవహార జ్ఞానం ఉన్నవాళ్ళనే పనులకు పురమాయించండి. వివాహాది శుభ కార్యాల విషయాలపై చర్చలు ముగిస్తారు. సెప్టెంబరులోగా విదేశీయానం సంభవించవచ్చు. అష్టమూలికా గుగ్గిలంతో గృహంలోగాని, వ్యాపార స్థలంలోని ధూపం వేయండి. శుభప్రదం ఇన్సూరెన్స్లు, కోల్డ్ స్టోరేజ్, గోడన్లు, క్రెడిట్ కార్డులు, వీసా పాస్‌పోర్టుల విషయాల్లోను ప్రయాణాల్లోను తగు జాగ్రత్తలు పరిశీలనలు అవసరము.

ఆర్థిక పరిస్థితి కొంతమేరకు బాగుంటుంది. వ్యాపారంలో రొటేషన్ అంతంత మాత్రంగా ఉన్నా లాభాలు కొంత మేరకు బాగుంటాయి. ఉద్యోగం వంటి కీలకమైన అంశాలు అనుకూలంగా వుంటాయి. ఉద్యోగం చేస్తున్న వారు కొంత ప్రాధాన్యత గల సీటులోకి రావడం సంభవం. మీకు మేలు జరిగే పత్రాలు మొదలైనవి ఆలస్యంగా ముఖ్య అధికారుల పరిశీలనకు వస్తాయి. వృధా అయిన సమయాన్ని సాంకేతికంగా సరి చేసుకోగల్గుతారు. విదేశీయానం, విద్యావకాశాలలో కొన్ని ఆటంకాలు ఏర్పడిన తదుపరి విజయపథంలో నడుస్తుంది. మీ ఆంతరంగికులుగా చెలామణి అవుతున్న వారు శత్రు వర్గానికి రహస్యాలు చేరవేస్తారని గ్రహించండి. జాగ్రత్త అవసరం. టాక్స్లు చెల్లించవలసిన దానికన్నా అధికంగా చెల్లించవల్సి వస్తుంది. మరమ్మత్తుల ఖర్చు నిర్మాణపు ఖర్చులతో సమానం అవుతాయి. కుటుంబ పురోగతి బాగుంటుంది. మంచి అవకాశాలు మీ వాళ్లకు వస్తాయి. భూములు, గృహసంబంధిత, వాహన సంబంధిత వ్యవహారాలు వివాదాస్పదం కాకుండా జాగ్రత్త అవసరం. ఏమైనప్పటికీ ఫలితం మీకే అనుకూలంగా ఉంటుంది. అవివాహితులకు వివాహ కాలంగా చెప్పవచ్చు. కోర్టు వ్యవహారాలలో కొంతమేరకు విజయం సాధించగల్గుతారు. ఆరోగ్య విషయాల్లో కొద్దిపాటి జాగ్రత్తలు పాటించండి. సంతాన విషయంలో పురోగతి ఉంటుంది. విద్యార్థినీ, విద్యార్థులు పోటీ పరీక్షల కొరకు అధిక సమయం కేటాయించవల్సి వస్తుంది. శాస్త్రీయ విద్యలను అభ్యసిస్తారు. విసుగు విరామం లేకుండా మానసిక శ్రమ అధికం అవుతుంది. అన్నిరకాల పరీక్షలలో విజయం సాధిస్తారు. సంప్రదాయ సూత్రాలను ఇంట్లో ప్రవేశపెడతారు.
నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. నాగసింధూరం ధరించండి. అధిదేవత కాల భైరవుని సమంత్రకంగా పూజించి కాలభైరవ రూపును ధరించండి. చాలా మంచిది

## స్త్రీలకు ప్రత్యేకం

భాగ్యస్థానంలో ఉన్న గురుగ్రహంవల్ల, సప్తమ స్థానంలో ఉన్న శని వల్ల ప్రతిష్ట, గౌరవం, ప్రజా సంబంధాలు వృద్ధి చెందుతాయి. బంధువర్గానికి, స్నేహితులకు సహాయ సహకారాలు అందిస్తారు, ఆదుకుంటారు. ఆపద సమయంలో మిమ్ములను ఆదుకున్న వార్కి తగిన విధంగా ఋణం తీర్చుకుంటారు. సంతానం విషయంలో కొంత అసంతృప్తి కలుగుతుంది. వాళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. నిదానంగా మంచి ఫలితాలు వస్తాయి. మీ పేరు మీద నూతనంగా స్థిరాస్థులు ఏర్పడతాయి. వివాహాది శుభకార్యాల విషయంలో మీ మాట నెగ్గించుకుంటారు. వివాదాలు సృష్టించే వ్యక్తులను వదిలించు కుంటారు. ఆత్మీయుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ, ఖర్చు తప్పకపోవచ్చు. వ్యతిరేక ప్రచారం మనస్తాపానికి కారణమవుతుంది. చేయవలసిన మేలు, మంచి చేసి, నోటి దురుసువల్ల ఇతరుల అభిమానాన్ని పోగొట్టుకుంటారు. మాట సంయమనం పాటించండి. దూర ప్రాంత నివాసానికి అవకాశాలు కలిసివస్తాయి. సంతాన పురోగతి బాగుంటుంది. మధ్యలో ఒడిదుడుకులు వచ్చినా ఎట్టకేలకు విజయం సాధిస్తారు. వివాహ విషయంలో ఇతరుల అభిప్రాయంతో మీరు ఏకీభవించరు. అందరూ ద్వేషించే ఓ వ్యక్తిని రక్షించడానికి మీ సామర్థ్యాన్ని ఉపయోగిస్తారు. చాలా సందర్భాలలో ఇతరుల అభిప్రాయంతో మీరు విభేదిస్తారు.

సమిష్టి ప్రయోజనాలకు ఇబ్బందిరాకుండా ఐకమత్యం ప్రదర్శిస్తారు. విలువైన బహుమతులు గెలుచుకుని ప్రఖ్యాతి తెచ్చుకుంటారు. గొప్పవాళ్ల దృష్టిలో మంచిగా ముద్రపడతారు. 2005 మే నుండి ఉన్నత స్థానాలను అధిరోహించే విధంగానే గ్రహస్థితి నడుస్తుంది. ఉద్యోగంలో అధికారం దర్పం పెరుగుతుంది. అవివాహితులకు వివాహకాలంగా చెప్పతగిన సంవత్సరము. ఆరావళి కుంకుమతో ధనలక్ష్మీదేవి పూజ చేయండి శుభప్రదం.

❁

2005-2006 లో...

# కుంభరాశి ఫలితములు

| ఆదాయం-5 | వ్యయం-2 | గౌరవం-5 | అగౌరవం-4 |
|---|---|---|---|

ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదముల యందు పుట్టినవారు "గు, గే, గో, సా, సీ, సు, సే, సో, దా" అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు కుంభరాశికి చెందినవారు.

## ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశిలో జన్మించినవారికి బంధాలు, అనుబంధాలు ఎక్కువగా ఉంటాయి. వ్యక్తులను వాళ్ళు చేసిన మేలును గుర్తుంచుకుంటారు. కొత్తగా ఎందరు పరిచయమయినా పాత వర్గాన్ని, బాల్య స్నేహాలను బంధుత్వాలను మరిచిపోరు. ఫైవ్‌స్టార్ హోటల్ భోజనం కన్నా ఇంట్లో భోజనమే మేలని భావిస్తారు. క్రమశిక్షణ, అలవాట్లలో మార్పు తెచ్చుకొని నూతన విజయాల కోసం ప్రయత్నిస్తారు. మార్పు తెచ్చుకున్నా అలవాట్లు, క్రమశిక్షణ ఎక్కువకాలం నిలబడని విధంగా పరిస్థితులు మారతాయి. ఇతరులు రెచ్చగొడితే రెచ్చిపోయే బలహీనత, ఆవేశం కొన్ని ఇబ్బందులకు దారి తీస్తుంది. బాధను దిగమింగుకునే వ్యక్తులుగానే ఉంటారు. తమ బాధలు, బాధ్యతలు ఎక్కువగా ఇతరులకు చెప్పి విసిగించరు. ఉన్న విషయం స్పష్టంగా చెప్పడం వల్ల విరోధాలు వస్తాయి. ఆ విధానాన్ని మార్చుకోవాలని ప్రయత్నిస్తారు గాని మార్చుకోలేరు. మధ్యవర్తిత్వానికి ముందు నిలుస్తారు. ఇతరులకు హామీదారులుగా ఉండి చిక్కులు తెచ్చుకుంటారు. సాంకేతిక విద్య, వైద్య విద్య, ప్రజా సంబంధాలు, చిత్రవిచిత్ర వ్యాపారాలలో అనుభవం, నేర్పు కలిగి ఉంటారు. కుటుంబ విషయాలు సఫలమై ఒడిదుడుకు లకు లోనయినా అన్నీ సర్దుకుంటాయి. ప్రయత్నించినప్పడు ధనం లభించడం అనుమానమే. సాధారణ ప్రయత్నంతో ధనం వస్తుంది. అవసరం లేనప్పడు మరీ అధికంగా ధనం చేకూరు తుంది. స్వంతవాళ్ళు, ఆత్మీయవర్గం అవసరాలకు మాత్రం ఇబ్బందిపడకుండా ఏదో విధంగా ధనం సర్దుబాటు చేస్తారు. వాళ్ల అభివృద్ధికి పునాదులు వేస్తారు. సంఘంలో ఉన్నత స్థానా లలోనున్న వారివల్ల, గౌరవ స్థానాలలో ఉన్నవారి వల్ల అన్యాయం జరుగుతుంది. ఇతరుల పక్షపాత నిర్ణయాలకు నష్టపోవాల్సిన స్థితి ఏర్పడుతుంది. రాజకీయంగా ఆకస్మిక రాణింపు ఉంటుంది. అధికారం, ముద్రాధికారం చేకూరుతుంది. ఫిబ్రవరి, జూన్, అక్టోబరు నెలలు సాధారణంగా బాగుంటాయి. శుక్రమహర్దశ, బుధ మహర్దశ, శని మహర్దశ బాగుంటాయి. పొరపాటు నిర్ణయాలు, ఏకపక్ష నిర్ణయాలు ఇబ్బందులకు దారితీస్తాయి. చర్చించి ముఖ్య నిర్ణయాలు చేయడం వల్ల మేలు జరుగుతుంది. సంఘంలో మంచి పేరు లేని వాళ్లను పక్కనబెట్టుకోని వాళ్లకు తగినంత గౌరవం ఇచ్చి సమాజంలో, బంధువర్గంలో విమర్శల పాలవుతారు.

సొంతవాళ్ళు, సంతానం, ఆత్మీయవర్గం చేసే తప్పలు తప్పలుగా కనిపించవు. ఇతరులను సమర్థించడానికి, రక్షించడానికి అధిక ధన వ్యయం, పలుకుబడి ఉపయోగిస్తారు. వ్యాపారంలో అంచనాలు నిజం అవుతాయి, మంచి లాభాలు, పేరు సంపాదిస్తారు. సక్రమంగా సాగిపోతున్న వ్యవహారాల్లో నూతన ప్రయోగాలు

చేసి ఇబ్బందులు కొనితెచ్చుకుంటారు. భూమి సంబంధిత వ్యాపార వ్యవహారాలు కలసివస్తాయి. ఆస్థి విలువ పెరగడమే ధనవంతులు కావడానికి కారణం అవుతుంది. వ్యాపార కూడలి ప్రదేశాలు అద్దెకు ఇచ్చి అదృష్టాన్ని జారవిడుచుకుంటారు. సంతానం వల్ల కుటుంబ ప్రతిష్ట పెరుగుదల ఎలా ఉన్నా వాళ్ల స్థితి మాత్రం బాగుంటుంది. వాళ్ల మనస్తత్వం, పద్ధతులు ఏ విధంగా ఉన్నా అదృష్టం కలసి వస్తుంది. స్త్రీ సంతానం పట్ల విశేషమైన మమకారం ఉంటుంది. జీవిత ప్రారంభంలో తెలిసీ తెలియక చేసిన నిర్ణయాలు, పనులు మంచిగా మలుపు తిరుగుతాయి. చిన్నపాటి వ్యక్తుల కూటమిని బలోపేతం చేస్తారు. జీవితంలో ఘన విజయాలు సాధిస్తారు. అసమర్థులను జాలిపడి అందలం ఎక్కిస్తారు. ఆ అసమర్థులే అఖండులై మీకు బలమైన ప్రత్యర్థులుగా తయారవుతారు. పోటీ లేనిచోట కూడా మీ మంచితనం వల్ల పోటీ దారుల్ని మీరే కొని తెచ్చుకుంటారు. ఇతరుల ఎత్తులను చాలా తేలికగా చిత్తు చేయబడిన శక్తి ఉంటుంది. స్వయం కృతాపరాధాలను మాత్రం సరిదిద్దుకోలేరు. సొమ్ము, పదవి, ప్రయోజనాలు కొన్ని సందర్భా లలో మీరు కోల్పోయినా ఇతరులు మీ వల్లనే వాటిని పొందారన్న పేరు సమాజంలో వినిపిస్తుంది. హస్తవాసి మంచిదని అందరూ మెచ్చుకుంటారు. ఫిబ్రవరి, అక్టోబరు నెలల్లో ప్రారంభించే వ్యాపార, వ్యవహారాలు బాగుంటాయి. భాగస్వామ్యంలో కొంతకాలం మాత్రమే లాభపడతారు. ప్రకృతి సంబంధమైన వైపరీత్యాల వల్ల కొంత కష్టకాలం ఎదుర్కొంటారు. సహోదర, సహోదరీ వర్గం బాధ్యతలు, బాధలు మోయాల్సివస్తుంది. ఇందువల్ల మరొక ఆత్మీయ వర్గం దూరమవుతారు. పై అధికారులవల్ల క్రిందిస్థాయి సిబ్బందివల్ల ఏక కాలంలో సమస్యలు వస్తాయి. ఋణాలకు సంబంధించిన విషయాల్లో అసత్య ప్రచారాలు చోటు చేసుకుంటాయి. కోర్టు వ్యవహారాలలో నెగ్గుతారు. ఆత్మీయవర్గం ద్రోహం చేస్తే తప్ప ఏ విషయంలోను ఓటమి ఉండదు.

వృత్తి ఉద్యోగాలపరంగా, ఆధ్యాత్మికంగా అనేక రంగాలలో అనుభవం సాధిస్తారు. మనుషుల మనస్తత్వం తెలుసుకొనడంలో విజయం సాధిస్తారు. ఎవరు ఏ సందర్భంలో ఏ విధంగా ప్రవర్తిస్తారో చక్కగా అంచనా వేయగలరు. మీ కంటే వెనుక వచ్చిన వాళ్ళు మిమ్ములను దాటి ముందుకుపోయినా వాళ్ళకన్నా ఆధిక్యాన్ని దీర్ఘ కాలంలో సాధించగలుగుతారు. పెద్దలు స్థిరాస్థులు కొన్ని పోగొట్టినా స్వయం శక్తితో తిరిగి సాధించుకోగలుగుతారు. జీవితంలో పరాయి వాళ్ల వలన ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడగలరు. శత్రు వర్గంపై మీరే విజయం సాధిస్తారు. పగవాళ్ల వలన ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తారు. ఎటొచ్చీ స్వంత వాళ్ళవలన ఎదురయ్యే సమస్యల విషయంలోనే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పడమర, దక్షిణం, ఉత్తరం దిశలు అనుకూలము. కుంభరాశి వార్కి ఏ దిక్కు దోష ప్రదం కాదు. కుబేర కంకణ ధారణ వల్ల ఆర్థిక, వృత్తిపరమైన స్థిరత్వం కలుగుతుంది. ఇష్ట దేవతారాధనను మించినది లేదు. కాలభైరవ స్తోత్రము పఠించడం విజయానికి, అదృష్టానికి దగ్గరగా గ్రహస్థితి నడిచే అవకాశం చాలా వరకు ఉంటుంది.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారికి ఈ సంవత్సరం అన్ని విధాలుగా కాకపోయినా ప్రధానమైన విషయాలు బాగున్నాయి. ద్వితీయంలో రాహువు అష్టమంలో గురువు, ఆరింట శని ప్రధాన ఫలితాలను నిర్దేశిస్తున్నాయి. జీవితంలో కొన్ని ముఖ్యమైన అనుకూల ఫలితాలను సాధిస్తారు. ఆర్థికంగా పరిస్థితి బలపడుతుంది. చేతిలో ధనం ఉండకపోవచ్చు. పెట్టుబడి రూపంలో ఉండిపోతుంది. ఆరింట శని అష్టమ గురువు ఉపయోగకారకాలు కాదు. విలువైన వస్తువుల్ని ప్రోది చేసుకో గలుగుతారు. స్థిరాస్థుల కొనుగోలు చేస్తారు. ఉన్న స్థిరాస్థుల విలువ పెరుగుతుంది. నమ్మకద్రోహులు అడుగడుగునా ఎదురవుతారు. వీళ్ళు స్నేహితుల్లోను, బంధువుల్లోను, ఆత్మీయవర్గంలోను అదే అనే ఆలోచన వద్దు. మీ సేవ ఉపయోగించుకుంటారు. సేవ చేయడం తప్పు కాదు. ప్రయోజనాలను పగవాళ్లకు చేరకుండా జాగ్రత్తపడండి. విదేశీ వ్యవహారాలు అనుకూలిస్తాయి. విద్య ఉద్యోగ అవకాశాలు దూర ప్రాంతంలో మీరు కోరుకున్న విధంగా లభిస్తాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. అధికార పదవులకు ఎన్నికవుతారు. మీరు

నిర్వహిస్తున్న బాధ్యతలు. పదవులపై న్యాయపరమైన వివాదాలు చెలరేగుతాయి. అవి ఇబ్బంది పెట్టే స్థాయిలో ఉండవు. భూగర్భ సంపదలు లాభిస్తాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నిదానం అవసరం. ఇతరులతో నష్టం కలిగించే పోటీలు వద్దు. ఇతరులు రెచ్చగొట్టే యత్నాలు చేసినా మీరు ఓర్పు వహించి వ్యాపార, ఉద్యోగాలను పదిల పరుచు కోండి. వ్యాపార విస్తరణ బాగుంటుంది. రొటేషన్ బాగుంటుంది. ఫలితాలు లాభాలు సంపూర్ణంగా మీ చేతికి వచ్చేలా జాగ్రత్త వహించండి. టాక్సులు వసూలు చేయు అధికారుల వల్ల ఇబ్బందులు వచ్చిన ఎదుర్కొని మీపై చేయిని చాటుకుంటారు. మార్పులేని, మార్పురాని వ్యక్తులను మార్చే ప్రయత్నాలు మానండి. సొంత వ్యక్తులు పొరపాటు నిర్ణయాలు తీసుకొని నష్టపోతున్నా, అగ్నిప్రవేశం చేస్తున్నా మీరు నిస్సహాయులుగా ఉండిపోతారు.

అవివాహితులైన వారికి ఇది వివాహ నిశ్చయ కాలం. సంతానం లేని వారికి తప్పకుండా సంతాన ప్రాప్తికి అవకాశం కలిగే విధంగా గ్రహస్థితి బలంగా ఉంది. గర్భస్థ శిశు రక్షణ ముఖ్యమని గ్రహించండి. వైరల్ ఫీవర్స్, కుటుంబ కలహాలు ఏక కాలంలో ఇబ్బందిపెడతాయి. ఒకనాటి మిత్రులతో బహిరంగ వైరము పోరాటము అనివార్యము గోచరిస్తుంది. విద్యారంగంలో కుటుంబం అభివృద్ధి సాధిస్తుంది. సాహిత్య, కళా రంగాల్లో మంచి ఖ్యాతి లభిస్తుంది. మీకు మీరుగా మీ వాళ్లను ఏ రంగంలోను నిరుత్సాహపరచవద్దు. జల క్రీడలు మాత్రం వద్దు. అందుకు మీ ఆధ్వర్యం కూడా వద్దు. ఉద్యోగపరంగా స్థానచలనం పుకార్లు పుకార్లుగానే మిగిలిపోతాయి. ఆందోళనపడవలసిన పనిలేదు. సమంత్రకంగా ఇంద్రాణీ ముద్ర ధరించండి. అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. కోర్టు తీర్పులు అనుకూలంగా వస్తాయి. జీవితంలో మంచి మలుపుకు ఇది ఒక కారణమవుతుంది. కొన్నింటి పై మీ అధికారం యావజ్జీవితం ఉంటుంది. దాన్ని సద్వినియోగం చేసుకునే ఆలోచనలు చేస్తారు. వ్యాపారాల్లో విస్తరణావకాశాలు, నూతనోత్సాహం గురించి. ఎక్కువగా శ్రద్ధ వహిస్తారు. నిపుణులతో చర్చిస్తారు. కొత్త ఋణాలు అభివృద్ధికి సోపానాలు అవుతాయి. ఈ విషయంలో మీరు ఆందోళన చెందవద్దు. నిత్యం నాగసింధూరం ధరించండి. రుద్ర కవచం ధరించడం వల్ల మేలు జరిగే అవకాశం స్పష్టంగా ఉంది. గురు-శుక్ర మౌఢ్యమి కాలములను జాగ్రత్తగా పరిగణనలోకి తీసుకొని ఆ సమయంలో జాగ్రత్తలు పాటించండి. ఈ సంవత్సరం ప్రధాన రంగాలలో అభివృద్ధి సాధిస్తారు. వ్యవసాయదారులకు కూడా మంచి ఫలితాలు సూచిస్తున్నాయి. గతం కంటే ప్రస్తుతం మేలు. ప్రస్తుతం కంటే భవిష్యత్ మరింత మేలు అన్నట్లుగా కాలం దొర్లుతుంది.

పైశాచిక మనస్తత్వం, జాలి, దయలేని వ్యక్తులతో నిష్కారణ విరోధం ఏర్పడుతుంది. ఏదో విధంగా మిమ్ములను ఇబ్బందుల పాలు చేయాలనే ఏకైక లక్ష్యంతో ఓ వ్యక్తి చేస్తున్న కృషికి కొందరు పరోక్షంగా వంత పలుకుతారు. మీరు తెగించి చర్య తీసుకొనడానికి అనుకూల వాతావరణం లభించదు. జూలై 2005 తదుపరి దెబ్బకు దెబ్బ తీయ గలుగుతారు. మీ ప్రయోజనాల్ని కొంత మేరకు రక్షించుకుంటారు. ఆదరించగూడని వ్యక్తులను ఆదరించి - వాళ్లతోనే విరోధం ఏర్పడి - పోరాడి అలసిపోతారు. తన, మన తేడా లేకుండా ఉపయోగం లేని వాళ్లందరికీ ఉద్వాసన చెబుతారు. కుటుంబ చరిత్ర గొప్పదైనంత మాత్రాన ఆ కుటుంబంలోని వాళ్లందరూ గొప్పవాళ్లు కాకపోవచ్చనే ఈ కఠినమైన సత్యాన్ని మీరు గ్రహిస్తారు. మీ మాటలతో సున్నిత మనస్కులైన వారు బాధపడి వేరుపడతారు. మీరు ఎవరిని అనాలనుకున్నారో వాళ్లనే నిందించండి. సామూహిక ప్రకటన వల్ల మీరు నష్టపోయే అవకాశం ఉంది. అది మీకే ఉపయోగం ఆర్థికంగా నిలద్రొక్కుకోవ డానికి అక్టోబరులో ప్రారంభించే నూతన వ్యాపార భాగస్వామ్యం కలసివస్తుంది. అధికారుల సహాయ సహకారాలు అక్టోబరులో కలిసివస్తాయి. విస్తరణ కూడా ఫలప్రదం అవుతుంది. పొదుపు యత్నాలు పెద్దగా ఫలించవు. వస్తు జాగ్రత్త అవసరం. ఇన్సూరెన్స్ మొదలైన వాటిపై దృష్టి సారించండి. మితిమీరిన మీ సేవకుల ఆత్మవిశ్వాసం వల్ల చట్టపరమైన చిక్కులు రావచ్చు. అన్ని విషయాలు పరిశీలించడం - తెలుసుకోవడం మేలు. ముత్యాలు, రత్నాలు, దేవతా సంబంధిత వస్తు సామాగ్రి వ్యాపారం బాగా కలసివస్తుంది. ఆధ్యాత్మిక విశ్వాసాలు, మత సంబంధిత విశ్వాసాలు మనోబలాన్ని చేకూర్చుతాయి. మీకు లభించవలసిన స్థానం మరొకరికి దక్కినట్లుగా వచ్చిన వార్తలు మనసును తాత్కాలికంగా ఆందోళనకు

గురిచేస్తాయి. ప్రకృతి నిర్దయ వల్ల కొంత నిరాశ ఎదురవుతుంది. నిజాయితీకి ప్రతిఫలం ప్రశ్నార్థకం అవుతుంది. ఇష్టంలేకపోయినా ప్రయోజనాల కొరకు మీరు కొన్నిమార్గాలలో నడిచే అవకాశం ఉంది. శ్రమించని వాళ్ళకు గొప్ప ఫలితలు దక్కడం అందలాలు ఎక్కడం, గౌరవ ప్రతిష్టలు కీర్తి కిరీటాలు ఏ విధంగా పుట్టుకొస్తున్నాయో గ్రహించి ఆశ్చర్యపోతారు. మీరు ఇన్నాళ్ళూ కాపాడుకున్న ఉన్నతికి, నిజాయితీకి సంబరపడతారు.

### స్త్రీలకు ప్రత్యేకం

ఈ సంవత్సరం చాలా బాగుండి అనేక విషయాలకు సంబంధించి సమాజం పోకడ, మనుషుల మనస్తత్వం తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అందమైన మనుషుల మదిలో దాగిన క్రూర మనస్తత్వం ఆశ్చర్యం, భయం కలిగిస్తాయి. చాలా విషయాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఆర్థికంగా మంచిస్థితి సాధిస్తారు. వివాదంలో ఉన్న ధనం, ఆస్థి చేతికి వస్తుంది. నూతన గృహప్రాప్తి. విలావసవంతమైన వస్తువుల్ని కొనుగోలు చేస్తారు. ఆదాయానికి తగిన పొదుపు మాత్రం ఉండదు. రాజకీయ అధికారానికి దగ్గరగా గ్రహస్థితి నడుస్తుంది. ప్రాథమికంగా నమ్మకద్రోహానికి గురవుతారు. మనుషుల్ని గుడ్డిగా నమ్మడం మీదే పొరపాటు. నిందలు పడతారు. కొనుగోలు, అమ్మకాలు లాభిస్తాయి. ఆగిపోయిన అమ్మకం మీకు లాభంగా మారుతుంది. సంతానానికి సంబంధించిన విషయాల్లో దిగులు తీరుతుంది. శుభకార్యాది విషయాలు ఓ కొలిక్కి వస్తాయి. భేదాభిప్రాయాలు పోవడానికి మీరు చేసే కృషి, పూజలు ఫలిస్తాయి. సామాజిక అంశాలు, చట్టపరమైన విషయాలవల్ల కొన్ని ప్రయోజనాలకు భంగం కలుగవచ్చు. వృత్తిలో అభివృద్ధి, ఉద్యోగంలో స్థానచలనం సంభవం. వస్తు భద్రత గురించి జాగ్రత్తలు అవసరం, ఇన్సూరెన్స్ బ్యాంకు లాకర్స్ వంటివి ఉపయోగించుకొనడం శ్రేయస్కరం. మీ ఆశయ సాధనకు సంబంధించి అవసరమైన సాధనా సంపత్తిని చాలా వరకు సమకూర్చుకుంటారు. కొన్ని మంచి అవకాశాలను దూర ప్రయోజనాల దృష్ట్యా, కుటుంబ పరిస్థితులవల్ల వదులుకుంటారు. మీరు అభిమానించి ప్రేమించే వ్యక్తులు వ్యసనాలు మానుకుంటారు. క్రమశిక్షణ కలిగి వుంటారు. సంవత్సర ద్వితీయార్థంలో స్త్రీల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆరోపణలు, నిందలు, ఆకాశరామన్న ఉత్తరాలు, టెలిఫోన్ కాల్స్ వంటివి ఎక్కడ నుండి ఎందుకు వచ్చాయో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థికంగా సంకట స్థితి కూడా అప్పడే ఏర్పడుతుంది. మీ వల్ల సహాయ సహకారాలు పొందిన వాళ్ళు ఇంట్లో ఉండి లేరని చెప్పిస్తారు. ఇతరులపై అతి నమ్మకం మంచిదికాదని గ్రహిస్తారు. ఆరావళి కుంకుమతో లక్ష్మీదేవికి పూజ చేయండి. మంచి ఫలితాలు కలుగుతాయి.

20052006 లో...

## మీనరాశి ఫలితములు

ఆదాయం-2 వ్యయం-8 | గౌరవం-1 అగౌరవం-7

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదముల యందు పుట్టినవారు “ది,దు,శ్యం,ఝా,దా,దే,దో, చా,చి” అను అక్షరములు తమ పేరునకు మొదట గలవారు మీనరాశికి చెందినవారు.

### ఈ రాశిలో జన్మించినవారి సాధారణ లక్షణాలు-ఫలితాలు

ఈ రాశిలో జన్మించినవారు ప్రశాంత మనస్కులై ఉంటారు. కోపం తొందరగారాదు. ఎప్పడో ఒకసారి విపరీతమైన కోపం వస్తుంది. వృత్తి ఉద్యోగాలు స్వయంగా ఏర్పరుచుకోగల సామర్థ్యం ఉంటుంది. స్థిరత్వం కోసం కష్టపడతారు. వృత్తి ఉద్యోగాలలో ఒడిదుడుకులు తరచుగా ఎదురవుతుంటాయి. ఆదరించి అండగా నిలిచే వాళ్ళు ఉంటారు. ఎన్ని సమస్యలు ఉన్నా ప్రశాంతంగా నిద్రపోగలరు నీళ్ళు ఎక్కువగా తీసుకుంటారు. స్నానాభిలాషులు, బంధువర్గం ఉన్నత స్థానాలలో ఉంటారు. వాళ్ళ సహాయ సహకారాలు నామమాత్రం. బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. విద్యారంగంలో రాణింపు ఆరోగ్యస్థితిపై ఆధారపడి ఉంటుంది. కళాసాహిత్య రంగాలలో మంచి ఆసక్తి, నిపుణత ఉంటుంది. అనువంశిక ఆస్తులను వృద్ధిచేయగల తెలివి తేటలు ఉంటాయి. ఆస్తులు దక్కడం అనుమానస్పదం. బంధువర్గం తండ్రిని మోసగించి ఆర్థికంగా నష్టపరుస్తారు. వ్యక్తిగత సంపాదన, జీవిత భాగస్వామి అదృష్టం తోడయి, మంచితనంతో ఆస్తి, ధనం సంపాదిస్తారు. మంచి ఆశయం కోసం మంచి వాళ్ళ సాంగత్యం కొరకు, భాగస్వామ్యం కొరకు ఎదురు చూస్తారు. ఇలాంటి ప్రయత్నాలు ఫలించి ఐకమత్యంతో మంచి ఫలితాలు సాధిస్తారు. మరింత మంచి ఫలితాలు సాధించే సమయంలో విభేదాలు, సత్ ప్రవర్తన లేని వ్యక్తుల జోక్యం వల్ల ఆశయసాధనకు విఘాతం కలుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలు, ఆచార వ్యవహారాలు, వేదాంత, తత్వ సంబంధిత, జ్యోతిష,

వాస్తు, హోమియోపతి, గణితం మొదలైన వాటిల్లో ప్రావీణ్యత కలిగి ఉంటారు. సంగీతాభిమానులు, క్రీడాభిమానులు. ఈ అభిమానం జీవితంలో ముఖ్యమైన మలుపులకు దారితీస్తుంది. ఇతరుల మాయమాటల ప్రభావం చాలా కాలం వీరి మీద పని చేస్తుంది. తనకంటూ సొంత శైలి అవసరమని ఆలస్యంగా గ్రహిస్తారు. భూమి, కట్టడాలు, జల సంబంధిత వ్యాపారాలు కలిసివస్తాయి. స్వయం పర్యవేక్షణ లేక ఇతరుల మీద పూర్తిగా బాధ్యతలు వదిలివేయడం వల్ల కొన్ని అనుభవాలు నేర్చుకుంటారు. మంచితనం, కుటుంబ, వంశగౌరవం చాలా సందర్భాలలో ఆదుకుంటుంది. ఎవరో అద్భుతాలు సాధించి ఉద్ధరిస్తారని ప్రోత్సహిస్తారు. అవి ఫలించవు మీరే కష్టపడి సాధిస్తారు. అంటే సామర్థ్యం లేని వ్యక్తులను ప్రోత్సహించడం ద్వారా, కార్య నష్టం, సమయం వృధాకావడం జరుగుతుంది. ఎవరిని ఏ పనికి వినియోగించాలో బేరీజు వేయడంలో చాలాసార్లు పొరబడతారు. విదేశాలకు సంబంధిం చిన అంశాలు, అన్యభాషలకు సంబంధించిన అంశాలు ముఖ్య సమయంలో కలసి వస్తాయి. ధనవంతులైన స్నేహితవర్గం మధ్య మధ్యలో సహాయపడతారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సభా కార్యక్రమాల నిర్వహణలో మంచి పేరు లభిస్తుంది. సంతానం మంచి స్థాయిని సాధిస్తారు. జీవితంలో అందరు నిలబడతారు. గురు, శుక్ర, శని దశలు బాగుగా యోగిస్తాయి. ప్రకృతికి, సహజత్వానికి దగ్గిరగా జీవితం గడపాలన్న ఆశయం నెరవేరుతుంది. ప్రచార సాధనాలు, మీడియాతో ముఖ్య విషయాలు ముడిబడి ఉంటాయి. స్వజనులు, బంధువర్గం లేక కులవర్గానికి చెందిన ఓ వ్యక్తి వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. నిష్కారణ శతృత్వం ఏర్పడుతుంది. మనుషుల మనోభావాల్ని స్పష్టంగా చదవగలరు. ధనం లేకపోయినా దర్జాగా జీవిస్తారు. విలాసవంతమైన జీవితం గడుపుతారు. మీతో ఉన్న అవసరాలే స్నేహానికి, బంధువర్గానికి కారణం అవుతాయి. మీతో అవసరాలు తీరిన తర్వాత కూడా స్నేహ బాంధవ్యాలు నిలబడతాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఆశించిన గుర్తింపు మాత్రం లభించక పోవచ్చు. ప్రతిసారీ ఏదో ఒక కారణం వల్ల రావలసిన ప్రయోజనాలు వాయిదా పడతాయి. ఇతరుల పద్ధతులే మీకు తప్పని పరిస్థితిలో ఆదర్శం అవుతాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు, ఆర్థిక స్థిరత్వం వృత్తి స్థిరత్వం పోరాటం ద్వారా సాధించు కుంటారు. ఎక్కువ ఆశలు లేకపోవడం కొన్ని విషయాలపై మాత్రమే దృష్టి సారించడం మీ విజయానికి మానసిక ప్రశాంతతకు దారి తీస్తుంది. వివాద రహితమైన వ్యక్తులగా ఉండాలని భావిస్తారు. వివాదాలు, గొడవలు మనస్పర్థలు ఇతరులతో సొంతవాళ్ల వలన ఏర్పడతాయి. జీవితంలో సాధించే విజయాలకు ప్రధానంగా దైవానుగ్రహమేనని నమ్ముతారు. సుదర్శ కవచ పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ నిత్య జీవితంలో ఓ భాగం చేయడం చెప్పదగిన సూచన. సువర్ణ ఆభరణాలు, సెంటిమెంట్ వస్తువులు, భూములు ఎట్టి పరిస్థితిలోను తనఖా పెట్టవద్దు. భద్రత విషయంలోను జాగ్రత్త వహించండి. కాస్త ఆలస్యమైనా అదృష్ట దేవత అనుగ్రహం పొందుతారు.

## 2005-2006 సంవత్సర ఫలితములు

ఈ రాశివారికి ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలు సూచిస్తున్నాయి. సామాజికంగా, రాజకీయంగా మంచి స్థితి సాధిస్తారు. సప్తమ స్థానంలో గురువు, పంచమ, చతుర్థ స్థానాలలో శని లగ్నంలో రాహువు ప్రధాన ఫలితాలను నిర్దేశిస్తున్నాయి. విద్యాపరంగా మీ ఆలోచనా విధానం సత్ఫలితాలనిస్తుంది. కుటుంబ సభ్యులు, మిత్రుల ప్రోత్సాహము, మంచి అనుకూలమైన వాతావరణము మీరు అనేక విషయాలలో విజయము సాధించడానికి కారణము అవుతుంది. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. స్థిరాస్తుల కొనుగోలుకు యత్నములు చేస్తారు. మార్కెటింగ్, పబ్లిసిటీ మొదలగు వాటిపై దృష్టిని సారిస్తారు. విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించడానికి, ఉద్యోగం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రభుత్వపరమైన, ఉత్తర్వులు కాంట్రాక్టులు మీ అంచనా మేరకు ఫలిస్తాయి. గతంలో మీరు కొనుగోలు చేసిన స్థిరాస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది. క్రెడిట్ కార్డులు, బ్యాంకు వ్యవహారాలు, పొదుపు డిపాజిట్లు తదితర వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండటం మంచిది. బంధుమిత్రుల నుండి శుభవార్తలు వింటారు. ఇంటిలో ఒక శుభకార్యం జరుగుతుంది. సహోదర, సహోదరీ వర్గములవారు కొన్ని విషయములలో తమ సహాయ, సహకారాలను అందించడంతో కొంత ఊరట చెందుతారు. తల్లిదండ్రుల ఆరోగ్య విషయముల్లో కొంత ఆందోళన ఏర్పడవచ్చును. కోర్టులకు సంబంధించిన విషయాలు మీకు కొంతమేరకు అనుకూలంగా వుంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో మొక్కుబడిగా కాక పూర్తి భక్తిశ్రద్ధలతో పాల్గొంటారు. దీక్షా కార్యక్రమాల వలన మనసుకు కొంత

ఆనందంతో ఉంటుంది. మీ పిల్లల విద్య విషయమై దృష్టిని కేంద్రీకరిస్తారు. మీ పిల్లల విద్య విషయములలో ధనాన్ని ఎక్కువగా ఖర్చు చేయవలసి ఉంటుంది. కాళ్లకు, పాదములకు సంబంధించిన స్వల్ప ఇబ్బందులు రావచ్చు.

గతంలో సగంలో ఆగిపోయిన నిర్మాణ కార్యక్రమాలను, కాంట్రాక్టు వ్యవహారాలను త్వరితంగా పూర్తి చేస్తారు. విద్యార్థిని, విద్యార్థులకు ఈ సంవత్సరం అనుకూలం ఉంటుంది. సాంస్కృతిక, కళా, క్రీడా రంగాలలో రాణిస్తారు. కరస్పాండెన్స్‌లో జాగ్రత్తలు పాటించడం మంచిది. హాజరును నిర్లక్ష్యం చేయొద్దు. మీ ఆలోచనలకు మంచి రూపకల్పన చేసిన వాటికి ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది. స్పెక్యులేషన్, ఎగుమతి-దిగుమతికి సంబంధించిన వ్యవహారాలలో కొంత మెలకువ అవసరం. స్నేహితులతో, అభిరుచిగల వ్యక్తులతో ప్రయాణములు మనసుకు కొంత ఆనందాన్ని ఇస్తాయి. ఉన్నతాధికారులలోను, రాజకీయ నాయకులలోను మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారు. మీ శత్రువర్గం మీపై కొంత దుష్ప్రచారం చేయడం, లేనిపోని నిందలు వేయడం చేస్తారు. అన్ని విషయములను నిబ్బరముగా ఎదుర్కొనుట ఎంతో మంచిది. కుటుంబంలో మీరు అనుకున్న మంచి మార్పులు జరుగుతాయి. దూరపు వ్యక్తులు మీకు సన్నిహితులు అవుతారు. ఉద్యోగస్థులు అదనపు బాధ్యతలు పెరుగుతాయి. ఇతరులను తప్పిదములకు గురిచేసి మీ బాధ్యతను నిర్వహించవలసి ఉంటుంది. పరువు, ప్రతిష్ఠల కొరకు లాభము ఆశించకుండా సేవా దృక్పథంలో కష్టమైన పనులు చేస్తారు. సంఘంలో పేరు ప్రఖ్యాతులు కలిగిన వ్యక్తుల అండదండలు మీకు లభిస్తాయి. వివాహము కాని వారికి వివాహ కాలముగా చెప్పవచ్చు. సంతానములేనివారికి సంతానయోగము. సంతాన విషయములలో కొంతమేరకు జాగ్రత్త అవసరం. నిత్యం అష్టమూలికా తైలంతో దీపారాధన దైవానుగ్రహానికి గొప్ప సాధన. నాగసింధూరం ధరించడం చాలామంచిది.

ఆర్థిక పరిస్థితి కొంతమేరకు బాగుంటుంది. వ్యాపారంలో లాభాలు గతంలోకంటే బావుంటాయి. ఉద్యోగంలో బదిలీలు ఏర్పడవచ్చు. జూలై 2005లోపు ఉద్యోగంలో బాధ్యతలు అధికమవుతాయి. పరపతి పెరుగుతుంది. మీకు రావలసిన ధనం, బిల్లులు, వడ్డీలు మీ చేతికి వస్తాయి. విదేశీయత్నాలు అనుకోకుండా అనుకూలిస్తాయి. విదేశాలలోనివారు మీకు సహాయం చేస్తారు. వీసా లభిస్తుంది. మీ మీద వచ్చిన ఆరోపణలు, నిందలు నిజం కావని కల్పితాలు అని రుజువు అవుతాయి. శుభకార్యాలు నిర్వహిస్తారు. శుభకార్యాలలో బంధువర్గ సహాయంకన్నా దైవమే ఎక్కువ మేలు చేస్తాడు.మారిన రాజకీయ పోకడలు సంతోషాన్ని కలిగిస్తాయి. మీ శత్రువర్గ పోకడలను త్రిప్పికొడతారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్, ఈతకొట్టే సమయంలో జాగ్రత్త అవసరం. ముఖ్యమైన నిర్ణయాలు, సంతకాలు, ప్రకటనలు నిపుణుల సహాయ సహకారాలతో చేయండి. దైవ సంబంధమైన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆరోగ్య విషయాలలో కొంతమేరకు జాగ్రత్త అవసరం. కుటుంబ పరిస్థితి బాగుంటుంది. ఆధునిక పోకడలు ఇంట్లో ప్రవేశించకుండా కళ్లెం వేస్తారు. గృహంలో కావల్సిన వస్తు సామాగ్రిని ఏర్పరచుకుంటారు. సంతాన విషయంలో కొద్దిపాటి క్రమశిక్షణ అవసరం అని గ్రహిస్తారు. విద్య, సాంకేతిక, పోటీ పరీక్షలలో రాణిస్తారు. చలన చిత్ర రంగంలోని వారికి కొంత మేరకు అనుకూల కాలం. ఉద్యోగంలో నిపుణత, నైపుణ్యం, సామర్థ్యం మరింత వృద్ధి చేసుకుంటారు. యూనియన్స్, క్లబ్స్, సామాజిక సేవా కేంద్రాలు, క్రీడా సంఘాలు మీకు అనుకూలంగా వుంటాయి. ప్రాధాన్యత పెరుగుతుంది.

జిల్లేడు వత్తులతో విఘ్నేశ్వరుని ప్రార్థించండి. శుభం కలుగుతుంది. విద్యార్థిని విద్యార్థులు సరస్వతీ తిలకం ధరించడం మేలు.

## స్త్రీలకు ప్రత్యేకం

ఈ సంవత్సరం బాగుంది. ముఖ్యంగా, ఆర్థిక విషయాల్లో సంకట స్థితి తొలగిపోయి, స్వేచ్ఛ వస్తుంది. కుటుంబ వ్యవహారాలు అదుపులో ఉంటాయి. బంధువులలో ఓ వర్గానికి సంబంధించిన చికాకులు తొలగిపోతాయి. మీరు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న శుభకార్య ఘడియలు వస్తాయి. మీ వాక్‌చాతుర్యంతో, ఓర్పుతో శుభకార్యాన్ని చక్కబరుస్తారు. ఆర్థికంగా నిలదొక్కుకొనడానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. భూమివల్ల లాభం పొందుతారు. పోటీపరీక్షలు, ఇతర భాషలు నేర్చుకొనడం, సాంకేతిక విద్య మొదలైనవి లాభిస్తాయి.

స్వయంకృషితో ఎంతో కొంత సాధించామన్న సంతృప్తి మిగులుతుంది. మీ స్థాయి, గౌరవం ఆకస్మికంగా పెరుగుతాయి. మనసులో తెలియని సంతోషం, గర్వం, సంతృప్తి కలుగుతుంది. ఇతరులకు హాని చేసే విధంగా మీ చర్యలు, ప్రవర్తన ఉండవు. అన్నీ ఉన్న విస్తరి అణిగి ఉంటుందన్న సామెత మాదిరిగా మీ ప్రవర్తన ఉంటుంది. సంతానానికి సంబంధించి ప్రత్యేక శ్రద్ధ అవసరమవుతుంది. మోకాళ్ళు, పాదాల నొప్పులు ఇబ్బందిపెడతాయి. దూరప్రాంత ప్రయాణాలు చేస్తారు. అవి ఉపయుక్తమైన ప్రయాణాలే. కుటుంబసభ్యుల ప్రవర్తన కారణంగా కొంత అపకీర్తి ఏర్పడుతుంది. జాగ్రత్త వహించండి. దొంగతనాలు జరిగే అవకాశాలున్నాయి జాగ్రత్త. సొంతవాళ్ళ కోసం పరిశ్రమించాల్సిన స్థితి, ఆదుకోవాల్సిన పరిస్థితులు వస్తాయి. తప్పించుకొనడానికి ప్రయత్నించక ధైర్యంగా నిలబడి చేతనయిన సాయం చేస్తారు. బంధువులలో మరో వర్గానికి విరోధం అవుతారు. సంతాన పురోగతి మీద మీరు దృష్టి పెట్టినప్పటికీ ఇంట్లో ఐకమత్యం కరువవుతుంది. మీరు చెప్పే విషయాలను ముఖ్యమైన వ్యక్తి బలపరచకపోవడం వల్ల ఇబ్బందులు తప్పవు. అవివాహితులకు వివాహ కాలము. నిత్యం ఆరావళి కుంకుమతో లక్ష్మీదేవి పూజ చేయండి, శుభప్రదం మంచి ఫలితాలు వస్తాయి. దూరప్రాంతంలో ఉద్యోగ అవకాశం వస్తుంది. లగ్నస్థిత రాహువు వల్ల మీనరాశివారికి ఈ సంవత్సరం చాలావరకు బాగుంది.

## ఆదాయ వ్యయాలు రాజపూజ్య అవమానాలు వాస్తవంలో వీటి వాసి ఎంత?

మేషం నుండి మీనం వరకు గల 12 రాశుల వార్కి శ్రీ పార్థివ సంవత్సరంలోని ఆదాయ, వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానం పంచాంగ ధర్మాన్ని అనుసరించి తెలియజేస్తున్నాను. రాజపూజ్యం-అవమానంకు బదులుగా గౌరవం, అగౌరవం అని వ్రాయడం నాకు పరిపాటి గాన గమనించగలరు. గౌరవం, అగౌరవం అనేది మనస్సుకు సంబంధించినది. దీనికి కొన్ని పాళ్ళను అని (నిర్వచించడం) చెప్పనక్కరలేదు. అన్నీ విడిచిన వాళ్ళకు అగౌరవం ఒక్కపాలైనా, 140 పాళ్ళయినా లెక్కేమిటి? కొన్ని సందర్భాలలో అగౌరవాన్ని ఎత్తి చూపిన వాళ్ళకే సిగ్గుపోతుంది. ఒకప్పుడు దొంగతనమో, హత్య చేసినా ఏదైనా దుర్మార్గమైన పనిచేసినా సమాజం వాళ్ళను వెలివేసినట్లు చూసేది. ఆ వ్యక్తి కుటుంబానికి, వంశానికి సమాజంలో "అవమానం" ఎదురయ్యేది. ఈ రోజుల్లో రెండు మూడు హత్యలు చేసినా వాళ్ళ కన్నా పది పదిహేను హత్యలు చేసిన వాళ్ళుకు గౌరవం ఎక్కువ. వాళ్ళ కుటుంబాలకు కూడా గౌరవం అధికంగానే లభిస్తుంది. వాళ్ళు వస్తే కుర్చీ ఖాళీ చేసి కూర్చోబెట్టి మర్యాదలు చేస్తున్నారు. ఫలానా ఫలానా కేసుల్లో ముద్దాయి, హంతకుడు మా యింటికి వచ్చారు. అని ఘనంగా చెప్పకుంటున్నారు. నేటి సమాజంలో ఎన్ని దుర్మార్గాలు చేస్తే అంత గౌరవం లభిస్తుంది. చదవడానికి మీకు ఎంత ఇబ్బందిగా ఉందో రాయడానికి నాకు ఇబ్బందిగానే ఉంది. కాని ఇది వాస్తవం, కాదనలేని సత్యం మొండి వాదనలు వ్యర్థం. ఇది కలియుగం గదా. చట్టం తనపని తాను చేసుకుపోతుంది. అనే గంభీరమైన నినాదాన్ని గుర్తు చేసుకొని సరిపెట్టుకోవాలి. కనుక ఆదాయ-వ్యయాలు, అవమాన-గౌరవాలు అందరికీ సమంగా వర్తించవు.

ఇక గౌరవం పాళ్ళు నిర్ణయించడం చాలా కష్టమైన పని. ఓ అధికార పదవిలో ఉన్న వారి సంతానమో, బంధువులో ఓ చిన్న "పతకం" తెస్తే వాళ్ళకి తాటికాయంత ప్రచారం సత్కారాలు అదే ఒక సామాన్యుడు గొప్ప విజయం సాధించి తీసుకు

వస్తే తాటికాయంత పతకం తెస్తే వాళ్లకి చింతాకంత గౌరవం, ఆవగింజంత ప్రోత్సాహం లభించదు. సమాజంలో వాస్తవ పరిస్థితి ఇదే కదా ఇందుకు భిన్నంగా ఏమి జరగడం లేదు. గౌరవ ప్రాప్తికి, అగౌరవప్రాప్తికి సమాజంలో అర్థాలు మారిపోయాయి. దేశకాలమాన పరిస్థితులను బట్టి రాజ్యాంగ, సామాజిక విషయముల ప్రామాణికతననుసరించి, గమనించి శాస్త్ర ప్రయోజనాలు అందరికీ ఉపయోగపడేలా తెలియజేయాలని నా అభిప్రాయం. వాస్తవ పరిస్థితులను బేరీజు చేయకుండా తెలియజేస్తే ఆచరణ కష్టం అవుతుంది. ఇబ్బంది కలిగినా వాస్తవాన్ని గ్రహించడం మంచిది కదా. శుభముహూర్తాలు వివాహ, గృహ ప్రవేశాలకు పరిమితం కాదు కార్యసిద్ధి సమయాలు అనేకం ఉంటాయి. కృషి చేసే వారికే ఏ శాస్త్ర ఫలితాలైనా అమలులోకి వచ్చేది. సోమరిపోతులకు ఏ శాస్త్రం వల్ల ప్రయోజనం చేకూరదు. పాస్‌పోర్ట్, వీసా, కోర్టు వ్యవహారాలు, పెళ్లి చూపులు, వాహనం కొనుగోలు, అధికార బాధ్యతల స్వీకృతి, రాయభారాలు, కొనుగోళ్లకు అడ్వాన్సులు, నామినేషన్ పత్రాలు వేయడానికి విద్యసంస్థలలో చేరడానికి నిత్యకృత్యంలో చేసే ముఖ్యమైన పనులకు వ్యక్తిగత జాతకాన్ని అనుసరించి మంచి సమయం నిర్ణయించడం మేలు. ఇందువల్ల చేసే కృషికి జ్యోతిష శాస్త్రపరంగా మీకెంతో మేలు జరుగుతుంది. శాస్త్రం ముఖ్యోద్దేశం ప్రజలకు ఉపయోగపడాలి. ప్రజలు మంచి శాస్త్రాలను ఉపయోగించుకొని మరింత అభివృద్ధి సాధించాలి.

## బుద్ధులను బట్టి గ్రహగతులు నడుస్తాయా !

గ్రహస్థితిని అనుసరించి మంచి, చెడు ఫలితాలు ఉంటాయని జ్యోతిషశాస్త్ర సిద్ధాంతము. అన్ని శాస్త్రాల కెల్లా గొప్పది వేదం. ఈ వేదానికి ధర్మం, న్యాయం, సత్యం అనునవి మూలాధార స్తంభాలు. ధర్మాన్ని రక్షించే ప్రయత్నం చేస్తే ధర్మమే మనల్ని రక్షిస్తుంది. ధర్మాన్ని అనుసరించి ఎవరికి వారు సక్రమంగా నడుచుకుంటే ప్రపంచ స్థితి, దేశ స్థితి, ఇప్పటికంటే భిన్నంగా ఉండేది. మార్పు అనేది ఎక్కువ మందిలో కలిగితేనే సమాజంలో మంచి అయినా చెడు అయినా ప్రభావం చూపుతాయి. ధర్మం ప్రస్తుతం ఒంటికాల మీద కూడా నడవడం లేదు. పూర్తిగా చతికలబడిపోయింది. స్వార్థం, కోరికలు, విలాసాలు, క్షణిక సుఖం అనే అగ్ని జ్వాలలు ధర్మాన్ని చుట్టుముట్టాయి. అందుకే ప్రపంచంలో అశాంతి, అరాచకం అధికమయి పోయింది. మన దేశం గురించి చెప్పాలంటే ధర్మం చాలా రంగాల్లో క్షీణించింది. ఆ ప్రభావం ప్రకృతి రూపంలో, అలవిగాని, మహమ్మారి వ్యాధుల రూపంలో మన దేశాన్ని బాధిస్తుంది. సామూహిక బాధలు, భయాలు, వ్యక్తిగత బాధలు, మానసిక వత్తిడి అధికం అవుతున్నాయి. వీటన్నింటికి కారణం కేవలం "గ్రహస్థితి" ఒక్కటే కాదు. మానవులు నిర్వర్తిస్తున్న కార్యక్రమాలు, ప్రవర్తన, ధర్మాతిక్రమణ కూడా కారణం అయింది. ఎక్కడ చూసిన స్వార్థం, సంకుచిత స్వభావం అధికం అయ్యాయి. నైతిక ధర్మానికి పూర్తిగా "తిలోదాకాలు" అనడం 'అతిశయోక్తి' ఎంత మాత్రం కాదు. కృతజ్ఞత అనేది కుందేటి కొమ్ములా వెదికినా కనిపించనిది అయినది. వ్యక్తులపట్ల, సంస్థలపట్ల, కృతజ్ఞత లేకపోవడం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత లేకపోవడం ఒకెత్తయితే దేశంపట్ల భక్తి కృతజ్ఞత లేకపోవడం ఈ రకమైన స్వార్థం పెరిగిపోవడం తప్పక పరిశీలించదగినది. ఇక్కడి జాతీయ సంపదతో, పుట్టి పెరిగి డాక్టరుగానో, ఇంజనీరుగానో లేక మరొక రంగంలోనే ప్రగతి సాధించినవారు. ఇక్కడ అవకాశాలు లేవని ఇతర దేశాలు వెళ్తున్నారు. జీవితంలో చూడలేమనుకున్నంత ఐశ్వర్యాన్ని అష్టభోగాల్ని అనుభవిస్తున్నారు. జీవితాన్ని సుఖమయం చేసుకుంటున్నారు. స్వదేశం అభివృద్ధికి వారి సంపాదనలో ఒక్క శాతం ఇచ్చినవారు ఎందరున్నారు? ఎంతమందికి మన జాతీయగీతం గుర్తుంది? ఇక్కడి ప్రజలు నానా ఇక్కట్లు పడుతుంటే వారి అభివృద్ధికి దేశ రక్షణ నిధికి, వీరి సహాయ సహకారాలు ఏమాత్రం లభించాయి. గుండెమీద చేయి వేసుకొని ఆత్మసాక్షిగా ఈ దేశాన్ని నేను ఎక్కడున్నా మరిచిపోలేను. నా దేశం నాకు ప్రతిరోజు గుర్తుకొస్తుంది అని చెప్పే వాళ్ళు ఎందరున్నారు ? యోచన చేయండి, గ్రీన్ కార్డ్ రాలేము, ఇంకా సెటిల్ కాలేదు, ఇల్లు కొన్నాం, ఇన్సూరెన్స్ చేశాం, చాలా బిజీగా ఉన్నాం, సమయం తక్కువ. పెళ్లిళ్లకు రాలేము. చచ్చిపోతే శవాన్ని ఓ వారం ఉంచండి. మేము వచ్చాక అంత్యక్రియలు చేయండి. తొందరయితే అన్నీ పూర్తి చేయండి. వీలయినప్పుడు వస్తాం. డాలర్లు మార్చి, మా పేరు మీద ఎస్టేట్స్ కొనండి. అద్దెలు క్రమం తప్పకుండా వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేయండి. ఇదొక తరహా స్వార్థం. మరికొందరు ఇక్కడ ఉన్న

తోటివాళ్ళను బంధువులను తక్కువగా చూడడం. పురుగులుగా ఈసడించడం, ఈ డబ్బు అహంకారం కళ్ళకి ఎగదన్ని మాతృభూమి, ఇక్కడ జనం చేదు అయ్యారు. సాక్షిభూతమైన ఈ విషయాలు నిజం. కొందరి మనస్సు నొచ్చుకున్నా ఇది యదార్థం కాకపోదు. ఈ విధంగా ధర్మం తప్పి చాలామంది 95% ప్రవర్తిస్తుంటే వాళ్ళని ప్రోత్సహించేవాళ్ళు, విదేశీ అవకాశాలు పొంది విదేశాల్లో ఉన్నంతగా ఉన్న వాళ్ళు ఇక్కడి వాళ్ళను దెప్పిపొడవడం, అసమర్థులుగా ప్రచారం చేయడం, విమర్శించడం చేస్తూ, మానసికంగా బాధించేవాళ్ళు ఉన్నారు. చెవులను నిప్పలతో కాల్చిన విధంగా ఉన్న ఈ పదజాలం వాస్తవం. సమాజం పట్ల చిన్న చూపు స్వదేశం మీద జోకులు వేయడం, పగలబడి నవ్వడం విదేశాలు వెళ్ళినా వారు కూడ ఇక్కడ ఉన్న వాళ్ళు కానట్లు ప్రవర్తించే విధానము బాగా పెచ్చరిల్లిపోయింది. ముఖ్యంగా మన దేశంలోనే ఈ వాతావరణం బాగా జీర్ణించుకుపోయింది. సాంప్రదాయాలు, మర్యాదలు, పెద్దంతరం, చిన్నంతరం, దాదాపుగా మృగ్యమైపోయింది. ధర్మాన్ని, నైతిక ధర్మాన్ని మానవుడు విస్మరించి అశాంతిని కొని తెచ్చు కుంటున్నాడు. ఇది చాలనట్లు, పులి చర్మాలు, ఏనుగు దంతాలు, చందనపు చెక్కలు, ఈ దేశ పురాతన సంస్కృతికి నిదర్శనమైన అద్భుత కళాఖండాలు విదేశాలకు కొట్టుకుపోతు న్నాయి. గ్రహస్థితి బాగులేదని బాధపడడానికి దేవుడు దయచూపలేదని విమర్శించేవారికి ముందు ఆత్మపరిశీలన అవసరం. “చూడలేని ప్రతి అంశానికి గ్రహస్థితిని దేవుడిని అడ్డం పెట్టడం అవకాశవాదము అవుతుంది”.

భగవంతుడు, గ్రహాలు, మనకిచ్చిన విజ్ఞానంతో మనం ఏ మేరకు ధర్మాన్ని రక్షించి సక్రమంగా ప్రవర్తించామో. పరిశీలించుకోవలసిన సమయం ఆసన్నమైనది. మన చేతలు, బుద్ధులు కూడా అనుకూల ప్రతికూల ఫలితాలకు కారణం అవుతుందన్న విషయం గ్రహించుట మేలు. స్వదేశాన్ని స్వజనులను భగవంతుని మరిచిపోకుండా చేతనయినంతలో నీ ధర్మాన్ని నీవు సక్రమంగా నిర్వర్తించు. ఈ విధమైన చైతన్యం అందరిలో కలిగినపుడు (ఎక్కువ శాతం) ధర్మం నిలబడుతుంది. ధర్మం నిలబడితే ప్రకృతి శాంతిస్తుంది. గ్రహ బాధలు తగ్గి దుస్సంఘట నలు దూరం అవుతాయి. మానవుని స్వార్థం అధికమయితే మేధస్సు వికటించినపుడు చేదు ఫలితాలే దక్కుతాయి. ఇందుకు దైవాన్ని జాతకాలను, గ్రహాలను, విమర్శించడం, విశ్లేషించడం వృథా.

ములుగు సిద్ధాంతి

## ముందే చెప్పిన ‘వార్త’ పంచాంగం

హైదరాబాద్, డిసెంబర్ 26 ప్రభాతవార్త

ఈ ఏడాది ఏర్పడిన సూర్యచంద్ర గ్రహణాల కారణంగా ప్రపంచ దేశాలకు విపత్కర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయని ‘వార్త’ పంచాంగ సిద్ధాంతి ములుగు రామలిం గేశ్వర ప్రసాదు పంచాంగంలో స్పష్టంగా వ్యాఖ్యానించారు. ‘వార్త’ పంచాంగంలో సిద్ధాంతి అనేక అంశాలను వివరిస్తూ దక్షిణ భారతానికి, ఇండోనేషియా, శ్రీలంక దేశాలలో భూకంపం వచ్చే అవకాశం ఉన్నదని, ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని భవిష్యత్తువాణిని వినిపించారు. సూర్య చంద్ర గ్రహణాలు మేషరాశిలో వచ్చినందుకు ఈ వైపరీత్యాలు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సముద్రగర్భంలో వచ్చిన భూకంపంతో శ్రీలంకలో ఎక్కువ ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన ముందుగానే గణించి వివరించారు. ప్రస్తుతం ఏర్పడిన సప్త గ్రహసంచారం, వివిధ రాశులలో వస్తున్న మార్పుల కారణంగా వైపరీత్యాలు పెరుగుతాయని భక్తిశ్రద్ధలతో తమతమ ఇష్టదైవాలను పూజిస్తే కొంత నివారణకి అవకాశాలు ఉంటాయని ములుగు పేర్కొన్నారు. 2005 మార్చి వరకు ఈ గ్రహస్థితి కొన సాగుతూ ఉంటుందని, అరిష్టాలు పెరుగుతాయని వివరించారు.